www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నెరవేరుతున్న మరో హామీ
ఆటోడ్రైవర్ల సేవలో
శ్రమజీవులకు గౌరవం, స్వావలంబనకు ప్రోత్సాహం

శనివారం | 4-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 169 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి సా.5:10 తదుపరి త్రయోదశి, నక్షత్రం: ధనిష్ఠ ఉ.9:09 తదుపరి శతభిషం, వర్జ్యం: సా.4:00-5:32, దుర్ముహూర్తం: ఉ.6:09-7:43, అమృతఘడియలు: రా.1:09-2:40, రాహుకాలం: ఉ.9:00-10:30, సూర్యోదయం:6:09, సూర్యాస్తమయం: 5:58 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



II ఆంధ్రజ్యోతి

బిజినెస్

విజయవాడ ● శనివారం 4 అక్టోబరు 2025

మన ఆర్థికం పటిష్ఠం

అంతర్జాతీయ ఆటుపోట్లపై బేఫికర్ ● ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు ఆటుపోట్లున్నప్పటికీ మన ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి ఢోకా లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భరోసా ఇచ్చారు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు స్థిరీకరణ శక్తిలా మారిందన్నారు. గత పదేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన చర్యలతో మన ఆర్థిక వ్యవస్థ ఎలాంటి సవాళ్లనైనా తట్టుకునే స్థితికి చేరిందన్నారు. ఢిల్లీలో జరుగుతున్న 'కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్, 2025' సదస్సులో సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశీయ వినియోగం, పెట్టుబడులే మన ఆర్థిక వ్యవస్థకు శ్రీరామరక్షగా మారాయన్నారు. పలు సానుకూల అంశాలున్నా ఎలాంటి అలసత్వానికి తావు లేదని హెచ్చరించారు. ఆర్థిక ఆంక్షలు, సుంకాలు, పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలను మార్చివేస్తున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆమె గతంలో ఎన్నడూ లేని అనిశ్చితి, ఆటుపోట్ల యుగమని ఆమె అభివర్ణించారు.

ప్రైవేటు పెట్టుబడులు: పెరుగుతున్న వ్యాపారావకాశాలతో ప్రైవేటు రంగం పెట్టుబడులపై దృష్టి కేంద్రీకరించిందని, ముఖ్యంగా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టులపై ఆసక్తి చూపిస్తోందని చెప్పారు. గత ఐదేళ్లలో తమ ప్రభుత్వం ఏటికేటికీ ప్రభుత్వ మూలధన పెట్టుబడులను పెంచుకుంటూ పోతున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.11.21 లక్షల కోట్ల ప్రభుత్వ పెట్టుబడుల లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

నెల రోజుల్లో వెండి రూ.24,500 అప్

న్యూఢిల్లీ: పెట్టుబడి లాభాల కోసం చూసే వారిని బంగారం కంటే వెండి మెరిపిస్తోంది. గత నెల కిలో వెండి ధర రూ.24,500 (19.4%) పెరిగి రూ.1,50,500కు చేరి మదుపరులకు మంచి లాభాలు పంచింది. ఇదే సమయంలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) పసిడి ధర రూ.14,300 (13.56 శాతం) లాభంతో రూ.1.2 లక్షలకు చేరింది. సరఫరా అడ్డంకులతో పాటు వెండికి పారిశ్రామిక రంగం నుంచి డిమాండ్ పెరగడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం వెండి ఉత్పత్తిలో 60 నుంచి 70 శాతం వరకు పారిశ్రామిక అవసరాలకే వినియోగమవుతోంది. దీనికి తోడు గత ఆరేళ్లుగా వెండి ఉత్పత్తి, సరఫరా డిమాండ్‌కు తగ్గట్టు లేదు. సౌర విద్యుత్, విద్యుత్ వాహనాలు, 5జీ అవసరాలతో వచ్చే ఏడాది వెండికి మరింత గిరాకీ ఏర్పడుతుందని మార్కెట్ వర్గాల అంచనా. దీంతో ఔన్స్ వెండి ధర వచ్చే ఏడాది జూన్‌కల్లా 1980 జనవరి 17న నమోదైన 49.95 డాలర్ల రికార్డు స్థాయిని అధిగమించి 52-55 డాలర్లకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా శుక్రవారం బంగారం ధరల 5 రోజుల రికార్డు ర్యాలీకి బ్రేక్ వేసింది. ఢిల్లీలో మేలిమి బంగారం 10 గ్రాములు రూ.500 తగ్గి రూ.1,20,600 పలికింది. ఆభరణాల బంగారం సైతం అదే మొత్తంలో తగ్గి రూ.1,20,000 వద్ద స్థిరపడింది. వెండి కూడా రూ.500 తగ్గి రూ.1.50 లక్షలు పలికింది

అణు రియాక్టర్ల ఏర్పాటు రేస్‌లో

అదానీ, రిలయన్స్

న్యూఢిల్లీ: దేశంలో భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల (బీఎస్‌ఎంఆర్) ఏర్పాటుపై అదానీ, రిలయన్స్ కంపెనీలతో పాటు మరో నాలుగు ప్రైవేటు కంపెనీలు ఆసక్తిని ప్రదర్శించాయి. ఇందుకోసం ఆరు రాష్ట్రాల్లో 16 ప్రదేశాలను గుర్తించారు. రియాక్టర్ల ఏర్పాటుకు ఆసక్తి గల కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానిస్తూ భారత అణు ఇంధన సంస్థ (ఎన్‌పీసీఐఎల్) చేసిన ప్రకటనకు అదానీ, రిలయన్స్‌తో పాటు జిందాల్ స్టీల్ అండ్ పవర్, టాటా పవర్, హిండాల్కో ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ స్పందించాయి. ఇలాంటి రియాక్టర్లు ఏర్పాటు చేసేందుకు అనువైన 16 సైట్లను గుర్తించిన ఆయా కంపెనీలు ఆ ప్రదేశాలకు సంబంధించిన ప్రాథమిక నివేదికలను కూడా ఎన్‌పీసీఐఎల్‌కు సమర్పించాయి. ఆ సైట్లలో రెండు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	520
వరంగల్	502	గోదావరి	520
చిత్తూరు	528	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	119
వరంగల్	110	గుంటూరు	125
కరీంనగర్	110	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	114
కర్నూలు	110	నెల్లూరు	119
విశాఖపట్నం	122	అనంతపురం	119
గోదావరి	119		





'నవరాత్రి' అమ్మకాల జాతర

ఇటు పండుగ సందడి, అటు ధరల తగ్గింపు

కొనుగోళ్లకు పోటెత్తిన కస్టమర్లు

న్యూఢిల్లీ: గురువారంతో ముగిసిన దసరా నవరాత్రులు విభిన్న రంగాలకు చెందిన కంపెనీలకు హర్షాతిరేకాన్ని పంచాయి. నిత్యావసర వస్తువులతో పాటు ఆటోమొబైల్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, వినియోగ వస్తువుల కంపెనీలు రికార్డు అమ్మకాలు నమోదు చేశాయి. గత నెల 22 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్‌టీ రేట్ల తగ్గింపు పండుగ కొనుగోళ్లకు కొత్త ఉత్తేజం అందించిందని కంపెనీలు చెబుతున్నాయి. దీనికి తోడు బడ్జెట్లో ప్రకటించిన ఆదాయపు పన్ను మార్పులు కూడా వినియోగవృద్ధికి దోహదపడ్డాయి. జీఎస్‌టీ రేట్లు అమలులోకి వచ్చిన తొలి రోజు నుంచే ప్రజలు తమకు కావలసిన వస్తువులు, గృహోపకరణాలు, కార్ల కొనుగోలుకు పరుగులు తీసినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాదిలో విలువ, పరిమాణంపరంగా రెండంకెల వృద్ధికి ఈ అమ్మకాలు దోహదపడతాయని పలు కంపెనీలు భావిస్తున్నాయి. కేరళలో ఓనం నుంచి ప్రారంభమై దీపావళితో ముగిసే 45 రోజుల పండుగల సీజన్‌లో మిగిలిన రోజుల్లో కూడా ఇదే ఉత్సాహం కొనసాగవచ్చునని ఆశ పడుతున్నాయి.

పెద్ద స్ర్కీన్ టీవీలపై మోజు

కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రంగంలోని ఎల్‌జీ, హేయర్, గోద్రెజ్ అప్లయెన్సెస్ కూడా గత నవరాత్రితో పోల్చితే ఈ సీజన్‌లో భారీగా రెండంకెల అమ్మకాల వృద్ధిని నమోదు చేసినట్టు ప్రకటించాయి. తగ్గిన జీఎస్‌టీ రేట్లను పరిగణనలోకి తీసుకుని ఇప్పటివరకు చిన్న తెర టీవీలను వినియోగిస్తున్న వారు పెద్ద స్ర్కీన్ టీవీలు కొనేందుకు ఆసక్తి చూపారు. అలాగే ఇంధన సామర్థ్యం గల ఎయిర్ కండిషనర్లు కొనుగోలు చేశారు. రెండున్నర లక్షలకు పైగా ధర గల 85-100 అంగుళాల టీవీలు భారీగా అమ్ముడుపోయినట్టు హేయర్ ప్రకటించింది. దేశంలోని అతి పెద్ద రిటైలర్ రిలయన్స్ రిటైల్ అమ్మకాలు 20-25% పెరిగినట్టు తెలుస్తోంది. విజయ్ ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు సైతం 20% పెరిగాయి.



మారుతి అమ్మకాలు పదేళ్ల గరిష్ఠం

కార్ల దిగ్గజం మారుతి పదేళ్ల కాలంలో గరిష్ఠ అమ్మకాలు నమోదు చేసింది. నవరాత్రి తొలి ఎనిమిది రోజుల కాలంలో 1.65 లక్షల కార్లను విక్రయించింది. గత ఏడాది నవరాత్రి పర్వదినాల్లో కంపెనీ 85 వేల కార్లు మాత్రమే విక్రయించింది. ఈ సీజన్‌లో 2 లక్షల అమ్మకాల మైలురాయి చేరగలమన్న ఆశతో ఉంది. దీనికి తోడు ప్రస్తుతం కంపెనీ చేతిలో రెండున్నర లక్షల బుకింగ్‌లున్నాయి. కాగా సెప్టెంబర్ నెలలో తమ ఉత్పత్తి 26% పెరిగి 2,01,915 యూనిట్లకు చేరినట్టు మారుతి తెలిపింది. గత ఏడాది ఇదే నెలలో సంస్థ 1,59,743 యూనిట్లు ఉత్పత్తి చేసింది. కాంపాక్ట్ కార్లు, యుటిలిటీ వెహికల్స్, ఎంట్రీ లెవెల్ మోడళ్లకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ వృద్ధి సాధ్యమైందని కంపెనీ తెలిపింది. టాటా మోటార్స్, మహీంద్రా, హ్యుండయ్ కంపెనీలు కూడా భారీ అమ్మకాలు నమోదు చేసినట్టు ప్రకటించాయి.

త్వరలో వైజాగ్‌లో హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలోని అతి పెద్ద విదేశీ బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌ఎస్‌బీసీ, ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు విస్తరిస్తోంది. వైజాగ్‌తో పాటు దేశంలో మరో 20 చోట్ల బ్రాంచ్‌లు ప్రారంభించేందుకు ఆర్‌బీఐ తమకు అనుమతి ఇచ్చిందని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ఇంటర్నేషనల్ అండ్ ప్రీమియం బ్యాంకింగ్ విభాగం హెడ్ సందీప్ బాత్రా వెల్లడించారు. ఇందులో నాలుగు శాఖలను ఈ ఏడాది చివరిలోగా ఏర్పాటు చేస్తామన్నారు. సరైన ప్రాంతంలో, సరైన భవనం దొరికిన వెంటనే వైజాగ్ బ్రాంచ్ కూడా ప్రారంభమవుతుందన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్డులోని హెచ్‌ఎస్‌బీసీ బ్రాంచ్‌ను హైటెక్ సిటీ సమీపంలోకి మార్చిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆంధ్రజ్యోతి బిజినెస్‌తో ఈ విషయం వెల్లడించారు. ఈ 20 కొత్త శాఖలు ప్రారంభమైతే భారత్‌లో తమ శాఖల సంఖ్య 46కు చేరుతుందన్నారు. హెచ్‌ఎస్‌బీసీ ఇండియాకు హైదరాబాద్ అత్యంత కీలక మార్కెట్ అని బాత్రా చెప్పారు. తమ జీసీసీ కూడా ఇక్కడే ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోని సంపన్న భారతీయులకు ప్రీమియం బ్యాంకింగ్, సంపద నిర్వహణ సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు ఊరట

న్యూఢిల్లీ: ప్రముఖ జువెలరీ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు బొంబాయి హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. కంపెనీ పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ఉన్న వార్తలు, విషయాలను వెంటనే తొలగించాలని బొంబాయి హైకోర్టు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, మీడియా సంస్థలను ఆదేశించింది. జస్టిస్ సందీప్ వీ మర్నే ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ లండన్ బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా అక్కడి స్థానిక సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సేవలను ఉపయోగించుకుంది. దాన్ని విమర్శిస్తూ ఇటీవల మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌పై అనేక ప్రతికూల వార్తలు, కథనాలు మీడియాలో వచ్చాయి. ఆ వార్తలు తమ పరువు,ప్రతిష్ఠలకు భంగం కలిగించే రీతిలో ఉన్నందున వెంటనే వాటిని తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కంపెనీ హైకోర్టును కోరింది. కంపెనీ వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

రెండో రోజూ లాభాల్లో మార్కెట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 223.86 పాయింట్ల లాభాలతో 81,207.17 వద్ద క్లోజ్ కాగా నిఫ్టీ 57.95 పాయింట్ల లాభంతో 24,894.25 వద్ద ముగిసింది. మెటల్ స్టాక్స్‌లో ర్యాలీతో పాటు, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవడం శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్‌కు కలిసొచ్చింది. దీంతో సెన్సెక్స్ ఒక దశలో 81,251.99 పాయింట్ల ఇంట్రా డే హైని తాకింది. శుక్రవారం సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్ షేరు అత్యధికంగా 3.4 శాతం లాభంతో రూ.173.20 వద్ద ముగిసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,18,040 ▼	1,08,200 ▼	1,61,000 ▲
విజయవాడ	1,20,050 ▼	1,14,000 ▼	1,50,000 ▲
విశాఖపట్నం	1,20,620 ▲	1,08,200 ▼	1,61,000 ▲
రాజమండ్రి	1,18,530 ▼	1,08,650 ▼	1,49,800 ▲
ప్రొద్దుటూరు	1,21,900 ▼	1,12,150 ▼	1,50,000 ▲
ముంబై	1,16,954 ▼	1,07,130 ▼	1,45,610 ▲

స్పోర్ట్స్

ఇంగ్లండ్..అదిరే బోణీ

- 10 వికెట్లతో దక్షిణాఫ్రికాపై గెలుపు
- మహిళల వన్డే వరల్డ్ కప్



నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో — ఆస్ట్రేలియా x శ్రీలంక

గువాహటి: వన్డే ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ మహిళలు ఏకంగా 10 వికెట్లతో దక్షిణాఫ్రికాను చిత్తు చేశారు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన సఫారీలు ఇంగ్లండ్ స్పిన్నర్ల ధాటికి కేవలం 20.4 ఓవర్లలోనే 69 పరుగులకు కుప్పకూలారు. తద్వారా ఇంగ్లండ్‌పై అత్యల్ప స్కోరు నమోదు చేశారు. ఇంకా..వరల్డ్ కప్‌లో రెండో అత్యల్ప స్కోరును, ఓవరాల్‌గా మూడో అత్యల్ప స్కోరు సాధించిన చెత్త రికార్డును సౌతాఫ్రికా మహిళలు మూట గట్టుకున్నారు. సినాలో జఫ్టా (22) మినహా మిగిలిన బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం స్వల్ప ఛేదనను ఇంగ్లండ్ 14.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 73 పరుగులతో పూర్తి చేసింది.

సంక్షిప్త స్కోర్లు: దక్షిణాఫ్రికా: 20.4 ఓవర్లలో 69 ఆలౌట్ (సినాలో జఫ్టా 22, లిన్సీ స్మిత్ 3/7, బ్రంట్ 2/5, చార్లీ 2/14, ఎకిల్‌స్టోన్ 2/19); **ఇంగ్లండ్:** 14.1 ఓవర్లలో 73/0 (అమీ 40 నాటౌట్).

పాకిస్థాన్‌కు షాకిచ్చిన బంగ్లాదేశ్

కొలంబోలో గురువారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్‌కు బంగ్లాదేశ్ 7 వికెట్లతో షాకిచ్చింది. మొదట పాకిస్థాన్ 38.3 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌటైంది. రమీన్ (23), ఫాతిమా సనా (22) రాణించారు. షోర్నా 3, నహీదా, మరుఫా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 31.1 ఓవర్లలో 131/3 స్కోరు చేసి గెలుపొందింది. రూబియా (54 నాటౌట్) హాఫ్ సెంచరీ చేసింది.

అమ్మాయిల పోరులోనూ కరచాలనం లేనట్టే!

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచకప్‌లో భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం కీలక పోరు జరగనున్న నేపథ్యంలో కరచాలన అంశం మరోసారి తెరపైకొచ్చింది. ఇటీవలి ఆసియా కప్‌లో సూర్యకుమార్ సేన వ్యవహరించినట్టే భారత అమ్మాయిలు కూడా పాక్ క్రికెటర్లతో కరచాలనం చేయబోరని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. తొలుత జరిగే ఫొటో షూట్, అలాగే టాస్ సమయంలోనూ పాక్ కెప్టెన్‌తో షేక్‌హ్యాండ్‌కు భారత సారథి హర్మన్‌ప్రీత్ దూరంగా ఉంటుందని బోర్డు వర్గాలు తెలిపాయి.



జడేజా (104 బ్యాటింగ్)



రాహుల్ (100)

త్రిశతక మోత

జురెల్, జడేజా, రాహుల్ సెంచరీలు

286 పరుగుల ఆధిక్యం

భారత్ తొలి ఇన్నింగ్స్ 448/5

వెస్టిండీస్ మొదటి ఇన్నింగ్స్ 162 ఆలౌట్

అహ్మదాబాద్: వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ రెండో రోజే భారత్ పూర్తిగా పట్టు బిగించింది. ప్రత్యర్థిని మొదటి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కూల్చిన ఆతిథ్య జట్టు..ముగ్గురు బ్యాటర్లు జురెల్ (125), జడేజా (104 బ్యాటింగ్), కేఎల్ రాహుల్ (100) శతక మోత మోగించడంతో భారీ స్కోరు చేసింది. శుక్రవారం ఆట ఆఖరికి తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లకు 448 పరుగులు సాధించింది. 286 పరుగుల ఆధిక్యం కూడగట్టుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 121/2తో భారత్ రెండోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించగా, కిందటిరోజు బ్యాటర్లు గిల్, రాహుల్ విండీస్ బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొన్నారు. అర్ధ శతకం సాధించిన వెంటనే కెప్టెన్ గిల్ (50) స్పిన్నర్ చేజ్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ కొట్టబోయి నిష్క్రమించాడు. గిల్, రాహుల్ రెండో వికెట్‌కు 98 పరుగులు జోడించారు. మరోవైపు 57 పరుగుల వద్ద లైఫ్ దక్కించుకున్న రాహుల్ ఆపై జాగ్రత్తగా ఆడుతూ సెంచరీ పూర్తి చేశాడు. ఒక చేతితో బ్యాటు పైకెత్తి, మరో చేతి రెండు వేళ్లను నోటిలో ఉంచుకోవడం ద్వారా ఇటీవల పుట్టిన కుమార్తెకు ఈ సెంచరీని రాహుల్ అంకితమిచ్చాడు. కానీ వెంటనే స్పిన్నర్ వారికన్ బౌలింగ్‌లో రాహుల్ పెవిలియన్ చేరాడు.

జడేజా, జురెల్ ద్విశతక భాగస్వామ్యం: రక్షణాత్మక ధోరణిలో బ్యాటింగ్ చేసిన జురెల్ తొలుత మూడంకెల మార్క్ చేరుకున్నాడు. అయితే జురెల్‌ను అవుట్ చేయడం ద్వారా 206 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి లెఫ్టామ్ స్పిన్నర్ పియరీ ముగింపు పలికాడు. మరోవైపు వికెట్ స్పిన్నర్లకు అనుకూలిస్తున్నా జడేజా పరుగులు రాబట్టాడు. స్పిన్నర్ల బౌలింగ్‌లో క్రీజు బయటకు వచ్చి భారీ షాట్లతో అలరించాడు. ఈక్రమంలో అతడు శతకం పూర్తి చేశాడు. రెండోరోజు ఆట ఆఖరికి జడేజాతోపాటు సుందర్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

సైన్యానికి అంకితం

తన టెస్ట్ తొలి శతకాన్ని భారత సైన్యానికి అంకితమిస్తున్నట్టు జురెల్ ప్రకటించాడు. మూడంకెల స్కోరుకు చేరుకోగానే ఆర్మీకితో పాటు కార్గిల్ యుద్ధ యోధుడైన తన తండ్రికి గౌరవ సూచకంగా అతడు సెల్యూట్ చేశాడు.



జురెల్ (125)

3 ఒక ఇన్నింగ్స్‌లో ముగ్గురు భారత బ్యాటర్లు శతకాలు చేయడం ఈ ఏడాది ఇది మూడోసారి. గత పర్యటనలో ఇంగ్లండ్‌పై లీడ్స్, మాంచెస్టర్‌లో ఈ ఘనత సాధించారు.

10 ఓపెనర్‌గా కేఎల్ రాహుల్‌కి పదో శతకం. ఈక్రమంలో తొమ్మిది సెంచరీలు చేసిన రోహిత్‌ను దాటాడు.

80 టెస్ట్‌లలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన భారత బ్యాటర్ జడేజా. ఈక్రమంలో ధోనీని (79)ని అధిగమించాడు. పంత్ (90) టాప్‌లో ఉన్నాడు.

12 సెంచరీ చేసిన 12వ భారత కీపర్ జురెల్.


స్టేడియంలో ప్రేక్షకులేరీ..?

తొలి టెస్ట్‌కు ప్రేక్షకులు కరువయ్యారు. తొలిరోజు గురువారమేకాదు.. రెండోరోజైన శుక్రవారం కూడా స్టాండ్స్ ఖాళీగా దర్శనమిచ్చాయి. రెండ్రోజులు సెలవు దినాలున్నప్పటికీ ప్రేక్షకులు స్టేడియం వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. విండీస్ లాంటి చిన్న జట్టుతో ఆడే మ్యాచ్‌లను ప్రపంచంలోనే అతి పెద్ద (లక్షా 32వేల సీటింగ్) స్టేడియంలో నిర్వహించడమేమిటని క్రికెట్ ప్రేమికులు బీసీసీఐని తప్పుపడుతున్నారు.

స్కోరుబోర్డు

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) జురెల్ (బి) బుమ్రా 8, చందర్‌పాల్ (సి) జురెల్ (బి) సిరాజ్ 0, అథనజె (సి) రాహుల్ (బి) సిరాజ్ 12, బ్రండన్ (బి) సిరాజ్ 13, చేజ్ (సి) జురెల్ (బి) సిరాజ్ 24, హోప్ (బి) కుల్దీప్ 26, గ్రీవ్స్ (బి) బుమ్రా 32, పియరీ (ఎల్బీ) వాషింగ్టన్ 11, వారికన్ (సి) జురెల్ (బి) కుల్దీప్ 8, జొహాన్ (బి) బుమ్రా 1, సీల్స్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 44.1 ఓవర్లలో 162 ఆలౌట్; వికెట్లపతనం:** 1-12, 2-20, 3-39, 4-42, 5-90, 6-105, 7-144, 8-150, 9-153; **బౌలింగ్:** బుమ్రా 14-3-42-3, సిరాజ్ 14-3-40-4, నితీశ్ కుమార్ 4-1-16-0, జడేజా 3-0-15-0, కుల్దీప్ 6.1-0-25-2, వాషింగ్టన్ 3-0-9-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) హోప్ (బి) సీల్స్ 36, కేఎల్ రాహుల్ (సి) గ్రీవ్స్ (బి) వారికన్ 100, సాయి సుదర్శన్ (ఎల్బీ) చేజ్ 7, గిల్ (సి) గ్రీవ్స్ (బి) చేజ్ 50, జురెల్ (సి) హోప్ (బి) పియరీ 125, జడేజా (బ్యాటింగ్) 104, సుందర్ (బ్యాటింగ్) 9; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 128 ఓవర్లలో 448/5; వికెట్లపతనం:** 1-68, 2-90, 3-188, 4-218, 5-424; **బౌలింగ్:** సీల్స్ 19-2-53-1, జొహాన్ లేన్ 15-0-38-0, జస్టిన్ గ్రీవ్స్ 12-4-59-0, జొమెల్ వారికన్ 29-5-102-1, ఖారీ పియరీ 29-1-91-1, చేజ్ 24-3-90-2.



ఔరా..మీరా!

ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రజతం కైవసం

ఫోర్డె (నార్వే): భారత స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మూడోసారి పతకాన్ని కొల్లగొట్టింది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోటీల్లోని 48 కిలోల విభాగంలో మీరా రజతం సాధించింది. స్నాచ్‌లో 84 కిలోలు ఎత్తిన మీరా.. క్లీన్ అండ్ జెర్క్‌లో 115 కిలోలతో కలిపి ఓవరాల్‌గా 199 కేజీలతో రజతం అందుకుంది. లిఫ్ట్ చేసే సమయంలో బొటనవేలి గాయం ఇబ్బంది పెట్టినా, మీరా పతకం నెగ్గడం విశేషం. ఇక రీ సోంగ్ గమ్ (ఉత్తర కొరియా) సరికొత్త ప్రపంచ రికార్డుతో స్వర్ణం దక్కించుకుంది. 2017లో స్వర్ణం, 2022లో రజతం గెలిచిన 31 ఏళ్ల మీరా బాయికి తాజా ప్రదర్శనతో మూడో ప్రపంచ పతకం ఖాతాలో చేరింది.

విదేశీ కోచ్‌లకు కుక్కకాటు



న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం ఇస్తున్న దేశ రాజధాని ఢిల్లీలో ఇద్దరు విదేశీ కోచ్‌లు శునకాల బారిన పడ్డారు. కెన్యా స్ప్రింట్ కోచ్ డెన్నిస్ మరాగియా, జపాన్ జట్టు అసిస్టెంట్ కోచ్ మెయికో ఒకుమట్సును వీధి కుక్కలు కరిచాయి. శుక్రవారం ఉదయం జవహర్‌లాల్ స్టేడియంలోని వామప్ ట్రాక్ వద్ద మెయికోపై, కాల్‌రూమ్ వద్ద డెన్నిస్‌పై కుక్కలు దాడి చేశాయని నిర్వాహకులు వెల్లడించారు. అయితే, అప్రమత్తమైన అక్కడి సిబ్బంది వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకెళ్లారని వివరించారు. చికిత్స అనంతరం కోచ్‌లను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారని తెలిపారు. ఢిల్లీలో వీధి కుక్కల సంఖ్యను తగ్గించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

సిమ్రన్, నిషద్‌కు స్వర్ణాలు

ప్రపంచ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం భారత్ ఖాతాలో నాలుగు పతకాలు చేరాయి. ఇందులో రెండు స్వర్ణాలుండడం విశేషం. మహిళల 100 మీటర్ల టీ12 విభాగంలో సిమ్రన్ శర్మ 11.9 సెకన్లలో రేసును పూర్తి చేసి పసిడి పతకం అందుకుంది. పురుషుల హైజంప్ టీ47 కేటగిరిలో నిషద్ కుమార్ 2.15 మీటర్ల దూరం లంఘించి ఆసియా రికార్డుతో స్వర్ణం కొల్లగొట్టాడు. మహిళల 200 మీటర్ల టీ35 రేసులో ప్రీతిపాల్, పురుషుల డిస్కస్ త్రో ఎఫ్64లో పర్దీప్ కుమార్ కాంస్యాలు గెలిచారు. గురువారం పోటీల్లో ధరంబీర్ క్లబ్ త్రో ఎఫ్51లో రజతం, డిస్కస్ త్రో ఎఫ్57లో అతుల్ కౌశిక్ కాంస్యం సాధించారు. తాజా ప్రదర్శనతో భారత్ 6 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 15 పతకాలతో నాలుగోస్థానంలో నిలిచింది. 37 పతకాలతో బ్రెజిల్ టాప్‌లో ఉంది.

టీ20 ప్రపంచ కప్‌కు జింబాబ్వే, నమీబియా క్వాలిఫై

హరారే: వచ్చే ఏడాది జరిగే పురుషుల టీ20 ప్రపంచకప్‌నకు జింబాబ్వే, నమీబియా అర్హత సాధించాయి. మెగా ఈవెంట్ అర్హతలో భాగం గా జరిగిన ఆఫ్రికా రీజనల్ టోర్నీలో ఈ రెండుజట్లు ఫైనల్ చేరి ప్రపంచ కప్ బెర్త్ దక్కించుకున్నాయి. తొలి సెమీస్‌లో నమీబియా 63 పరుగుల తేడాతో టాంజానియాపై గెలిచింది. రెండో సెమీస్‌లో జింబాబ్వే 7వికెట్లతో కెన్యాను ఓడించింది.

6 బంతుల్లో 6 ఫోర్లు



బ్రియాన్

జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ ప్రపంచ కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో రెండు ప్రపంచ రికార్డులతో సంచలనం సృష్టించాడు. కెన్యాతో సెమీస్ పోరులో అర్ధ సెంచరీ (51) చేసిన బ్రియాన్.. తన ఇన్నింగ్స్‌లో ఆరు బంతుల్లో ఆరు ఫోర్లు బాదాడు. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఆరు ఫోర్లు కొట్టిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇక, గతనెల 30న టాంజానియాపై జింబాబ్వే గెలిచిన మ్యాచ్‌లో 111 పరుగులు చేసిన బ్రియాన్.. తన కెరీర్‌లో తొలి టీ20 సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలోనూ శతకాలు చేసిన పిన్న వయస్కుడిగా 21 ఏళ్ల బ్రియాన్ రికార్డుకెక్కాడు.

రెండో వన్డేలో ఇండియా-ఎ ఓటమి

కాన్పూర్: ఆస్ట్రేలియా-ఎతో అనధికార రెండో వన్డేలో ఇండియా-ఎ జట్టుకు నిరాశ ఎదురైంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఆసీస్-ఎ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 9 వికెట్లతో గెలిచింది. మొదట ఇండియా-ఎ.. తిలక్ వర్మ (94), పరాగ్ (58) అర్ధ సెంచరీలతో సత్తా చాటడంతో 45.5 ఓవర్లలో 246 పరుగులు చేసింది. అనంతరం వర్షం కారణంగా ఆసీస్-ఎ ఛేదనను 25 ఓవర్లలో 160 రన్స్‌గా నిర్దేశించారు. మెకెంజీ (70 నాటౌట్), కూపర్ (50 నాటౌట్) అదరగొట్టడంతో ఆసీస్ 16.4 ఓవర్లలోనే 160/1 స్కోరు చేసి గెలిచింది.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 4-10-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వణికిన ఉత్తరాంధ్ర

ఉమ్మడి విశాఖ, సిక్కోలు జిల్లాలు అతలాకుతలం

- పెనుగాలులకు విరిగిన చెట్లు, స్తంభాలు
- నలుగురి మృతి.. మృతుల్లో వృద్ధ దంపతులు
- కుండపోతతో జనజీవనం అస్తవ్యస్తం 10
- ఉగ్రరూపం దాల్చిన వంశధార, నాగావళి
- హుద్‌హుద్ గుర్తొచ్చి హడలెత్తిన విశాఖవాసులు
- కాసేపు గంటకు 66 కి.మీ. వేగంతో గాలులు


జలదిగ్బంధంలో శ్రీకాకుళం జిల్లా మాతల పంచాయతీలోని పెనుగోటవాడ గ్రామం


2

ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే..

విజయ్ దేవరకొండ, రష్మిక నిశ్చితార్థం

- కుటుంబసభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరు
- ఇద్దరి నడుమ కొన్నేళ్లుగా ప్రేమాయణం.. ఫిబ్రవరిలో పెళ్లి
- నిజజీవితంలోనూ ఒక్కటవనున్న హిట్ పెయిర్

విజయ్‌కు నాయకత్వ లక్షణాలు లేవు!

- అంతమంది మరణిస్తుంటే..
- ఘటనా స్థలం నుంచి పారిపోతారా?
- కనీసం విచారం వ్యక్తం చేయరా? 2
- ఇదేం పార్టీ, ఇదేం విధానం?
- ఇంతమంది చనిపోతే చూస్తూ ఊర్కోలేం
- విజయ్‌పై కేసు ఎందుకు పెట్టలేదు?
- కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టు ఫైర్

ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు 12

అదే నెల 1 నుంచి ప్రాక్టికల్ ఎగ్జామ్స్

ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు ఉత్తర్వులు 12

కంట్రోల్‌లో పెట్టండి

'కట్టు తప్పుతున్న' ఎమ్మెల్యేలతో మాట్లాడండి

- తప్పొప్పులు వారికి తెలియజేయండి
- అయినా వినకుంటే నాకు చెప్పండి
- అసెంబ్లీలో కొందరి తీరు బాలేదు
- సభలో ఏం మాట్లాడాలో ఎమ్మెల్యేలకు చెప్పాల్సిన బాధ్యత మీదే
- ఇన్‌చార్జి మంత్రులకు సీఎం స్పష్టీకరణ
- శాఖాపరంగా విమర్శలకు తావివ్వొద్దు
- విమర్శలొస్తే వెంటనే స్పందించండి
- మంత్రులకు చంద్రబాబు నిర్దేశం


మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్న, మనోహర్, అనిత, లోకేశ్, రవీంద్ర తదితరులు

అమరావతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేల తీరు ఏమీ బాగోలేదని, వారిని అసెంబ్లీ లోపలా బయటా కట్టడి చేయాల్సిన బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రిమండలి సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. క్యాబినెట్ సమావేశం అనంతరం పలు అంశాలపై మంత్రులతో సీఎం మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరుపై ఇన్‌చార్జి మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. "ఇన్‌చార్జి మంత్రులు తమ పరిధిలోని ఎమ్మెల్యేలను నియంత్రించాలి. వారు చేస్తున్న తప్పొప్పులను వారికి తెలియజేసి సరిచేసుకోవాలని కోరాలి. అప్పటికీ వినకుంటే నా దృష్టిలో పెట్టాలి. ఇదంతా ఇన్‌చార్జి మంత్రులే బాధ్యతగా చేయాలి" అని సీఎం వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేలు

మిగతా 11వ పేజీలో...

'ఆటో డ్రైవర్ల సేవలో'!


డ్రైవర్ల సంక్షేమం కోసం కొత్త పథకానికి నేడు బెజవాడలో శ్రీకారం

- హామీ ఇవ్వకున్నా పథకం అమలుకు నిర్ణయం
- క్యాబినెట్ భేటీలో ఏకగ్రీవ ఆమోదం
- 2.90 లక్షల మంది ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు రూ.436 కోట్ల లబ్ధి
- ఒక్కొక్కరికీ రూ. 15 వేల చొప్పున జమ
- ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో డ్రైవర్ల ఆర్థిక సమస్యలు తగ్గించడమే లక్ష్యం

11

అమరావతి కోసం ఎస్పీవీ..

- పనుల వేగవంతానికి క్యాబినెట్ నిర్ణయం
- రాజధానిలో భూసేకరణ నోటిఫికేషన్ నుంచి 343.36 ఎకరాల భూమి మినహాయింపు
- గ్రీన్ హైడ్రోజన్ ప్రచారానికి సలహా కమిటీ
- నీటి సంఘాల్లో ఇద్దరు పిల్లల రూల్ తొలగింపు


11


- కారవాన్ టూరిజానికి ఓకే
- క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు


తొమ్మిది రోజులపాటూ వైభవంగా జరిగిన తిరుమల బ్రహ్మోత్సవాలు గురువారం ముగిసాయి. ఉదయం శ్రీవారి పుష్కరిణిలో వేలాదిమంది భక్తుల మధ్య వేడుకగా చక్రత్తాళ్వారుకు చక్రస్నానం జరిగింది. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు సమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాలు ముగిసిన మర్నాడు శుక్రవారం అనంతాళ్వారుతోటలో బాగ్‌సవారి ఉత్సవం జరిగింది.

ప్రపంచ పటం నుంచి

తుడిచేస్తాం

- ఉనికి మిగలాలంటే ఉగ్రవాదానికి పాకిస్థాన్ సాయం ఆపాలి 2
- సిందూర్ 2.0 ఎంతో దూరంలో లేదు
- ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక
- గీత దాటితే పాక్ గల్లంతే: రాజ్‌నాథ్


ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది

విజయ్‌పై కేసు ఎందుకు పెట్టలేదు!

» కరూర్ తొక్కిసలాటపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కరూర్‌లో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనపై మద్రాస్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ దుర్ఘటనకు సంబంధించి 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ అధినేత విజయ్ వ్యవహరించిన తీరును తప్పుబట్టింది. కళ్లెదుట అంతమంది చనిపోతున్నా పట్టించుకోకుండా ఘటనా స్థలం నుంచి పారిపోతారా..? ఇదేం పార్టీ.. ఇదేం విధానం...? అంటూ మండిపడింది. ఈ ఘటన పట్ల కనీసం విచారం కూడా వ్యక్తం చేయలేదని, ఆ పార్టీ అధ్యక్షుడికి అసలు నాయకత్వ లక్షణాలే లేవనిపిస్తోందని వ్యాఖ్యానించింది. విజయ్‌పై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించింది. 41 మంది చావుకు, 60 మంది గాయపడడానికి కారణమైన ఈ దుర్ఘటన పట్ల ప్రేక్షకపాత్ర వహించలేమంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టేందుకు తమిళనాడు ఉత్తర విభాగ ఐజీ అస్రా గార్గ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది.

26 నుంచి చైనాకు నేరుగా విమానాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 3: చైనా, భారత్‌ల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఐదేళ్ల తరువాత ఇరు దేశాల మధ్య నేరుగా విమానాలు నడవబోతున్నాయి. అక్టోబరు చివరినాటికి ఈ సర్వీసులు అందుబాటులోకి వస్తాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇరు దేశాల పౌరుల మధ్య స్నేహ సంబంధాలు పెరగడానికి ఇది దోహదం చేస్తుందని పేర్కొంది. ఇండిగో, చైనా ఈస్ట్రన్... రెండు సంస్థలు తొలిగా సర్వీసులను నడపడానికి ముందుకు వచ్చాయి.

ఒత్తిళ్లకు భారత్ తలొగ్గదు: పుతిన్

మాస్కో, అక్టోబరు 3: తమ దేశం నుంచి ఇంధన కొనుగోళ్లు నిలిపివేయాలంటూ భారత్‌పై అమెరికా ఒత్తిడి చేస్తుండటాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ తీవ్రంగా తప్పుబట్టారు. అలాంటి ఒత్తిళ్లకు భారత్ ఎప్పటికీ తలొగ్గదని చెప్పారు. ఎలాంటి అవమానాలనూ భరించడానికి కూడా సిద్ధపడదన్నారు. సోచిలోని వల్దాయ్ డిస్కషన్ క్లబ్‌లో జరిగిన ప్లీనరీలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'సమతుల్యంతో ఉండే తెలివైన నేత' అంటూ ప్రధాని మోదీని కొనియాడారు. మాస్కోకు, ఢిల్లీకి మధ్య ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు.

తుర్కియేకు భారీగా భారత పెట్రోలియం

న్యూఢిల్లీ, అక్టోబరు 3: మన దాయాది పాకిస్థాన్‌కు నిత్యం వంతపాడే తుర్కియేకు భారత్ నుంచి పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు భారీగా పెరిగాయి. ఆగస్టులో రోజుకు 20వేల బ్యారెళ్ల శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేయగా.. సెప్టెంబరులో ఏకంగా రోజుకు 56 వేల బ్యారెళ్ల ఎగుమతులు జరిగాయి. మరోవైపు భారత్ నుంచి యూరప్ దేశాలకు డీజిల్ ఎగుమతులు రికార్డు స్థాయిలో పెరిగాయి. సెప్టెంబర్‌లో ఎగుమతులు 97కోట్ల బ్యారెళ్ల నుంచి కోటీ 4లక్షల బ్యారెళ్ల మధ్య ఉండవచ్చని అంచనా.

రహదారి గుంతల్లాంటి అహంకారాన్ని సరిచేసుకోండి

» కర్ణాటక మంత్రికి లోకేశ్ ఘాటు సమాధానం

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు క్రిస్టిన్ మాథ్యూ ఫిలిప్ అక్టోబరు 1న బెంగళూరు ఔటర్ రింగురోడ్డు దుస్థితిపై ఓ ట్వీట్ చేశారు. 'అధ్వానపు రోడ్డు కారణంగా మరిన్ని స్టార్టప్స్, సంస్థలు నార్త్ బెంగళూరు, వైట్‌ఫీల్డ్ వైపు మారేందుకు సిద్ధమవుతున్నాయి' అని ఫిలిప్ పేర్కొన్నారు. తన సందేశానికి ఆయన మారబోతున్న కంపెనీల జాబితాను జత చేశారు. ఈ సందేశం ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఐటీ మంత్రుల మధ్య ఎక్స్‌లో యుద్ధానికి కారణమయింది. మంత్రి లోకేశ్ స్పందిస్తూ... 'ఉత్తరం అనే పదం వినడానికి బాగుంది. ఇంకాస్త ఉత్తరం వైపుగా వస్తే అనంతపురం ఉంది. అక్కడ ప్రపంచ శ్రేణి ఎయిరోస్పేస్, డిఫెన్స్ ఎకో సిస్టమ్‌ను రూపొందిస్తున్నాం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. దానిపై కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రతిస్పందిస్తూ... 'బలహీన పర్యావరణ వ్యవస్థలు బలమైన వ్యవస్థలపై ఆధారపడటం సహజం. అది తప్పేమీ కాదు. అది నిరాశాజనకంగా మారితే... బలాన్ని కాదు, మరింత బలహీనతను చూపుతుంది' అని పేర్కొన్నారు. దీనిపై మంత్రి లోకేశ్ ఘాటుగా స్పందించారు. 'దేశంలోనే అతిచిన్న వయసు కల రాష్ట్రంగా ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోవాలనుకుంటున్నాం. తద్వారా అభివృద్ధి చెందాలని, మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని ఆకాంక్షిస్తున్నాం. మన ప్రయాణం అర్ధాంతరంగా ముగిసిపోకముందే... రోడ్లపై గుంతల్లాంటి అహంకారాన్ని సరిచేసుకోవడం మంచిదని నా వినయపూర్వక సలహా' అంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే..

» విజయ్ దేవరకొండ, రష్మిక నిశ్చితార్థం



'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో జంటగా ప్రేక్షకులను అలరించిన వెండితెర హిట్ పెయిర్ నిజజీవితంలోనూ ఒక్కటవనున్నారు! టాలీవుడ్ యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ, 'పుష్ప' చిత్రంతో నేషనల్ క్రష్‌గా మారిన రష్మిక మందన్న.. వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు! ఇద్దరి మధ్య ప్రేమబంధం ఉందంటూ ఎన్నాళ్లుగానో చక్కర్లు కొడుతున్న ఊహాగానాలు నిజమయ్యాయి!! వీరిద్దరికీ హైదరాబాద్‌లో శుక్రవారం ఉదయం నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. విజయ్ దేవరకొండ స్వగృహంలో జరిగిన ఈ వేడుకకు.. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరు పెళ్లి చేసుకోనున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. వీరిద్దరూ కలిసి నటించిన తొలి చిత్రం 'గీత గోవిందం'. ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. ఆ తర్వాత 'డియర్ కామ్రేడ్'తో ఆ బంధం బలపడింది. అప్పట్నుంచీ ఇద్దరూ ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఇద్దరూ ఒకే లొకేషన్ ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఆ ప్రచారానికి బలం చేకూరింది. ఇప్పుడు నిశ్చితార్థంతో అది నిజమని తేలింది. వీరిద్దరూ కలిసి త్వరలోనే మరో చిత్రంలో కలిసి నటించబోతున్నారు. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే వీరి వివాహం జరగనుందని తెలుస్తోంది. (ఆంధ్రజ్యోతి-సినిమా డెస్క్)

లోకం తీరు



రెండేళ్ల జీతమిచ్చి.. ఉద్యోగుల తొలగింపు



దేశంలోనే అతి పెద్ద ఐటీ దిగ్గజం టీసీఎస్‌లో లే ఆఫ్‌లు

» ఉద్యోగులు సంస్థలో పనిచేసిన కాలాన్ని బట్టి తొలగింపు ప్యాకేజీగా ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వేతనం

న్యూఢిల్లీ, అక్టోబరు 3: దేశంలోని అతి పెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 'సిబ్బంది పునర్వ్యవస్థీకరణ కార్యక్రమం' కింద.. ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ చేపట్టింది. సంస్థ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు లేని, నైపుణ్యాలను పెంచుకోని ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. ఇలా తొలగించే ఉద్యోగులకు 3నెలల వేతనాన్ని 'నోటీస్ పే'గా అందిస్తోంది. దానికి అదనంగా... ఉద్యోగులు టీసీఎస్‌లో ఎంతకాలంగా పనిచేస్తున్నారనే అంశం ఆధారంగా ఆరు నెలల నుంచి రెండేళ్ల వేతనాన్ని తొలగింపు ప్యాకేజీ కింద ఇస్తోంది. ఏ ప్రాజెక్టులోనూ లేనివారికి/ఎనిమిది నెలలకు పైగా బెంచ్‌పై ఉన్నవారికి కేవలం మూడు నెలల వేతనం మాత్రమే ఇచ్చి సాగనంపుతోంది. 10 నుంచి 15 ఏళ్లు సంస్థలో పనిచేసినవారికి ఏడాదిన్నర వేతనం.. 15 ఏళ్లకు పైగా సంస్థలో ఉన్నవారికి రెండేళ్ల వేతనం ఇస్తోంది. పదవీ విరమణ వయసుకు దగ్గరలో ఉన్నవారికి 'టీసీఎస్ కేర్స్' పథకం కింద ముందే పదవీ విరమణ చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. అందులో భాగంగా వారికి పూర్తిస్థాయి పదవీ విరమణ ప్రయోజనాలు, బీమా, అదనంగా తొలగింపు ప్యాకేజీ కింద ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వేతనాన్ని అందిస్తోంది. నానాటికీ పెరుగుతున్న ఏఐ ప్రభావం, క్లైంట్ల డిమాండ్ల మేరకు.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తన సిబ్బందిలో 2% మందిని (దాదాపు 12 వేల మందిని) తగ్గించుకోనున్నట్టు ఈ ఏడాది జూలైలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

వివరాలు చెప్పండి..

ప్రపంచవ్యాప్తంగా తన సిబ్బందిని టీసీఎస్ తొలగిస్తున్న నేపథ్యంలో.. అమెరికాలో నియామకాలకు సంబంధించి టీసీఎస్ అనుసరిస్తున్న విధానాలపై యూఎస్ సెనెటర్లు 9 ప్రశ్నలు సంధించారు. ఈమేరకు సెనెట్ జ్యుడీషియరీ కమిటీ చైర్మన్ చార్లెస్ గ్రాస్‌లే, ర్యాంకింగ్ మెంబర్ రిచర్డ్ డర్బిన్ టీసీఎస్ సీఈవో కె.కృత్తివాసన్‌కు సెప్టెంబరు 24న లేఖ రాశారు. ఇటీవలికాలంలో అమెరికాలోని జాక్సన్‌విల్లేలో దాదాపు 60 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించిన విషయాన్ని అందులో పేర్కొన్నారు. 2025లో టీసీఎస్ సంస్థ 5,505 మంది హెచ్-1బీ ఉద్యోగులను నియమించుకోవడానికి అనుమతి పొందిన నేపథ్యంలో.. ఒకవైపు అమెరికన్లను తొలగిస్తూ.. ఇలా హెచ్-1బీ ఉద్యోగుల కోసం వేలాది పిటిషన్లు దాఖలు చేయడమేమిటని ప్రశ్నించారు. టీసీఎస్ తన కార్యాలయాల్లో ఉద్యోగాలకు తగిన అర్హతలున్న అమెరికన్ ఉద్యోగులను గుర్తించలేకపోవడం నమ్మదగినదిగా లేదని వ్యాఖ్యానించారు. వయసు మళ్లిన అమెరికన్ ఉద్యోగులను తొలగించి.. వారి స్థానాలను దక్షిణాసియా దేశాలకు చెందినవారిని హెచ్-1బీ వీసాలపై తెచ్చి భర్తీ చేస్తోందన్న ఆరోపణలు టీసీఎస్‌పై ఉన్నాయి. దీనిపై 'ఈక్వల్ ఎంప్లాయ్‌మెంట్ ఆపర్చునిటీ కమిషన్' దర్యాప్తు జరుపుతోంది. ఇలాంటి సమయంలో.. అమెరికన్లను హెచ్-1బీ వీసాపై వచ్చినవారితో భర్తీచేయడం సంస్థకు ఏవిధంగానూ మేలు చేయదని సెనెటర్లు తమ లేఖలో పేర్కొన్నారు. హెచ్-1బీ వీసాపై తెచ్చినవారితో అమెరికన్ ఉద్యోగుల స్థానాన్ని భర్తీ చేస్తున్నారా? హెచ్-1బీ వీసాలపై వచ్చినవారికి అమెరికన్ ఉద్యోగులకు చెల్లించే వేతనాల్లో తేడాలు ఎంత? వంటి ప్రశ్నలు అడిగి.. 10వ తేదీలోగా వాటికి పూర్తి వివరాలతో సమాధానాలు ఇవ్వాలని కోరారు.

రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు మందు ఇవ్వొద్దు

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ, అక్టోబరు 3: రెండేళ్లలోపు వయసున్న పిల్లలకు దగ్గు, జలుబుకు సంబంధించిన మందులు ఇవ్వొద్దని (ప్రిస్క్రైబ్ చేయొద్దని) కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) నిర్దేశించింది. మధ్యప్రదేశ్‌లో కలుషితమైన కాఫ్ సిరప్‌ల కారణంగా పిల్లలు మృత్యువాతపడినట్లుగా వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ అవ్వడం గమనార్హం. సాధారణంగా ఐదేళ్లలోపు వయసున్న పిల్లలకు కాఫ్ సిరప్‌ను సిఫారసు చేయొద్దని, ఒకవేళ అవసరం అనుకుంటే వైద్య నిపుణుల పర్యవేక్షణలో సరైన మోతాదులో ఇవ్వాలని సూచించింది. పిల్లలకు వచ్చే తీవ్రమైన దగ్గుతో కూడిన అస్వస్థత సాధారణంగా దానికదే తగ్గిపోతుందని.. ఇందుకు ఔషధాలు అవసరం లేకుండా, బాధిత చిన్నారులకు బాగా విశ్రాంతినివ్వడం అనేది మొదటి ప్రాధాన్యంగా ఉండాలని డీజీహెచ్ఎస్ వైద్యురాలు డాక్టర్ సునీతా శర్మ సూచించారు.

అమెరికా వర్సిటీల్లో విదేశీ విద్యార్థుల ప్రవేశాలు 15% మించొద్దు

అమెరికా వర్సిటీలకు ట్రంప్ సర్కారు మెమో

వాషింగ్టన్, అక్టోబరు 3: హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసి.. విదేశీ నిపుణులు అమెరికాలోకి రాకుండా అడ్డం కొట్టిన ట్రంప్.. ఇప్పుడు విదేశీ విద్యార్థుల ప్రవేశాలకూ అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపట్టారు! ఇందుకు సంబంధించిన నిబంధనలతో అమెరికాలోని తొమ్మిది ప్రఖ్యాత యూనివర్సిటీలు, విద్యాసంస్థలకు పది సూత్రాల మెమో పంపించారు. ఆ పది సూత్రాలనూ ఆమోదించి సంతకం పెట్టి, ఆ మేరకు తమ విధానాలను మార్చుకుంటే.. ప్రభుత్వ నిధులను సమకూర్చడంతో పాటు బోలెడన్ని ప్రయోజనాలను కల్పిస్తానంటూ ఆయా విద్యాసంస్థలను ఊరించే ప్రయత్నం చేశారు. వాటిని పాటించకపోతే ఆయా విద్యాసంస్థలకు అందే ఫెడరల్ నిధులు, గ్రాంట్లను నిలిపివేస్తామని, పైపెచ్చు వాటిపై అమెరికా న్యాయశాఖ పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. ఆ పది సూత్రాలూ ఏంటంటే.. అమెరికా వర్సిటీల్లో అంతర్జాతీయ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థుల ప్రవేశాలు 15% మించకూడదు. ఇలా చేరే విదేశీ విద్యార్థుల్లో ఒక దేశం నుంచీ 5 శాతం మందికి మించి ఉండకూడదు. విదేశీ విద్యార్థుల చేరికలు, అధ్యాపకుల నియామకాల్లో జాతి, లింగం ఆధారంగా నిర్ణయాలు తీసుకోకూడదు. పూర్తిగా ప్రతిభ ఆధారంగా మాత్రమే ప్రవేశాలు, నియామకాలు ఉండాలి. విద్యార్థుల నుంచి వసూలు చేసే ట్యూషన్ ఫీజును ఐదేళ్లపాటు పెంచకూడదు. ప్రామాణిక పరీక్షల్లో ఉత్తీర్ణత తప్పనిసరి. గతంలో అమెరికా కాలేజీల్లో చేరడానికి.. స్కాలిస్టిక్ ఎసెస్‌మెంట్ టెస్ట్ (శాట్) వంటి ప్రామాణిక పరీక్షల్లో అర్హత సాధించడం తప్పనిసరి నిబంధనగా ఉండేది. కానీ ఇటీవలికాలంలో చాలా కాలేజీలు 'టెస్ట్ ఆప్షనల్ పాలసీ'లను అనుసరించి శాట్/తత్సమాన ప్రామాణిక పరీక్షలు రాయనివారికి కూడా ప్రవేశం కల్పిస్తున్నాయి. విద్యార్థులకు మార్కులు ఇవ్వడంలో కఠిన ప్రమాణాలను పాటించాలని ఈ మెమోలో సూచించారు. అప్పుడు నిజంగా అత్యుత్తమ ప్రతిభ కలిగినవారికి మాత్రమే అత్యుత్తమ గ్రేడ్‌లు వస్తాయి. విదేశీ విద్యార్థులు అమెరికన్/పాశ్చాత్య విలువలకు మద్దతిస్తున్నారా లేదా చూడాలి. అమెరికా/దాని మిత్రదేశాల పట్ల వైరం చూపించేవారిని ప్రవేశ దశలోనే అడ్డుకోవాలి. విదేశీ విద్యార్థుల క్రమశిక్షణ రికార్డులు సహా వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని యూనివర్సిటీలు అమెరికా విదేశాంగ శాఖతో, 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్)'తో పంచుకోవాలి. ఇదిలా ఉండగా, అమెరికాలో ట్రంప్ వచ్చినప్పటి నుంచి జరుగుతున్న హడావుడి చూసి ఆ దేశానికి చదువు కోసం వెళ్లే విద్యార్థుల సంఖ్య ఇప్పటికే తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే.. ఈ ఏడాది అమెరికన్ వర్సిటీల్లో చేరిన విదేశీ విద్యార్థుల సంఖ్య 19% మేర తగ్గింది.

ప్రపంచపటం నుంచి తుడిచేస్తాం

పాకిస్థాన్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక



దసరా రోజున భుజ్‌లో ఆయుధపూజ చేస్తున్న రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ/భుజ్, అక్టోబరు 3: ఉగ్రవాదానికి ఊతమిచ్చే చర్యలను నిలిపివేయకపోతే ప్రపంచ పటం నుంచి తుడిచేస్తామంటూ దాయాది పాక్‌ను ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. రాజస్థాన్‌లోని అనూప్‌గఢ్‌లోని సైనిక పోస్టును శుక్రవారం ఆయన సందర్శించారు. 'ఈసారి వెనక్కి తగ్గేది లేదు. ఆపరేషన్ సిందూర్ రెండో దశ ఎంతో దూరంలో లేదు. అది 1.0లా ఉండదు. భౌగోళిక పటంలో తన దేశం ఉండాలా వద్దా అనేది పాక్ నిర్ణయించుకోవాల్సి వస్తుంది. ఒకవేళ భౌతికంగా అస్తిత్వంలో ఉండాలనుకుంటే రాజ్య ప్రోత్సాహిత ఉగ్రవాదాన్ని తక్షణం కట్టిపెట్టాలి' అని స్పష్టం చేశారు. భగవంతుడు కోరుకుంటే త్వరలోనే ఆ 'అవకాశం' వస్తుందంటూ...ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం సిద్ధంగా ఉండాలని సైనికులను ఆయన కోరారు.

ఖబడ్దార్: రాజ్‌నాథ్ సింగ్

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం గుజరాత్‌లోని భుజ్ సరిహద్దు ప్రాంతంలో సైనికులతో కలిసి దసరా వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాక్‌పై విరుచుకుపడ్డారు. సర్ క్రీక్ వద్ద దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని, చరిత్రను..భౌగోళిక స్వరూపాన్నీ మార్చివేస్తామని హెచ్చరించారు. వివాదాస్పద సర్ క్రీక్ ప్రాంతంలోకి తన సైనిక నిర్మాణాలను పాక్ విస్తరిస్తున్నట్టు వస్తున్న వార్తలపై ఆయన ఇలా స్పందించారు. "1965 యుద్ధంతోపాటు సిందూర్‌ను కూడా పాకిస్థాన్ గుర్తుపెట్టుకోవాలి. రెండు సందర్భాల్లోనూ లాహోర్ వరకు వెళ్లి మన వాయుసేన తన సత్తా చాటింది. కరాచీకి వెళ్లే రహదారి సర్ క్రీక్ గుండానే పోతుందనేది దాయాది దేశం మరవొద్దు" అని రాజ్‌నాథ్ హెచ్చరించారు. కాగా, సైనికులతో కలిసి ఆయుధ పూజలో పాల్గొన్న ఆయన, సర్ క్రీక్ ప్రాంతాన్ని శక్తివంతం చేస్తూ నెలకొల్పిన జాయింట్ కంట్రోల్ సెంటరును, టైడల్ బెర్తింగ్ వ్యవస్థను ప్రారంభించారు.

ఏమిటీ సర్ క్రీక్ వివాదం?

భారత్, పాకిస్థాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదాల్లో 'సర్ క్రీక్' ఒక ముఖ్యమైన అంశం. వ్యూహాత్మక, ఆర్థిక, భద్రత దృష్ట్యా ఇరు దేశాలకూ ప్రాధాన్యం కలిగిన ప్రాంతం. గుజరాత్‌లోని రాణ్ ఆఫ్ కచ్, పాకిస్థాన్ మధ్య ఉండే సముద్ర తీర ఉప్పు నీటి కాలువనే 'సర్ క్రీక్'గా పిలుస్తారు. ఇది 100 కిలోమీటర్ల కంటే తక్కువ పొడవు ఉంటుంది. 'సర్ క్రీక్'లో సగం తమదని భారత్ వాదిస్తోంది. పాకిస్థాన్‌లో అతిపెద్ద వాణిజ్య కేంద్రమైన కరాచీకి, అక్కడి పోర్టుకు నేరుగా చేరుకొనేందుకు సర్ క్రీక్ గుండానే ప్రయాణించాల్సి ఉంటుంది.

పది పాక్ జెట్లను ధ్వంసం చేశాం

కూల్చినవాటిలో ఎఫ్-16, ఎస్‌జే-17లు

వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ ప్రకటన

ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాల సమన్వయంతో దాయాది పాక్‌ను చావుదెబ్బ కొట్టగలిగామని వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌లోకి 300 కిలోమీటర్ల మేర దూసుకెళ్లామని, ఇంత విస్తారమైన భూభాగంలోకి చొచ్చుకెళ్లడం ఇదే తొలిసారి అని (లాంగెస్ట్ కిల్) తెలిపారు. 93వ వాయుసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తొలిసారి ఆయన పాక్‌కు కలిగిన యుద్ధ నష్టాలను లెక్కలతోసహా వివరించారు. "పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్లను ధ్వంసం చేశాం. కూల్చివేసిన ఆరేడు జెట్లలో ఎఫ్-16లు (అమెరికా), జేఎఫ్-17(చైనా) కూడా ఉన్నాయి. 11 వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ దాడులు మొదలుపెట్టడంతో పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చింది" అని అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. 4రోజులు సాగిన యుద్ధంపై పాక్ కథనాలు 'మనోహరం'గా ఉన్నాయని, వాటితోనే వారిని సంతృప్తి పడనీయండంటూ ఆయన ఎద్దేవా చేశారు. మనవి 15 ఫైటర్ జెట్లను కూల్చివేశామన్న భ్రమల్లోనే బతికేస్తామంటే, అలాగే వారు చేయవచ్చునన్నారు.

ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టుకు.. గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్లేదిలా..!



- » తెలంగాణలోని 2 జిల్లాలు.. 40 గ్రామాలు
  ఏపీ పరిధిలోని 3 జిల్లాలు.. 60 గ్రామాలు
- » ప్రాథమికంగా అలైన్‌మెంట్ రూపకల్పన
- » డీపీఆర్ కన్సల్టెంట్స్ నియామకానికి కసరత్తు
- » డిసెంబరుకు పూర్తిస్థాయి అలైన్‌మెంట్ వచ్చే చాన్స్
- » 'ఆంధ్రజ్యోతి' చేతికి 12 వరుసల హైవే వివరాలు

హైదరాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకూ ప్రతిపాదిస్తున్న 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా రూపొందించింది. ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాథమిక అలైన్‌మెంట్, రూట్ మ్యాప్ వివరాలు 'ఆంధ్రజ్యోతి'కి లభించాయి. దాని ప్రకారం.. ప్రతిపాదిత మార్గం 2 రాష్ట్రాలు.. 5 జిల్లాలు, 100 గ్రామాల మీదుగా వెళ్లనుంది. వీటిలో తెలంగాణ పరిధిలో 2 జిల్లాల్లోని 40 గ్రామాలు ఉండగా.. ఏపీ పరిధిలో 3 జిల్లాల్లోని 60 గ్రామాల పక్కనుంచి హైవే వెళ్లనుంది. ఈ మేరకు ఆయా జిల్లాలు, గ్రామాల వారీగా ప్రాథమికంగా అలైన్‌మెంట్ రూపుదిద్దుకుంది. కేంద్రం ఆమోదిస్తే దీని ప్రకారమే హైవే ఉండనుంది. ఇక, ఈ అలైన్‌మెంట్‌కు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) పనులు కూడా ఊపందుకున్నాయి. ఒకవేళ ఏపీ ప్రభుత్వం ఏమైనా మార్పులు సూచిస్తే వాటిని మళ్లీ తెలంగాణ సర్కారుకు వివరించి, ఆ మేరకు అలైన్‌మెంట్‌లో మార్పులు చేయనుందని అధికారికవర్గాలు వివరించాయి. అక్టోబరు మూడో వారానికి కన్సల్టెన్సీ ఎంపికైతే డిసెంబరునాటికి పూర్తిస్థాయి అలైన్‌మెంట్ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల మీదుగా..

ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా మచిలీపట్నం దగ్గరున్న బందరు పోర్టుకు వెళ్లే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ప్రాథమిక అలైన్‌మెంట్ ప్రకారం తెలంగాణలోని ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని దాదాపు 40 గ్రామాల పక్క నుంచి వెళ్లనుంది. ఇక, తెలంగాణ సరిహద్దు ముగిసి.. ఏపీ భూభాగంలోకి ప్రవేశించిన తర్వాత కృష్ణా, గుంటూరు (అమరావతి క్యాపిటల్ సిటీ), పల్నాడు జిల్లాల మీదుగా బందరు పోర్టు వరకు 60 గ్రామాల పక్క నుంచి రహదారి ఉండనుంది. దీని మొత్తం పొడవు 297 కిలోమీటర్లుగా అలైన్‌మెంట్‌లో పేర్కొన్నారు.

కారిడార్ దూరం.. కిలోమీటర్లు ఇలా..

- ఫ్యూచర్ సిటీ టు బందరు పోర్టు వరకు 297.82 కి.మీ
- ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు 212.5 కి.మీ
- ఫ్యూచర్ సిటీ టు తెలంగాణ సరిహద్దు వరకు 118 కి.మీ.
- తెలంగాణ సరిహద్దు అడవిదేవులపల్లి నుంచి అమరావతి (తాడికొండ) వరకు 94.5 కి.మీ.
- తెలంగాణ సరిహద్దు నుంచి బందరు పోర్టు వరకు 179.82 కి.మీ.
- అమరావతి నుంచి బందరు పోర్టుకు 85.32 కి.మీ.

ఏపీ పరిధిలోని 60 గ్రామాలు ఇవే..

ఏపీ పరిధిలో 60 గ్రామాల మీదుగా హైవే వెళ్లనుంది. అవి.. కల్లేపల్లి, ధైద, వజీరాబాద్, పులిపాడు, దాచేపల్లి, ముత్యాలంపాడు, పిన్నెల్లి, వేమవరం, మాచవరం, తురకపాలెం, మోర్జంపాడు, పిల్లుట్ల, శ్రీరుక్మిణీపురం, పాపాయ పాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు, అమరావతి, పెరికపాడు, దొడ్లేరు, హస్సన్‌బండ, అనంతారం, గుడిపాడు, తళ్లూరు, పెనపాడు, రెంటపల్లి, పండితాపురం, అమరావతి, పాటిబండ్ల, వేమారం, సిరిపురం, మందెపూడి, పాములపాడు, పొన్నెకల్లు, నిడుముక్కల, తాడికొండ, లామ్, గోరంట్ల, గుంటూరు, కంతేరు, కాజ, నంబూరు, చిలువూరు, పెర్కలపూడి, దుగ్గిరాల, వల్లభాపురం, మున్నంగి, వల్లూరు, భద్రిరాజుపాలెం, కుమ్మమూరు, కపిలేశ్వరపురం, లంకపల్లి, చల్లపల్లి, నిమ్మకూరు, నిడుమూరు, గూడూరు, పెడన, మచిలీపట్నం. ఈ గ్రామాల పక్కగా అలైన్‌మెంట్ ఉన్నప్పటికీ దీనిపై ఇంకా ఏపీ ప్రభుత్వం ఎలాంటి అభిప్రాయాలు తెలపలేదు. డీపీఆర్ కన్సల్టెన్సీ ఎంపికైన తర్వాత పూర్తిస్థాయి అలైన్‌మెంట్ ఖరారుకు వీటిలో కొంతమేర మార్పులు ఉండొచ్చని తెలిసింది.

తిరుమలలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

వైభవంగా పుష్కరిణిలో చక్రస్నానం

తిరుమల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో గురువారం ముగిసాయి. సెప్టెంబరు 24న బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. గురువారం తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు స్వామికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. 6 నుంచి వరాహ స్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామికి, శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కూడా ఇదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించారు.


చక్రస్నానం సందర్భంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో మునక వేయిస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో 5.8 లక్షల మందికి దర్శనం: టీటీడీ చైర్మన్

తిరుమల బ్రహ్మోత్సవాల్లో 5.80 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. చక్రస్నానం అనంతరం ఆయన టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవనంలో మీడియాతో మాట్లాడారు. 26 లక్షల మందికి పైగా అన్నప్రసాదాలు అందించామని, 28 లక్షలకుపైగా లడ్డూలు విక్రయించామని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో రూ.25.12 కోట్ల హుండీ ఆదాయం లభించిందన్నారు. గరుడ వాహన సేవ రోజున హోల్డింగ్ పాయింట్ల ద్వారా 30 వేలు, రీఫిల్లింగ్ ద్వారా మరో 15 వేల మందికి అదనంగా దర్శనం చేయించామని తెలిపారు. బ్రహ్మోత్సవాలను దిగ్విజయం చేసిన టీటీడీ అర్చక స్వాములు, అధికారులు, ఉద్యోగులు, జిల్లా, పోలీసు యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా, భక్తులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ట్వీట్ ద్వారా హర్షం వ్యక్తం చేసిన అంశాన్ని చైర్మన్ గుర్తు చేశారు.

మాడ వీధుల్లోని గ్యాలరీలపై షెల్టర్లు: ఈవో

శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలోనూ బ్రహ్మోత్సవాల ప్రస్తావన వచ్చింది. భక్తుల సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించామని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. గరుడ వాహన సేవ రోజున ఉదయం ఎండ తీవ్రత, మధ్యాహ్నం మూడు సార్లు వర్షం పడిందని, భక్తుల విజ్ఞప్తి మేరకు నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా షెల్టర్ల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్టు ఈవో వెల్లడించారు.


గరుడ పటాన్ని కిందకు దించి హారతి ఇస్తున్న అర్చకులు

నిజ రూపంలో భ్రమరాంబదేవి దర్శనం

- నంది వాహనంపై విహరించిన ఆది దంపతులు
- శ్రీశైలంలో ముగిసిన దసరా ఉత్సవాలు

శ్రీశైలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో చివరి రోజైన గురువారం శ్రీశైలంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. విజయదశమి పర్వదినాన అమ్మవారు నిజ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవను అశేష భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద తెప్పోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఉదయం అమ్మవారి యాగశాలలో చండీయాగ పూర్ణాహుతి, స్వామి వారి యాగశాలలో రుద్ర యాగ పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు. అనంతరం చండీశ్వరస్వామికి మల్లికార్జున గుండం వద్ద అవబుధస్నానం నిర్వహించారు.


నిజరూపంలో దర్శనమిస్తున్న భ్రమరాంబదేవి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


తిరుమల ఆలయం ముందు జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి

తిరుమల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకోగా, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.కార్తీక్, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ శర్మ, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బుశ్వాన్ గోయల్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజాస్వామిక వెలుగుబాటలు

లార్డ్ రిప్పన్ (ఆధునిక భారతీయ స్థానిక ప్రభుత్వాల పితామహుడు) నుంచి భారత రాజ్యాంగ సభ (1946) వరకు, ప్రాచీన గ్రామీణ పంచాయతీ వ్యవస్థ పునరుద్ధరణకు ఉద్దేశించిన 40వ ఆదేశిక సూత్రం నుంచి 73, 74వ రాజ్యాంగ సవరణల దాకా స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ పరిణామ చరిత్ర స్ఫూర్తిదాయకమైనది. ప్రజాస్వామిక నాగరీకంలో ప్రజలను సుశిక్షితులను చేస్తున్న ప్రాథమిక పాఠశాల స్థానిక ఎన్నికల వ్యవస్థ. తెలంగాణ రాష్ట్రం మరోసారి ఈ ఎన్నికలకు సంసిద్ధమవుతోంది. ఎస్సీ, ఎస్టీ, మహిళలతో పాటు జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకూ రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించడంతో ఈ స్థానిక ఎన్నికలు మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. తొలుత పాలనా వ్యవస్థలో, దరిమిలా రాజకీయ రంగంలో కొత్త యువ నాయకత్వం ప్రభవించేందుకు ఈ ప్రజాస్వామ్య పోరు దోహదం చేయనున్నది.

సుదూర గతంలో ప్రతి గ్రామమూ ఒక గణతంత్ర రాజ్యంగా విలసిల్లుతుండేది. గ్రామస్తులు సమష్టిగా నిర్ణయాలు తీసుకునేవారు. స్థానిక పాలనకు బాధ్యత వహించే గ్రామ పెద్దలను 'గ్రామిక'లుగా కౌటిల్యుని 'అర్థశాస్త్రం' పేర్కొంది. రాచరికాలు ప్రబలి, సామ్రాజ్యాలు విస్తరిల్లిన తరువాత, ముఖ్యంగా బ్రిటిష్ వలసపాలనలో ఆ గ్రామీణ అధికార వికేంద్రీకరణ వ్యవస్థ పూర్తిగా ఛిద్రమైపోయింది. 1992లో 73, 74 రాజ్యాంగ సవరణలతో స్థానిక ప్రభుత్వాలకు వినూత్న ప్రజాస్వామిక స్వరూప స్వభావాలు సమకూరాయి. అణగారిన సామాజిక వర్గాల వారు రాజకీయ అధికారంలో భాగస్వాములు అయ్యారు. మరీ ముఖ్యంగా మహిళా సాధికారితకు ఇతోధిక దోహదం చేకూరింది. పలువురు మహిళలు పంచాయత్ సభ్యులుగా ప్రారంభమై శాసనసభ, పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావించి తీరాలి. 1997లో ఒడిషాలో ఒక ఆదివాసీ గ్రామ పంచాయత్ వార్డు సభ్యురాలుగా ఎన్నికైన ముర్ము ఆ రాష్ట్ర శాసనసభకు రెండుసార్లు ఎన్నికై ఆ తరువాత జార్ఖండ్ గవర్నర్‌గా పనిచేసి ఇప్పుడు భారత గణతంత్ర రాజ్య సార్వభౌమాధినేతగా ఉన్నారు. ఈ స్ఫూర్తిదాయక ఆదివాసీ విజయగాథ 73వ రాజ్యాంగ సవరణతోనే సుసాధ్యమయింది.

ఇదలా ఉంచితే ప్రభుత్వాలు ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవడం ఎంత ముఖ్యమో వాటి అమలులో చిత్తశుద్ధి పాటించడం అంతకంటే ముఖ్యం. గత సార్వత్రిక, తదనంతర అసెంబ్లీ ఎన్నికలలో నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ప్రజాస్వామ్య నైతిక సూత్రమైన ఓటు హక్కు లక్షలాది ప్రజలకు లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ ఆ విషయమై ఎన్నికల సంఘంకు వ్యతిరేకంగా పెద్ద పోరాటమే చేస్తున్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు ఎన్నికలలో పోటీ చేసేందుకు అనర్హులన్న నిబంధనను కొనసాగిండం ముదావహం. అయితే సర్పంచ్, ఇతర వార్డు సభ్యులను ఏకాభి ప్రాయంతో ఎన్నుకోవడాన్ని నగదు బహుమానాలతో ప్రోత్సహించే పద్ధతికి స్వస్తి చెప్పితీరాలి. ఎందుకంటే అది ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలహీనపరుస్తుంది.

'ప్రతి గ్రామం స్వావలంబనతో తన వ్యవహారాలను తానే నడుపుకోగలగాలి. ప్రపంచం మొత్తం ప్రతి కూలమయినా తనను తాను సంరక్షించుకోగలగాలి' అని గాంధీజీ పంచాయత్ వ్యవస్థకు ఆశయ నిర్దేశం చేశారు. ఈ ఆశయ సాధనకు మన 11వ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం ఒక ఆచరణాత్మక మార్గాన్ని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామాలకు అభివృద్ధి సామర్థ్యం కలిగించడమే ఆ నిర్మాణాత్మక బాట. ఆధునికీకరణకు ప్రగతిశీల రాజకీయాలే ప్రాతిపదిక కావడమనేది స్వతంత్ర భారతదేశ చరిత్ర విశిష్టత. ఈ దృష్ట్యా దళితులు, గిరిజనులు, మహిళలు, వెనుకబడిన వర్గాల వారికి పాలనావ్యవస్థ ల్లోనూ రాజకీయ అధికారంలోనూ గణనీయమైన భాగస్వామ్యం కల్పించేందుకు దోహదం చేస్తూ ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ ఔన్నత్యానికి వెలుగు బాటలు వేయాలి.

యుద్ధాల చీకటిలో మానవత



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

'ఇక యుద్ధం వద్దు, ఇంకెప్పుడూ యుద్ధం వద్దు' అని 1965లోనే పోప్ ఆరవ పాల్ ఘోషించారు. శాంతిని కోరుకునేవారు ఆయనను అభిమానించకుండా ఎలా ఉంటారు? యుద్ధాలు ఏ సమస్యనూ పరిష్కరించవు. శత్రుత్వాన్ని, విద్వేషాన్ని మాత్రమే పెంపొందిస్తాయి. 1945లో 51 దేశాలు సమున్నత ఆశయాలతో ఐక్యరాజ్యసమితిని సృష్టించాయి. అన్ని దేశాలూ శాంతి సామరస్యాలతో శాంతియుత సహజీవనం చేస్తూ సంపద్వంతం చేస్తూ తమ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తాయని ఆశించాయి. చరిత్ర చెప్పిందేమిటి? ఐక్యరాజ్యసమితి విఫలమయిందనే కాదూ? ఆ ప్రపంచ సంస్థ చూస్తుండగానే గత ఎనిమిది దశాబ్దాలలో అనేక యుద్ధాలు జరిగాయి. ప్రస్తుతం రెండు యుద్ధాలు ప్రపంచాన్ని కుదిపివేస్తున్నాయి.


ఉక్రెయిన్ యుద్ధం ఫిబ్రవరి 24, 2022న ఆరంభమయింది. ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడంతో ప్రజ్వరిల్లిన ఈ యుద్ధాగ్నులు ఇప్పటికీ ఆరలేదు. ఎప్పటికి ఆరిపోతాయో తెలియదు. సోవియట్ యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ రిపబ్లిక్స్ ఉనికిలో ఉన్నప్పుడు ఉక్రెయిన్ అందులో భాగంగా ఉండేది. చాలా మంది రష్యన్లు, రష్యన్ భాష మాట్లాడే వారు ఉక్రెయిన్‌గా పిలవబడే ప్రాంతంలో నివశిస్తుండే వారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనప్పుడు ఉక్రెయిన్ ఒక సార్వభౌమిక గణతంత్ర రాజ్యంగా ప్రభవించింది. 2014–22 సంవత్సరాల మధ్య ఉక్రెయిన్ ప్రాంతాలు అయిన క్రిమియా, డొనెట్స్క్, లుహన్స్కిలను రష్యా ఆక్రమించుకుని బలవంతంగా తనలో కలిపివేసుకున్నది. తనను వ్యతిరేకించే సైనిక కూటమి 'నాటో' సభ్యత్వానికై ఉక్రెయిన్ దరఖాస్తు చేసుకుందని, ఉక్రెయిన్‌ను ఉపయోగించుకుని నాటో దేశాలు తనను చుట్టుముట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, తత్కారణంగా తన జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడినందునే ఉక్రెయిన్‌ను ఆక్రమించుకోవడం అనివార్యమయిందని రష్యా సమర్థించుకున్నది. ఉక్రెయిన్ ఒక సార్వభౌమిక దేశం. ఆ దేశం నాటోలో చేరినా, చేరకపోయినా స్వతంత్ర దేశంగా మనుగడ సాగించేందుకు ఆ దేశానికి సంపూర్ణ హక్కు ఉన్నది. ప్రపంచ దేశాలు ఆ హక్కును గౌరవించాలి. ఉక్రెయిన్ స్వతంత్ర రాజ్యంగా సంపూర్ణ రక్షణతో మనగలిగేందుకు ప్రపంచం హామీ పడాలి.

మూడేళ్ల క్రితం ప్రారంభమైన యుద్ధం ఉక్రెయిన్ మనుగడకు తీవ్ర హానికరంగా పరిణమించింది. సెప్టెంబర్ 10, 2025 నాటికి రష్యా దాడుల్లో ఉక్రెయిన్‌లో 14,116 మంది పౌరులు మరణించారని, 36,481 మంది క్షతగాత్రులు అయ్యారని ఆ దేశంలో ఉన్న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘం ప్రతినిధులు సమగ్ర సాక్ష్యాధారాలతో నమోదు చేశారు. 56 లక్షల మంది ఉక్రెయిన్ పౌరులు ఇతర దేశాలకు పరారవ్వగా మరో 37 లక్షల మంది పౌరులు దేశంలోనే నిరాశ్రయులు అయ్యారు. ఈ యుద్ధంలో ఉభయ పక్షాలలోను (రష్యా తరఫున పోరాడుతున్న కొరియా సైనికులతో సహా) మొత్తం పది లక్షల మందికి పైగా సైనికులు మరణించారు.

ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాలు వందల కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, సైనిక సామగ్రిని సరఫరా చేస్తున్నాయి (ఈ యుద్ధంలో నేరుగా పాల్గొనేందుకు అవి వెనుకాడుతున్నాయి). అయినప్పటికీ ఉక్రెయిన్ యుద్ధంలో ఓడిపోతోంది. అన్ని విధాల భారీనష్టాలు చవిచూస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి చేసి ఈ యుద్ధాన్ని నిలిపివేయగల దక్షత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఉన్నది. అయితే ట్రంప్ అందుకు సుముఖంగా లేడు. ఆత్మ రక్షణకై ఉక్రెయిన్ యుద్ధం చేస్తోంది. నైతికత, న్యాయబద్ధత ఉక్రెయిన్ పక్షానే ఉన్నాయి. అయినా నిస్సహాయంగా నలిగిపోతోంది. అమెరికా ఊగిసలాట ధోరణి, ఐక్యరాజ్యసమితి అసమర్థతకు ఉక్రెయిన్ బలవుతోంది. ఉక్రెయిన్ యుద్ధం పనికిమాలిన, అనైతిక యుద్ధమని ఒక బలమైన దేశం, పొరుగున ఉన్న ఒక బలహీన రాజ్యంపై చేస్తున్న దురాగతం మినహా మరేమీ కాదని చరిత్ర తప్పక నమోదు చేస్తుంది.

ప్రపంచాన్ని అమితంగా కలవరపరుస్తోన్న మరో యుద్ధాన్ని హమాస్ ప్రారంభించింది. పాలస్తీనాలో భాగమైన గాజా ప్రాంతాన్ని పరిపాలిస్తున్న మిలిటెంట్ గ్రూపే హమాస్. ఈ పశ్చిమాసియా ప్రాంతం ఇప్పటికే అనేక యుద్ధాలతో అతలాకుతలమైపోయింది. అక్టోబర్ 7, 2023న హమాస్ ఎలాంటి కవ్వింపు లేకుండా ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇది సమర్థించరాని చర్య. హమాస్ దాడిలో 1200 మంది ఇజ్రాయెలీ పౌరులు మరణించారు. మరో 251 మంది ఇప్పటికీ హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. హమాస్ దాడిపై ఇజ్రాయెల్ భీకరంగా ప్రతిస్పందించింది. ఎడతెగని, బహుముఖీనమైన దాడులు ప్రారంభించింది. గాజా నుంచి పాలస్తీనియన్లు అందరినీ గెంటివేయడమే ఇజ్రాయెల్ లక్ష్యంగా ఉన్నది. పాలస్తీనియన్లు లేని గాజాను పూర్తిగా ఇజ్రాయెల్‌లో కలుపుకోవడమే లక్ష్యంగా ఉన్నది. ఇజ్రాయెల్ ఇప్పటికే మరో పాలస్తీనియన్ ప్రాంతమైన వెస్ట్ బ్యాంక్‌ను చాలావరకు ఆక్రమించుకుని అక్కడి జనజీవనాన్ని నియంత్రిస్తోంది.

పశ్చిమాసియాలో సుస్థిర శాంతికి ఒక పరిష్కారంగా ఉన్న రెండు దేశాల సిద్ధాంతాన్ని ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 67,000 మంది మరణించారు. వారిలో అత్యధికులు మహిళలు, బాలలే. పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన మౌలిక సదుపాయాలు అన్నీ ధ్వంసమైపోయాయి. ఆహారం, మంచినీరు, ఔషధాలు అందుబాటులో లేక పాలస్తీనియన్లు చనిపోతున్నారు. హమాస్ దాడికి ప్రతీకారంగానే తాము దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ సమర్థించుకొంటోంది. అయితే ఇది సమర్థించలేని విషయం. ఇజ్రాయెల్ దాడులు మహాభీకరంగా ఉన్నాయి. ఎడతెగకుండా సాగుతున్నాయి. పైగా ఈ దాడుల లక్ష్యం న్యాయవిరుద్ధమైనది.. ఎంతమాత్రం ఆమోదయోగ్యమైనది కాదు. మాతృభూమిని కలిగి ఉండేందుకు పాలస్తీనియన్లకు హక్కు ఉన్నది.



> నైతిక అధికారంతో సమస్యలు పరిష్కరించగల జవహర్‌లాల్ నెహ్రూ, డాగ్ హమ్మర్స్క్ జోల్డ్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ లాంటి సమున్నత నాయకులు ఇప్పుడు ప్రపంచానికి అవసరం. ప్రస్తుత ఐక్యరాజ్యసమితి వలే కాకుండా కొత్త అంతర్జాతీయ సంస్థలను నిర్మించుకోవల్సిన అవసరమూ నేడు ప్రపంచానికి చాలా ఉన్నది.

గాజాలో శాంతికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 20 అంశాల 'శాంతి ప్రణాళిక' నొకదాన్ని ప్రతిపాదించారు. ఇజ్రాయెల్ డిమాండ్లను చాలావరకు ఆమోదిస్తున్నట్టు ఈ శాంతి ప్రణాళిక కనిపిస్తున్నది. నేనీ వ్యాసం రాస్తున్న సమయానికి హమాస్ ఆ శాంతి ప్రణాళికను ఆమోదిస్తున్నదీ లేనిదీ తెలియరాలేదు. అన్నీ కోల్పోయి ఆకలి దప్పులతో అలమటిస్తున్న పాలస్తీనియన్లకు శాంతిని సమకూర్చాలంటే ట్రంప్ శాంతి ప్రణాళికను ఆమోదించడం మినహా హమాస్‌కు గత్యంతరం లేదు. అయితే ట్రంప్ శాంతి ప్రణాళికను ఆమోదించడమంటే పాలస్తీనియన్ల భవిష్యత్తును బాహ్యశక్తులకు స్వాధీనం చేయడమే అవుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఇంతకూ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక ప్రకారం పాలస్తీనా 157 దేశాల గుర్తింపుతో ఒక సార్వభౌమిక దేశంగా ప్రభవించేందుకు దోహదం జరుగుతుందా లేదా అన్న విషయమై స్పష్టత లేదు. హమాస్‌ను, పాలస్తీనియన్లను ఒకటిగా చూడడం సమంజసం కాదు. ఏమైనా హమాస్ దుస్సాహసం చాలా అవమానకరంగా ముగిసిందని చెప్పక తప్పదు. అంతేకాదు, పాలస్తీనియన్ల హక్కుల అణచివేత యథావిధిగా కొనసాగుతుంది.

సరే, ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ చాలావరకు సూత్రబద్ధమైన వైఖరిని పాటిస్తూ వస్తోంది. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతిని నెలకొల్పేందుకు ప్రధాని మోదీ ప్రయత్నించారు. అయితే భారత్‌కు 1950లు, 1960ల్లో ఉన్న నైతిక అధికారం, రాజకీయ పలుకుబడి ఇప్పుడు లేవు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం విషయమై భారత్ బాగా తడబడింది. మొదటి నుంచీ పాలస్తీనాకు అన్నివిధాల మద్దతునిస్తున్న భారత్ ఇజ్రాయెల్ వైపు మొగ్గు చూపుతూ వస్తోంది. ఇది ఒక విధంగా పాలస్తీనియన్లను వంచించడమేనని చాలా మంది భావించారు. పలువురు బహిరంగంగా విమర్శించారు. రెండు దేశాల ప్రణాళిక కింద ఉనికిలో ఉండే హక్కు పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండిటికీ ఉందని భారత ప్రభుత్వం సుదీర్ఘకాలంగా వాదిస్తూ వస్తోంది. అయితే ఈ వాదనను విడనాడడం తప్పు అనే విషయాన్ని భారత్ గుర్తించి తన వైఖరిని సరిదిద్దుకునేందుకు ప్రయత్నించింది.

శక్తిమంతమైన దేశాలు, తమను వ్యతిరేకిస్తున్న బలహీన విరోధులపై ఎడతెగని వినాశనకర యుద్ధాలు చేస్తున్నాయనే సత్యాన్ని పాఠకుల దృష్టికి తీసుకురావడమే ఈ వ్యాసం లక్ష్యం. ఉక్రెయిన్, గాజా యుద్ధాల నిష్ఫలతను కూడా ఈ వ్యాసం ఎత్తి చూపింది. ఇవి వ్యర్థ యుద్ధాలు, ఎవరికీ ఏమీ ఒరిగేదేమీ లేదు. ప్రతి దేశంలోను యుద్ధోన్మాదులు ఉన్నారు. అనేక వివాదాలకు యుద్ధమే పరిష్కారమనేది వారి ప్రగాఢ విశ్వాసం. ఈ యుద్ధోన్మాద వైఖరిని అంతర్గత విభేదాల పరిష్కారానికి కూడా వారు వర్తింపచేస్తున్నారు. దేశీయ వ్యవహారాలలో వివాదాల పరిష్కారానికి 'యుద్ధం'కు ప్రత్యామ్నాయంగా 'హింస'ను ఉపయోగించడాన్ని వారు సమర్థిస్తున్నారు. 'బలవంతులే సరైనవారు' అన్న భావాన్ని వారు అంగీకరిస్తున్నారు. ఇదెలా న్యాయం?

తమ నైతిక అధికారంతో సమస్యలు పరిష్కరించగల జవహర్‌లాల్ నెహ్రూ, డాగ్ హమ్మర్స్క్ జోల్డ్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ లాంటి సమున్నత నాయకులు ఇప్పుడు ప్రపంచానికి అవసరం. వినాశనకర ఘర్షణ పథం నుంచి వైదొలిగేలా కలహించుకుంటున్న దేశాలను మరింతగా ప్రభావితం చేయగల దేశాలు కలిసికట్టుగా ముందుకురావలసిన అవసరం నేడు ప్రపంచానికి ఎంతైనా ఉన్నది. ప్రస్తుత ఐక్యరాజ్య సమితి వలే కాకుండా కొత్త అంతర్జాతీయ సంస్థల అవసరం నేడు ప్రపంచానికి చాలా ఉన్నది. ప్రస్తుతానికి మాత్రం అంతా అంధకారమే, శాంతి కుసుమాల ఉదయం కనుచూపుమేరలో లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఒక 'మత్తు'కి ఇంకో 'మత్తు'.. మందు కాదు!

'ప్రాంతీయ అస్తిత్వం: భ్రమలూ, వాస్తవాలూ!' అన్న జూలై 29 నాటి నా వ్యాసానికి, 'తెలంగాణ పరిరక్షణ వేదిక' వారి సెప్టెంబరు 11 నాటి 'పాత సమాధానం" చూశాను. దానికి, నా వివరణ ఇదీ:

(1) నాది 'పాచి వాదన' అనీ, 'ఆదర్శవాద ముసుగు' అనీ, 'ఆధిపత్య భావన' అనీ, 'పిడివాదన' అనీ వేదిక వారు అన్నారు. అసువంటి మాటలతోని, బహెస్ నడ్వది! కాబట్టి, గా ముచ్చట్లు ఇడిసిపెట్టి, అసల్ నేనేమంటీ, మీరేమంటున్రూ, గా సంగతి చెప్పుకోవాలె! (2) ఒక ప్రాంతంలో ఉన్న రకరకాల అసమానతల్నీ వైరుధ్యాల్నీ ప్రాంతీయ అస్తిత్వ స్పృహ అనే మాయ తెర కప్పివేస్తుంది అనే "ఎరుక మాకు తెలియనిది కాదు" అంటున్నరు వేదిక వాండ్లు! మరి, గా 'ఎరుక'తో నుండాలన్న నాతోని కొట్లాడుడేంది? (3) 'ఎమ్మార్పీఎస్ ఉద్యమం జేస్తున్నం! బీసీ రిజర్వేషన్ల ఉద్యమం జేస్తున్నం!' అని గొప్పలు చెప్పుకుంటున్రు! మోస్ట్ బ్యాక్వార్డ్ షెడ్యూల్ కులాల ఉద్యమాన్ని ఒప్పుకుంటున్రా? అసలు వర్గీకరణనే వ్యతిరేకించే మాల అస్తిత్వవాదుల ఉద్యమం సంగతేంది? "ముస్లింలు, స్త్రీలు, ఆదివాసీలు ఎవ్వరైనా, అందరూ అన్ని పోరాటాలనూ చేయరు" అంటున్రు మీరు. అన్ని పోరాటాలు జయ్యమని ఈడ ఎవ్వరూ అడుగుతలేరు! తాము చేసే ఉద్యమాలు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించేవి మాత్రమేననీ; భూములూ, గనులూ, ఫ్యాక్టరీలూ, రవాణా లాంటి ఉత్పత్తి సాధనాల్ని స్వాధీనం చేసుకోవాలనే దృష్టి లేకుండా, అసమాన శ్రమ విభజనని పూర్తిగా మార్చుకోవాలనే లక్ష్యం లేకుండా, చేసే యాడ్-హాక్ (తాత్కాలిక) ఉద్యమాలన్నీ, పాలకవర్గాలు ఏర్పాటు చేసిన చట్రంలో ఇరుక్కుపోవడమేననే స్పృహ లేకపోతే జరిగేదేమిటి? "గా ప్రాంతపోల్ల విగ్రహాలు, తీసెయ్యాలె! ఎన్నో సైన్మలు దీసిన మా ప్రాంతపోని ఫోటో గింత చిన్నగనా పెట్టేడిది? మా కార్మికుల శ్రమని దోచే హక్కు మా ప్రాంతపు కాంట్రాక్టర్లకె వుండాలె, గా ప్రాంతపు కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు ఎందు కీయాలె?" అంటే, అది తెలంగాణలోని శ్రామిక ప్రజల ప్రయోజనాలను ఏ రకంగా పరిరక్షిస్తుంది?



> "తెలంగాణ అస్తిత్వం మత్తు కాదు, అది భౌగోళిక విముక్తి" అంటున్నరు వేదిక వాండ్లు! భౌగోళిక శాస్త్రం ప్రకారం, తెలంగాణ ఒక ప్రాంతం కావచ్చు. కానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక శాస్త్రాల ప్రకారం, అనేక అసమానతలతో కూడిన జనసమూహం. కావలిసింది, అసమానతలనించీ విముక్తి!

(4) "మేం ప్రాంత అసమానత గురించి చేస్తున్నం. వర్గ ప్రాతిపదికన చేసే పోరాటానికి ఇవేవీ ఆటంకం కాదు" అని అంటున్రు వేదిక సార్లు! నేనన్నదేంది? ఏ ప్రాంతాన్ని తీసుకున్నా, అది ఆంధ్రాగానీ, తెలంగాన గానీ, రాయలసీమ గానీ, గా ప్రాంతం అంతా ఒక్క తీరుగ లేదు. గా ప్రాంతాలల్ల, అమీరులున్నరు, గరీబులున్నరు. దొరలున్నరు, కూలోల్లున్నరు. మురికి అంటని కొలువులు జేసెటోల్లున్నరు, మురికి, సఫాయి పనులు జేసెటోల్లున్నరు. అందర్నీ, ఒక్కతీరుగనే జూస్తే, గది వర్గపోరాటానికి ఆటంకం కాదా? (5) "బి.ఆర్. బాపూజీ బాధ ఏమిటి?... తమ ప్రాంత ఆధిపత్యం మీద దృష్టి తగ్గుతది అనే" అంటున్నరు వేదిక సార్లు! ఇగో సార్లూ! ఈ బాపూజీ అనేటోనికి ఒక ప్రాంతమంటూ లేదు. వాడు ఆంధ్రోడూ కాదూ, తెలంగానోడూ కాదు! వాడు, కమ్యూనిస్టోడు! వాని భావజాలం 'శ్రామికవర్గ అంతర్జాతీయత'! అంటే, అన్ని దేశాల కార్మికులూ ఒక్కటిగావాలె! (6) "అంబేడ్కర్ తదితరులు ప్రాంతాలకతీతంగా దేశం మొత్తానికీ ఐకన్స్" అని అంటున్నరు వేదిక వాండ్లు. అసలు గీ 'ఐకాన్స్' అనే ముచ్చటెక్కడికెల్లొచ్చింది? మనుషుల్ని 'ఐకన్స్' అనీ, 'వైతాళికులు' అనీ, సమానత్వ సూత్రానికి విరుద్ధంగా, నిలబెట్టడమే అసలైన 'ఆధిపత్య భావన!' (7) విగ్రహ తరలింపు ఉద్యమం ద్వారా, తెలంగాణను పరిరక్షించాలనుకుంటున్న వేదిక వారు, "మీ కాసు బ్రహ్మానందరెడ్డి, మీ ఎన్టీఆర్, మీ రాజశేఖరరెడ్డి, మా మర్రి చెన్నారెడ్డి, మా పి.వి. నరసింహారావు, మా అంజయ్య..!" అనుకుంట నా మీద కోపమైతాండ్రు. ఓ సార్లూ! విగ్రహాలనేవీ సమానత్వ సూత్రానికి విరుద్ధమనీ, హేతువిరుద్ధమనీ, ఒక కళా రూపంగా మాత్రమే వాటిని చూడాలనీ, ఎవరి విగ్రహాన్నయినా చేసినా, చేయించినా, దాన్ని ప్రకృతి వైపరీత్యాలనించీ, సామాజిక శత్రువులనించీ కాపాడుకోగలిగేలా, ఏర్పాట్లు చేసుకోవాలనీ చెపితే, 'గది మీ ప్రాంతపోని విగ్రహం! గిది మా ప్రాంతపోనిది!'– అని, గీ మాటలెందుకు జప్పుండ్రు!

(8) రాజశేఖర్‌రెడ్డి పేరెత్తిండ్రుగదా మీరు? మీకు యాదికున్నదో లేదో, ఒక ముచ్చట జప్తా ఇనుండ్రి! 2009లో తెలంగాణలో ఎన్నికల ప్రచారం అయినంక, రాయలసీమల ప్రచారం మొదలు బెట్టేతప్పుడు, "ప్రత్యేక తెలంగాణ వస్తే, రాయలసీమ వాళ్ళు విదేశీయులుగా బతకవలిసి వస్తుందని" అన్నడు. అప్పుడు, నేను, గిదే బాపూజీని, 'ఆధిపత్య భావన' గలిగినోన్ని, గిట్ల రాసిన: "తన పాలనలో, సెజ్‌ల యజమానులకు ఆర్థికంగా, రాజకీయంగా, దళారీగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నేతలలో అగ్రగణ్యుడైన ముఖ్యమంత్రి, ప్రత్యేక తెలంగాణ భూతాన్ని చూపడం మాత్రం, ఒక దళారీ దేశభక్తిని ప్రదర్శించడం లాంటిదే!" (ఆంధ్రజ్యోతి, 19–4–2009). (9) "ఆధిపత్య అహంకారానికి 'అస్తిత్వం మత్తే' సరైన జవాబు" అని వేదిక వాండ్ల ఆత్మ సమర్థన! కానీ, ఒక మత్తుకి ఇంకో మత్తు.. మందు కాదు! అస్తిత్వాలలో ఉప అస్తిత్వాలూ, ఉప–ఉప అస్తిత్వాలూ ఉన్నాయనీ, వాటి మధ్య అసమానతల్ని ఈ శ్రమ దోపిడీ సమాజం ప్రోత్సహిస్తుందనీ గ్రహింపు లేకపోతే ఎట్ల? (10) "తెలంగాణ స్ఫూర్తిదాతల విగ్రహాల లిస్ట్ కుల మత, లింగ భేదాల్ని బట్టి నిష్పత్తితో సహా సిద్ధంగా ఉంది" అని, ఐలాన్ జేసిండ్రు వేదిక సార్లు! ముందు, వర్గీకరణలోనూ, బీసీ రిజర్వేషన్లలోనూ నిష్పత్తులు తేలాలి గదా? అప్పుడే లిస్టు ఎట్ల సిద్ధంగున్నది? (11) "తెలంగాణ అస్తిత్వం మత్తు కాదు, అది భౌగోళిక విముక్తి" అంటున్నరు వేదిక వాండ్లు! భౌగోళిక శాస్త్రం ప్రకారం, తెలంగాణ ఒక ప్రాంతం కావచ్చు. కానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక శాస్త్రాల ప్రకారం, అనేక అసమానతలతో కూడిన జన సమూహం. కావలిసింది, అసమానతలనించీ విముక్తి!

• బి.ఆర్. బాపూజీ

(చర్చ ముగిసింది)

మెరుగుపడని ఉపాధ్యాయుల హోదా

ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలను, వారి హోదా పెంచడానికి 145 అంశాలతో, కొన్ని నిర్దిష్టమైన సిఫార్సులతో 1966లో 'స్టేటస్ ఆఫ్ ద టీచర్స్' అనే విధానపత్రాన్ని పారిస్‌లో జరిగిన సమావేశంలో యునెస్కో, అంతర్జాతీయ కార్మిక సంస్థ రూపొందించాయి. ఈ పత్రాన్ని ఆమోదించిన అక్టోబర్ 5వ తేదీని ఐక్యరాజ్యసమితి 'ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం'గా ప్రకటించింది. అయితే ఉపాధ్యాయుల అంతస్తు సాధనకు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వారు ఉద్యమించాల్సి వస్తోంది. మానవాభివృద్ధిలో ఉపాధ్యాయులది ప్రముఖ పాత్ర. విద్యా సంబంధ లక్ష్యాలు, ప్రయోజనాల సాధనకు, ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు, గౌరవం తెచ్చేందుకు ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

విద్యా రంగానికి, ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన నియామకాలు, ఎంపిక, శిక్షణ, వృత్తి సంబంధమైన ప్రమాణాలు, వృత్తి భద్రత, హక్కులు, బాధ్యతలు, వృత్తిపరమైన స్వేచ్ఛకు సంబంధించిన అంశాలు పారిస్ సభ సిఫార్సులలో పొందుపరిచారు. వీటితో పాటు వేతనాలు, సెలవులు, స్టడీ లీవు, పనివేళలు, పని పరిస్థితులు, బోధనోపకరణాలు, తరగతి పరిమితి, గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధ్యాయుల స్థితిగతులు, మహిళా ఉపాధ్యాయుల పరిస్థితులు, వైద్య సౌకర్యాలు, పెన్షన్‌కు సంబంధించిన అంశాలు వగైరాలు కూడా అందులో ఉన్నాయి. మూడు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో విద్య వాణిజ్యీకరణ, ప్రైవేటీకరణ పెరుగుతోంది. విద్యకు కేటాయించే నిధుల పరిమాణం తగ్గిపోతోంది. ప్రభుత్వ విద్యారంగానికి తగ్గిపోతున్న నిధులు, విద్యా ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు పెంచాలని ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఉపాధ్యాయులు బోధన వదిలి ఉద్యమించాల్సి వస్తోంది.

ఉపాధ్యాయుని అంతస్తుకు సంబంధించిన ఈ సిఫార్సుల పట్ల చట్టరీత్యా ప్రభుత్వాలు కట్టుబడిలేవు. అయినా అవి ఆయా దేశాలపై చెప్పుకోదగ్గ నైతిక రాజకీయ ఒత్తిడిని కలిగిస్తాయి. పారిస్ సభ సిఫార్సులు అమలు జరిపి ఉంటే అనేక దేశాల్లో విద్యారంగం పరిస్థితి మెరుగై ఉండేది. వీటి అమలుకు అంతర్జాతీయ ఉపాధ్యాయ ఉద్యమం, జాతీయ ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆయా ప్రభుత్వాలపై తగిన ఒత్తిడి తేలేదు. ప్రపంచవ్యాప్తంగా 9.4 కోట్ల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 2030 వరకు ప్రపంచ విద్యా అవసరాలు తీరాలంటే, అందరికీ విద్య అందించాలంటే ఇంకా 4.4 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరం. దేశంలో ఇంకా 10 లక్షల మంది ఉపాధ్యాయుల కొరత ఉందని నీతి ఆయోగ్ నివేదిక చెప్తోంది. 'స్టేటస్ ఆఫ్ టీచర్స్' విధానపత్రం ఆమోదం పొందిన 60 సంవత్సరాలకు కూడా ఉపాధ్యాయుల పరిస్థితులు హీనస్థితిలో ఉన్నాయని, అధిక వేతనాలు ఇచ్చే ఉద్యోగాలకు ఉపాధ్యాయులు వెళ్లిపోతున్నారని ఐఎల్ఓ నివేదిక చెప్తోంది. ఈ పరిస్థితుల్లో యువత ఉపాధ్యాయ వృత్తి స్వీకరించడానికి స్టేటస్ ఆఫ్ ద టీచర్స్ పత్రంలో సూచించిన విధంగా ఉపాధ్యాయుల అంతస్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. అదే ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు గురువులకు ఇచ్చే గౌరవం.

– కె. వేణుగోపాల్, విద్యారంగ విశ్లేషకులు

(రేపు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం)

అయోమయం అమెరికన్ జాబ్ మార్కెట్!

ఇతర దేశాలకు చెందిన దిగ్గజ టెక్ కంపెనీలు అమెరికాలో వివిధ సంస్థల ప్రాజెక్టులను చేపడుతుంటాయి. ఆ కంపెనీల ప్రణాళికలను బట్టి నియామకాలు, తొలగింపులు చేపడతాయి. అప్పటిదాకా ఆ ప్రాజెక్టుల్లో ఉండే అమెరికా పౌరులు కూడా కొన్ని సందర్భాల్లో ఉద్యోగాలు కోల్పోవడం జరుగుతూ ఉంటుంది. అమెరికాలోని ఐటీ రంగం మీద విదేశీ టెక్ కంపెనీల గుత్తాధిపత్యం, దరిమిలా అమెరికన్ యువత అవకాశాలు కోల్పోతూ ఉండటం ట్రంప్‌నకు ఆగ్రహం కలిగించినట్లు ప్రచారం అవుతోంది. ఆయన తాజా నిర్ణయాల్లో అమెరికాయేతర కంపెనీల మీద ప్రతీకారేచ్ఛ గోచరించడానికి కారణం ఇదే.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచి ఇవాళ్టి దాకా స్థిరంగా ఉన్న సమస్య అమెరికాలోని జాబ్ మార్కెట్! నిజానికి ఈ సమస్య రోజురోజుకూ కొండలా పెరిగిపోతున్నది. సాధారణంగా జాబ్ మార్కెట్ అంటే– కొత్తవారికి దక్కే ఉద్యోగావకాశాల గురించేనని అనుకుంటాం. కానీ ఇప్పుడు అమెరికాలో సీనియర్లకు కూడా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వారి మెడపై కూడా కత్తి వేలాడుతోంది. పెద్ద కంపెనీలు ఎంతో కాలంగా సంస్థలోనే కొనసాగుతున్న, కీలక స్థానాలకు చేరుకున్న ఉద్యోగులను కూడా నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నాయి. ఇరవై–పాతికేళ్ల అనుభవం ఉన్నవారు కూడా హఠాత్తుగా ఉద్యోగాలు కోల్పోతున్నారు. కొన్ని సంస్థల్లో డైరక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ల స్థాయికి చేరుకున్న వారి పరిస్థితి కూడా కుదురుగా లేదు. ఏ క్షణాన్నయినా ఉద్యోగం పోవచ్చునన్న భయం ప్రతి ఒక్కరినీ వెన్నాడుతోంది. ఒక సీనియర్‌ను ఉద్యోగం నుంచి తప్పిస్తే, అదే వేతనానికి ముగ్గురు నలుగురు ఫ్రెషర్స్‌ను తీసుకోవచ్చుననే సంస్థల ఆలోచనా సరళి, పర్యవేక్షక స్థాయి ఉద్యోగాల అవసరం అంతకంతకూ తగ్గుతుండడం ఇందుకు మరోకారణం.

ఉద్యోగాలు కోల్పోతున్న సీనియర్లకు కొత్త ఉద్యోగాలు దొరకడం కష్టమవుతోంది. ఒక ఉద్యోగంలో సీనియారిటీ గడించడం అంటే– అక్కడ అవసరమైన మూస పనికి అలవాటు పడి ఉండటం. అలాంటి వారికి ఉద్యోగం పోయి జాబ్ ప్రొఫైల్ మారితే అందుకు తగినట్టు ఎడ్జస్ట్ కావటం సులువు కాదు. ఐటీ రంగంలో రోజు రోజుకూ మారే సాంకేతికతకు అప్‌డేట్ కానివారికి మళ్ళీ ఉద్యోగం దొరకడం మరీ కష్టం అవుతున్నది. చాలా కాలం కిందటే అమెరికాలో స్థిరపడిన వారి పరిస్థితి దయనీయం. వారు ఉద్యోగం పోగానే ఖాళీగా ఉండలేక ఏదైనా వ్యాపారంలోకి ప్రవేశించి అక్కడ అనుభవం లేక చేతులు కాల్చుకుంటున్నారు. అమెరికాలో వ్యాపారాల పరిస్థితి సైతం సజావుగా లేకపోవడం మరో సమస్య.


సాధారణంగా ఐటీ ఉద్యోగులు తరచుగా ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారుతూ ఉంటారు. ఇలా మారడం వలన త్వరత్వరగా వేతనాల మెట్లు ఎక్కుతూ వెళ్లవచ్చునని భావిస్తారు. ఈ పోకడను జాబ్ హాపింగ్ (Job hopping) అంటారు. ప్రస్తుతం ఉన్న వాతావరణంలో ఎవ్వరూ ఈ ఆలోచనను దరిదాపులకు రానివ్వటం లేదు. ఉన్న ఉద్యోగం వదిలేస్తే మరొకటి దొరకబుచ్చుకోవడం సాధ్యం కాదనే భయం వారిని నిలువరిస్తున్నది. ఉద్యోగాలు ఇప్పించే కన్సల్టెన్సీల స్థితి కూడా కష్టంగా ఉన్నది. పేరోల్స్ రన్ చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

> అమెరికాలో ఉద్యోగ సంక్షోభం ఆ దేశానికే పరిమితం కాదు. దీని ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల మీద ఉంటుంది.



ఎన్నారైలకు సంబంధించినంత వరకు, అమెరికాలో ఉద్యోగ సంక్షోభం ఈ దేశానికే పరిమితం కాబోదు. ఎన్నారై తెలుగువారి సంఖ్య అమెరికాలో గణనీయంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల మీద కూడా పడుతుంది. ట్రంప్ విధించిన సుంకాలు, ఆయన పరిపాలన తీరు భారతదేశం నుంచి జరిగే అన్ని రకాల ఎగుమతులపై ప్రభావం చూపించడం సహజం. వజ్రాలు, వస్త్రాలు, ఫార్మా, ఆంధ్రప్రదేశ్ విషయంలో రొయ్యల ఎగుమతులపై సుంకాల ప్రభావం కనిపిస్తూనే ఉంది. అన్నిటికంటే ముఖ్యంగా– అమెరికన్ జాబ్ మార్కెట్ దెబ్బతినడం వల్ల ఎన్నారైల నిధుల వరద ఇండియాకి తగ్గి రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొనే ప్రమాదం అధికం. అమెరికాలో స్థిరపడిన తెలుగువారు తమ మిగులు ఆర్జనతో స్వంత రాష్ట్రాల్లో ఆస్తుల కొనుగోలుకు మొగ్గు చూపుతారు. ఎక్కువమంది హైదరాబాదులో ఒక మంచి గేటెడ్ కమ్యూనిటీలో విల్లా కొని తల్లిదండ్రులను అక్కడ ఉంచాలని అనుకుంటారు. అలాగే తాము ఏడాదిలో ఒకసారి వచ్చి గడపడానికి హైదరాబాదు గేటెడ్ కమ్యూనిటీలను ఎంచుకుంటారు. ఆ మాటకొస్తే ఎన్నారై కొనుగోలుదారుల్ని లక్ష్యంగా పెట్టుకునే వెలిసిన వెంచర్లు హైదరాబాదు శివార్లలో అనేకం. ఇప్పుడు ఎన్నారైలు అమెరికా జాబ్ మార్కెట్‌లో అనిశ్చితి కారణంగా స్వదేశంలో పెట్టుబడులకు ధైర్యం చేయలేకపోతున్నారు. వీసా ఫీజుల పెంపు వంటి నిర్ణయాల వల్ల భారతీయ సంస్థలకు కొత్తగా భారీ ఎదురుదెబ్బ తగిలిందని అనుకోనక్కరలేదు. కోవిడ్ అనంతర పరిణామాల నుంచి అమెరికన్ మార్కెట్ పెద్దగా కోలుకున్నది లేదు. పాతవారి తొలగింపులు, కొత్తవారికి ఉద్యోగాలు లేని స్థితి ఇప్పటికే ఉంది. అయితే, ఇప్పటివరకూ పెద్ద కంపెనీలు తమకు ప్రాజెక్టులు వచ్చినప్పుడు అప్పటికప్పుడు ఉద్యోగుల వెతుకులాట అవసరం లేకుండా, ముందుగానే హెచ్1బి వీసాలు ప్రాసెస్ చేయించి సిద్ధంగా ఉంచుకొనేవి. వీసా ఫీజుల పెంపు నిర్ణయం ఈ పద్ధతిని దెబ్బ తీస్తోంది. వీసా, వేతనం, లాటరీ మధ్య లింకుపెట్టిన ట్రంప్ చర్యలు చిన్న కంపెనీలకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలు ఎప్పటికప్పుడు మారిపోతూండటం కూడా ఈ రంగంలో అనిశ్చితికి, గందరగోళానికి కారణమవుతోంది. ప్రశాంతత ఎప్పటికి సాధ్యమో చెప్పలేని స్థితి.

▪ కృష్ణమోహన్ దాసరి
పాత్రికేయుడు, డల్లాస్



విజయవాడ ఉత్సవ్ ముగింపు సభలో సీఎం చంద్రబాబు, పక్కన ఎంపీ కేశినేని చిన్ని

ఇంద్రకీలాద్రిపై దసర శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో అట్టహాసంగా జరగగా, నగరంలో విజయవాడ ఉత్సవ్ పేరిట గురువారం నిర్వహించిన మెగా కార్నివాల్ ఆ ఉత్సవాలను మరింత దేదీప్యమానం చేసింది. సీఎం చంద్రబాబు ఆసక్తికర ప్రసంగం, 3 వేల మందికి పైగా కళాకారుల సందడి, రెండు గంటల పాటు బందరు రోడ్డులో రెండు కిలోమీటర్లు సాగిన ఈ కార్నివాల్ నగరవాసులను ఆకట్టుకుంది. గిన్నిస్ రికార్డు కూడా సొంతం చేసుకోవడంతో నిర్వాహకులు, విజయవాడ వాసులపై సీఎం ప్రశంసల వర్షం కురిపించారు.



వెల్‌డన్ విజయవాడ

విజయవాడ ఉత్సవ్ బాగా చేశారు

నిర్వాహకులకు సీఎం చంద్రబాబు అభినందనలు

- కృష్ణాజిల్లా, విజయవాడ నీరు, గాలి ప్రత్యేకం
- మహామహులు ఇక్కడి నుంచి వచ్చినవారే..
- జిల్లాకు నీటి కొరత లేకుండా చేస్తా..
- ఆద్యంతం హుషారుగా సాగిన సీఎం ప్రసంగం
- విజయదశమి రోజంతా నగరంలో పర్యటన
- ఎంజీ రోడ్డులో మెగా కార్నివాల్, మారథాన్ రన్
- రెండు గంటలు.. రెండు కిలోమీటర్లు సందడి
- ప్రత్యేక ఆకర్షణగా పీవీ సింధు, శర్వానంద్
- గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న కార్నివాల్
- అత్యధిక డప్పు కళాకారులు పాల్గొన్నందుకే..
- 3 వేల మంది కళాకారులతో అదరహో..



బందరురోడ్డులో మెగా కార్నివాల్ (ఇన్‌సెట్‌లో) యాంకర్ సుమ సందడి





బందరురోడ్డులో డప్పు కళాకారుల విన్యాసాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'థాంక్యూ విజయవాడ.. వెల్‌డన్.. బాగా చేశారు. 11 రోజులుగా జరిగిన విజయవాడ ఉత్సవ్ నాలో, మీలో ఫుల్‌జోష్‌ను నింపింది. మీ అందరితో పాటు నాకూ చాలా ఆనందంగా ఉంది.' అంటూ విజయవాడ ఉత్సవ్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. బందరురోడ్డులో గురువారం నిర్వహించిన మెగా కార్నివాల్‌ను సీఎం వీక్షించారు. విజయవాడ ఉత్సవ్ ముగింపు కార్యక్రమం గొల్లపూడిలో జరగ్గా అక్కడ సీఎం మిగతా 6లో..

ఇక కృష్ణాజిల్లాకు నీటి కొరత ఉండదు

'ఓపక్క దుర్గమ్మ ఆశీస్సులు, మరోపక్క కృష్ణమ్మ పరవళ్లు.. కనులపండువగా ఉంది. కృష్ణానది నుంచి నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. వాటిని ఎలా సద్వినియోగం చేయాలో చూస్తున్నాం. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే 2020 నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేసేవాళ్లం. గత ప్రభుత్వంలో విధ్వంసం జరిగింది. మాకు విజయాన్ని కట్టబెట్టారు. ఇక కృష్ణాజిల్లాకు చరిత్రలో నీటికొరత ఉండదు, ఉండబోదు' అని సీఎం అన్నారు.



ప్రత్యేక ఆకర్షణగా కోయ నృత్యం



విజయవాడ ఉత్సవ్ మారథాన్ రన్‌లో హీరో శర్వానంద్



దుర్గాఘాట్‌లో హంసవాహనం (ఇన్‌సెట్‌లో) ఇంద్రకీలాద్రిపై పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

విజయవంతం

11 రోజులు.. 15 లక్షల మంది భక్తుల రాక

అధికారుల అంచనాలకు తగ్గట్టుగానే వచ్చిన భక్తులు

- మూలానక్షత్రం రోజు రికార్డుస్థాయిలో 1.94 లక్షల మంది
- విజయదశమి రోజున 1.85 లక్షల మంది
- ఇంకా కొనసాగుతున్న భవానీల రద్దీ
- దుర్గాఘాట్‌లో ఆది దంపతుల తెప్పోత్సవం
- వరద కారణంగా హంస వాహనంలో పూజలతో సరి

పూర్ణాహుతితో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



తెప్పోత్సవానికి ఆది దంపతుల ఉత్సవమూర్తులను పల్లకీపై మోసుకెళ్తున్న సీపీ రాజశేఖరబాబు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అధికారుల అంచనాలు నిజమయ్యాయి. అందుకు తగ్గట్టుగా రూపొందించుకున్న ప్రణాళికలు సత్ఫలితాలను ఇచ్చాయి. వెరసి ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలను 'విజయ'వంతంగా ముగించారు. ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి మిగతా 6లో..

ఓవైపు భక్తజనం.. మరోవైపు భవానీ నామస్మరణం.. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసినా ఇంద్రకీలాద్రికి ఇంకా భక్తులు భారీగా తరలి వస్తూనే ఉన్నారు. భవానీల రాకతో కొండంతా అరుణ వర్ణాన్ని పులుముకుంది. ఇక అంచనాలకు తగ్గట్టుగానే శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతమయ్యాయి. 11 రోజులు దాదాపు 15 లక్షల మంది భక్తులు దుర్గమ్మ దర్శనానికి తరలిరావడం విశేషం. వరద కారణంగా విజయ దశమి రోజు జరగాల్సిన తెప్పోత్సవం రద్దు అయినప్పటికీ.. హంస వాహనంపై గంగా సమేత దుర్గామల్లేశ్వరులకు పూజలు నిర్వహించారు. అంతకుముందు జరిగిన పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి.



కృష్ణవేణి ఘాట్ వద్ద దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భవానీలు

ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

ఉత్సవాలు ముగిసినా తగ్గని రద్దీ

ఉత్తరాంధ్ర నుంచి భారీగా వస్తున్న భవానీలు 6



హెలీరైడ్ పొడిగింపు

రేపటి వరకు అందుబాటులో..

విజయవాడ కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఉత్సవ్ పేరిట నిర్వహిస్తున్న హెలీ జాయ్ రైడ్స్‌కు నగర ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఇందిరాగాంధీ స్టేడియంలో విహంగ్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రైడ్‌కు స్పందన బాగా ఉండటంతో ఈనెల 5వ తేదీ వరకు పొడిగించారు. నిర్వాహకుడు కెప్టెన్ సూర్య శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హెలి టూరిజంను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఉన్నారని, అందుకు అనుగుణంగానే దసరా ఉత్సవాల సందర్భంగా ఈ హెలీ రైడ్స్‌ను ప్రారంభించామన్నారు. ప్రజల ఆదరణను దృష్టిలో ఉంచుకుని, కలెక్టర్ అనుమతులతో ఈ కార్యక్రమాన్ని ఈనెల 5వ తేదీ ఆదివారం వరకూ కొనసాగిస్తున్నట్లు సూర్య తెలిపారు.

సాంకేతికతతో సాఫీగా..

దసరా ఉత్సవాల్లో టెక్నాలజీదే కీలకపాత్ర

ప్రతి తలను లెక్కించారు. ప్రతి అడుగును పసిగట్టారు. క్షేత్రస్థాయిలో ఉరుకులు పరుగులు పెట్టకుండా ఒకచోట కూర్చుని ఎక్కడ ఏం జరుగుతుందో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ ఎవరెవరు ఎలా పనిచేస్తున్నారో పరిశీలించారు. ఇలా ప్రతి అంశాన్నీ నిశితంగా తెలుసుకున్నారు. ప్రభుత్వాధినేతలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను విజయవంతం చేయడంలో అధికారులు కీలకపాత్ర పోషించారు.



దుర్గాఘాట్ నుంచి డ్రోన్‌ను ఎగురవేసిన సిబ్బంది

- ఏఐతో ఎప్పటికప్పుడు పరిశీలన
- భక్తుల రాకపోకలు, రద్దీ అన్ని అరచేతిలోనే..
- భక్తుల సంఖ్య ఎప్పటికప్పుడు అందుబాటులో..
- డ్రోన్లతో ఇంద్రకీలాద్రిపై నిరంతర పర్యవేక్షణ
- అధికార యంత్రాంగంపై సీఎం ప్రశంసలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను అధికార యంత్రాంగం విజయవంతంగా పూర్తిచేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ముందుగా రూపొందించుకున్న వ్యూహాలను అమలు చేశారు. ఉత్సవాలను విజయవంతంగా పరిపూర్ణం చేసిన అధికారులపై సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు.

టెక్నాలజీ వినియోగం

శరన్నవరాత్రులు అంటే క్యూలైన్లు, హోల్డింగ్ పాయింట్లు, అన్నదానం, దర్శన సమయం ఇలా అనేక అంశాలు అనుసంధానమై ఉంటాయి. వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రి వరకు ఉన్న 1.8 కిలోమీటర్ల ప్రదేశాన్ని, ఇంద్రకీలాద్రికి చుట్టుపక్కల ఉన్న ప్రదేశాలను అధికారులు టెక్నాలజీతో బంధించారు. ఈ ఉత్సవాల్లో మిగతా 6లో..

రేషన్ మాఫియాకు అధికారుల అండ

- నందిగామ మండలంలో యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- ఫిర్యాదు చేసిన రాఘవాపురం గ్రామస్తులు
- ఒక ఆటో పట్టుకుని, మరో ఆటోను వదిలేసిన అధికారులు
- కేసు కూడా నమోదు చేయకుండా తాత్సారం

నందిగామ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అక్రమ రేషన్ బియ్యం విషయంలో పీడీఎస్ అధికారులు పట్టువిడుపులతో పనిచేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారం కూడా తోడవడంతో రేషన్ మాఫియా పగలు రాత్రి తేడా లేకుండా దందా సాగిస్తోంది. ప్రజలెవరైనా ఫిర్యాదు చేస్తే తప్పని పరిస్థితుల్లో దాడులు చేస్తున్న పీడీఎస్ అధికారులు ఆనక పట్టుబడిన సరుకును వదిలేస్తున్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామం నుంచి అక్రమార్కులు తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోల సమాచారాన్ని ప్రజలు గురువారం పీడీఎస్ డీటీ రామ్మూర్తిరెడ్డికి ఫోన్‌లో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదు రావడంతో రాఘవాపురం వెళ్లిన ఆయన రేషన్ బియ్యం లోడుతో ఉన్న రెండు ఆటోలను గుర్తించారు. రెండింటిలో ఒకటి వదిలేసి, మరొక దానినే పట్టుకున్నారు. పట్టుబడిన ఆటోను మిగతా 6లో..



వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను ముఖద్వారం

స్వచ్ఛంగా అవార్డులు

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు కీలకమైన అవార్డుల ప్రకటన

విజయవాడ, ఆంధ్రజ్యోతి : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాకు రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ అవార్డులు దక్కాయి. ఈనెల 6న నగరంలో సీఎం చంద్రబాబు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు స్వచ్ఛ బస్‌స్టేషన్ అవార్డు లభించింది. అలాగే, దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర చెల్లించడంతో పాటు ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ పాడిరైతు సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి అండగా నిలబడి అత్యుత్తమ నాణ్యతతో వినియోగదారులకు సేవలందిస్తున్న కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి రాష్ట్రస్థాయిలో మిగతా 6లో..

- స్వచ్ఛత కార్యక్రమాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ స్వర్ణాంధ్ర-స్వచ్ఛత ఆంధ్రలో స్పెషల్ కేటగిరీ అవార్డు కైవసం చేసుకుంది. నగరపాలక సంస్థ పరిధిలోని పలు కార్యాలయాలతో పాటు అంగన్వాడీలు, రైతుబజార్లు, ఆసుపత్రులు కూడా ఈ అవార్డులు పొందాయి. ఎ.కొండూరు మండలంలోని మూడు కంపెనీలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు లభించాయి.



హంస వాహనంలో పూజలందుకుంటున్న గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి



పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో జలవిహారం చేస్తున్న దుర్గమ్మ

నేత్రపర్వంగా హంస వాహనోత్సవం

● వైభవంగా దుర్గా మల్లేశ్వరస్వామి నగరోత్సవం

● మహా పూర్ణాహుతితో ముగిసిన దసరా ఉత్సవాలు

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో 11రోజుల పాటు జరిగిన దసరా మహోత్సవాలకు ముగింపుగా గురువారం విజయ దశమి నాడు దుర్గామల్లేశ్వరులు హంస వాహనంలో విశేష పూజలం దుకున్నారు. హంస వాహన సేవ కన్నుల పండువగా జరిగింది. కృష్ణానదికి వరదలు రావటంతో తెప్పోత్సవం రద్దు కావడంతో గంగా పార్వతీమల్లేశ్వ రులను హంస వాహనంలో ఉంచి పూజలు చేశారు. ఈవో శీనానాయక్ దంపతులు కృష్ణవేణి మాతకు పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలు, గాజులు, చీర సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి పంచ హారతులు ఇచ్చారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకుడు రంగావఝుల శ్రీనివాస శాస్త్రి బృందం అర్చనలు చేశారు. వేదనాద మంత్రోచ్ఛరణ మధ్య ఓం కార హారతి, నాగహారతి, నక్షత్ర హారతి, కుంభహారతి, సింహ హారతి సమర్పించారు. ఈ హారతులను దర్శించుకున్న వారికి విశేష ఫలితాలు కలు గుతాయని విశ్వాసం.

వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా మహోత్సవాల చివరి రోజైన గురువారం గంగా పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను పోలీసులు పల్లకీలో ఊరే గింపుగా కృష్ణానది వరకు తీసుకువచ్చారు. దుష్ట రాక్షసుల ను సంహరించినందుకు సంకే తంగా ఆమెకు జ యజయ ధ్వానాలు వినిపించారు. తెప్పోత్సవం జరగకపోవటంతో లాంఛన ప్రాయంగా ఉత్సవమూర్తులను హంస వాహ నంపై అక్కడ ఉంచి పూజాధికాలు నిర్వహించిన అనం తరం పోలీసులే ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పారు వేట ఉత్సవానికి, అక్కడ నుంచి వన్‌టౌన్ పోలీ సు స్టేష న్‌కు తీసుకువెళ్లి తిరిగి తెల్లవారు జామున ఆలయానికి చేర్చారు. యాగశాలలో గురువారం మహా పూర్ణాహుతి నిర్వహించడంతో దసరా మహోత్సవాలు ముగిశాయి. పూర్ణాహుతి కార్యక్రమంలో దేవదాయ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమో హన్, ఈవో వి.కె.శీనానాయక్, తదితరులు పాల్గొన్నారు. పూజాధికాలకు ముగింపుగా కలశోద్వాసన చేశారు. కలశం లోని జలాలలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి దుర్గమ్మవారికి, మల్లేశ్వరస్వామికి, ఉపాలయాల్లోనూ భక్తుల పైన వాటిని ప్రోక్షించారు. దీంతో ఉత్సవాలకు ముగింపు పలికారు.అనంతరం పండిత సత్కారం జరిగింది. అర్చకులకు సంభావనలు అందజేశారు.

పాతరాజరాజేశ్వరిపేట : చివరి రోజైన పండుగ నాడు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకు న్నారు. భవానీలు అధికసంఖ్యలో ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భవానీల రాకతో క్యూలైన్లు, ఘాట్‌లు కిక్కిరిశాయి. భవానీలు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న నందమూరి మోహన్ కృష్ణ, మోహన రూప

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ఇంద్రకీలాద్రి : విజయదశమి నాడు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మను పలు వురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనా నంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దసరా ఉత్సవాల ప్రత్యేక అధికారి డి. భ్రమ రాంబ, ఈవో వి.కె.శీనానాయక్ వారికి అమ్మవారి చిత్ర పటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అమ్మవా రిని దర్శించుకున్నవారిలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ బి.కృష్ణమోహన్, డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కిరణ్మయి మండవ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహన్ కృష్ణ, మనవరాలు మోహనరూప, సినీ హీరో శర్వానంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు దంపతులు, కుటుంబ సభ్యులు యాంకర్ ఓంకార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో ఉన్నారు.

మీడియా పాయింట్‌లో మోహన కృష్ణ మాట్లాడుతూ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలను ప్రసాదించా లని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ మన వరాలు నందమూరి మోహనరూప మాట్లాడుతూ అమ్మ వారు ప్రజలందరి ఆశలు, కోరికలు నెరవేర్చాలన్నారు. భవానీదీక్షాదారులకు, లక్షలాది మంది భక్తులకు ప్రభుత్వం మంచి ఏర్పాట్లు చేసిందని ప్రశంసించారు.

పవిత్ర సంగమంలో తెప్పోత్సవం

విజయవాడ కల్చరల్ /ఇబ్రహీంపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్ర సంగమం వద్ద తెప్పోత్సవం వైభవంగా జరిగింది. హంస వాహనంపై అమ్మవారు జల విహారం చేస్తుండగా భక్తజనం వీక్షించి తరించారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్ను బోయిన చిట్టిబాబు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించామన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



అన్నప్రసాదం ఏర్పాట్లు భేష్

సత్యనారాయణపురం : భక్తులకు కనకదుర్గానగర్‌లో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కేంద్రంలో ఏర్పాట్లు అద్భు తంగా ఉన్నాయి. సేవకులు భక్తులకు సూచనలు ఇస్తూ అన్నప్రసాదం తీసుకున్నతర్వాత వారిని ఎప్పటికప్పుడు బయటకు పంపుతూ కేంద్రంలో రద్దీని నివారించారు. అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల నుంచి సిబ్బంది ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? అన్నప్ర సాదం ఎలా ఉందో తెలుసుకున్నారు. విరాళాలిచ్చే భక్తుల కోసం అక్కడే కౌంటర్లు ఏర్పాటు చేశారు.

గత ఏడాది ఉత్సవాల్లో కంటే తగ్గిన ఆదాయం

ఇంద్రకీలాద్రి : గత ఏడాది కంటే దసర ఉత్సవాల ఆదాయం గణనీయంగా తగ్గింది. సుమారు 13 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఆదాయం మాత్రం గత ఏడాది కంటే సుమారు కోటి రూపాయల వరకు తగ్గింది. గత ఏడాది రూ.500 టిక్కెట్ల ద్వారా రూ.1,90,13,500 ఆదా యం వచ్చింది. ఈ ఏడాది అధికారులు రూ.500 టిక్కెట్‌ను రద్దు చేశారు. గత ఏడాది రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.50,54,400 ఆదాయం రాగా, ఈ ఏడాది ఉత్సవాల్లో రూ.35,20,800, రూ.100 టిక్కెట్‌ల ద్వారా గత ఏడాది రూ.38,38,400 ఆదాయం లభించగా, ఈ ఏడాది రూ.12,65,700 ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం రూ.15 టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.46,47,420 లభించగా, ఈ ఏడాది రూ.38,38,656 వచ్చింది. రూ.100 లడ్డూల ద్వారా గత ఏడాది రూ.2,98,64,500 రాగా, ఈ ఏడాది రూ.4,38,73,400 వచ్చింది. ప్రత్యేక కుంకుమార్చన రూ.3 వేల టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.6,06,000 రాగా, ఈ ఏడాది రూ.5,04,000, ప్రత్యేక కుంకుమార్చన రూ.5వేల టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.1,10,000 రాగా, ఈ ఏడాది రూ.1,75,000లు లభించింది. ప్రత్యేక చండీ హోమం టిక్కెట్ రూ.4వేల ద్వారా గత ఏడాది రూ.3,32,000 రాగా, ఈ ఏడాది రూ.1,48,000, ప్రత్యేక శ్రీచక్రనవారణార్చన రూ.3 వేల టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.66,000 రాగా, ఈ ఏడాది రూ.24,000 వచ్చింది. ప్రత్యేక ఖడ్గమాలార్చన రూ.5 వేల టిక్కెట్ ద్వారా గత ఏడాది రూ.92,088 రాగా, ఈ ఏడాది రూ.3,32,550 లభించింది. పబ్లికేషన్, ఫొటోలు, క్యాలెండర్ల ద్వారా గత ఏడాది రూ.61,082 రాగా, ఈ ఏ డాది రూ.1,26,565, కేశఖండనశాల రూ.40 టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.24,93,160 రాగా, ఈ ఏడాది రూ.25, 73,680, ఇతరత్రా ఆదాయం గత ఏడాది రూ.40,720 రాగా, ఈ ఏడాది రూ.1,10,310 లభించింది. గత ఏడాది తొమ్మిది రోజుల ఉత్సవాలలో రూ.6,62,19,270 ఆదాయం లభించగా, ఈ ఏడాది 11 రోజుల పాటు జరిగిన ఉత్సవాలలో రూ .5,64,92,651 ఆదాయం వచ్చింది. అధికారులు రూ.500 టిక్కెట్లు రద్దు చేయటంతో పాటు వీఐపీలు, వీవీఐపీలకు ఉచితంగా పాస్‌లు ఇవ్వటం వల్ల గత ఏడాది కంటే ఈ ఏడాది ఉత్సవాలలో సుమారు కోటి రూపాయల ఆదాయం తగ్గిందని సమాచారం.

సీఎం చంద్రబాబు అభినందనలు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో 11రోజుల పాటు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఎక్స్‌లో ఒక సందేశాన్ని పంపుతూ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రభుత్వ అధికారులు, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం చక్కగా నిర్వ హించిందని కొనియాడారు. 13 లక్షల మందికి పైగా భక్తులు దుర్గమ్మవారిని దర్శించుకోవటానికి తరలివచ్చా రని, వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం భక్తుల మన్ననలు పొందిందన్నారు. సంస్కృతీ, సంప్రదాయాలలో పండు గలు ఒక భాగమన్నారు. పండుగల వేళ దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించటానికి ప్రభుత్వం ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజలకు రాష్ట్రానికి మంచి జరగాలని దుర్గమ్మను వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆరు లడ్డూల బాక్స్‌ల కొనుగోలుకు ఆసక్తి

ఇంద్రకీలాద్రి : దసరా ఉత్సవాలలో లడ్డూ ప్రసాదం అమ్మకాలు భారీగా జరిగాయి. లడ్డూ ఒక్కటి రూ.15లు, ఆరు లడ్లు బాక్స్ రూ.100లు. భక్తులు, భవానీలు ఆరు లడ్డూల బాక్స్ (రూ.100)ల కొనుగోలుకు ఆసక్తి చూపారు. దేవస్థానం అధికారులు 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసి సుమారు 30 లక్షల లడ్డూ ల విక్రయాలు జరుగుతాయని ఈవో వి.కె.శీనానాయక్ ఆదేశాల మేరకు ఏఈఓ వాసు పర్యవేక్షణలో ప్రతిరోజూ సుమారు 600 మంది సిబ్బంది మూడు షిఫ్టులలో లడ్డూ ప్రసాదం తయారీ చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచారు. ఉత్సవాలలో మొదటి రోజు 74,244ల లడ్డూ ప్రసాదం, రెండవ రోజు 94,025, మూడో రోజు 1,17,725, నాల్గో రోజు 1,56,302, ఐదో రోజు 2,18,028 లడ్డూలు భక్తులు కొనుగోలు చేశారు. ఆరో రోజు 2,16,521, ఏడో రోజు 3,19,250, ఎనిమిదో రోజు 2,76,537, తొమ్మిదవ రోజు 3,17,766, పదో రోజు 5,28,803, 11వ రోజు 6,53,853 లడ్డూలను భక్తులు, భవానీలు భారీగా కొనుగోలు చేశారు. మొత్తంగా దసరా ఉత్సవాల 11రోజుల్లో 29,73,054 లడ్డూ అమ్మకాలు జరిగాయి. శుక్రవారం రాత్రి 12 గంటల వరకు సుమారు 4 లక్షల లడ్డూ ప్రసాదం అమ్మకాలు జరిగే అవకాశం ఉందని ఏఈవో వాసు తెలిపారు. గత ఏడాది ఉత్సవాలు పూర్తి అయినమూడు రోజుల వరకు 28,09,007 లడ్డూ విక్రయాలు జరిగాయని, ప్రస్తుతం భవా నీ భక్తుల తాకిడి ఉండటం వల్ల మూడు లక్షల లడ్డూలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.



జస్టిస్ బి.కృష్ణమోహన్, డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ కిరణ్మయికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు



మంత్రులు రామనారాయణరెడ్డి, పార్థసారథి, ఎంపీ కేశినేని చిన్ని, నటుడు శర్వానంద్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ, సుజనాచౌదరి, సీపీ రాజశేఖరబాబు, క్రీడాకారిణి పి.వి.సింధు

వెల్‌డన్ విజయవాడ

(5వ పేజీ తరువాయి)

హుషారుగా మాట్లాడారు. '11 రోజులుగా మీరు హుషారుగా ఉన్నారు' అని నవ్వుతూ అన్నారు. 'సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజలకు మానసిక ఆనందం కూడా అవసరం. విజయవాడ ఉత్సవ్ వంటి ఉత్సవాలే మానసికా నందాన్ని ఇవ్వగలవు. సంప్రదాయాలను కాపాడుకోవాలి. స్వాతంత్ర్య సమర యోధులు, దర్శకులు, నిర్మాతలతో పాటు ప్రముఖ నటులు ఎన్టీఆర్, ఏఎ న్నార్, అమరగాయకుడు ఘంటసాల వంటివారు విజయవాడ వారే. ఇక్కడి వారంతా దేశవిదేశాల్లో రాణిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి వన్నె తెచ్చేలా పనిచేశారు. నృత్యరీతులు, జానపదాలు, సంగీతం, పాటలు, సాహిత్యం, కళలు ఇవన్నీ మన సంప్రదాయం, సాంస్కృతికతలో భాగం. విజయవాడ ఉత్సవ్ లాంటి కార్యక్రమాల వల్ల మళ్లీ మన సంస్కృతీ సంప్రదాయాలు నిలబడ తాయి' అంటూ సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ చేసిన కృషిని అభినందిం చారు. 'విజయవాడ వాసులకు చాలా తెలివితేటలున్నాయ్. ఇక్కడి నీరు, గాల్లో ఆ ప్రభావం ఎక్కువ ఉంటుంది. ఒక్కోసారి మీ తెలివితేటలను మీరు సద్వినియోగం చేసుకోవట్లేదు. అందుకే రానున్న రోజుల్లో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. విజయవాడ ఉత్సవ్‌తో బెస్ట్ పీపుల్ (ఏజెన్సీ)ను గుర్తించారు. వారందరికీ పనులు అప్పగిం చారు. అందువల్లే ఎక్కడా జరగని ఈవెంట్ 11 రోజులుగా 280 కార్యక్రమాలతో జరి గింది. మీ అందరి కృషితో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ సాధించాం. వెయ్యిమందికి పైగా కళాకారుల ప్రదర్శనలతో ఆకట్టుకోవడమే కాకుండా భిన్న త్వంతో ఏకత్వాన్ని చాటిచెప్పి జాతీయ సమగ్రతను కాపాడేలా ఈ కార్యక్ర మాలు సాగాయి.' అని చంద్రబాబు పేర్కొన్నారు. గొల్లపూడి ఎగ్జిబిషన్ ఫుడ్ పెవిలియన్‌లో ఏఐ టెక్నాలజీ రొబోటిక్ కిచెన్ ఏర్పాటు చేయడం విజయవాడ పారిశ్రామికవేత్తల సామర్థ్యమని ఆయన ప్రశంసించారు.

విజయవంతం

(5వ పేజీ తరువాయి)

15,03,487 మంది భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. సెప్టెంబరు 22 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు గురువారం పూర్ణాహుతితో ముగిశాయి. సాయంత్రం తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి తొలిరోజు నుంచి లక్షల్లో భక్తులు వచ్చారు. విజయదశమి రోజున భవానీలు పోటెత్తారు. 1,85,230 మంది భక్తులు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. 22వ తేదీన 84,417 మంది, 23న 90,718 మంది, 24న 1,00,110 మంది, 25న 1,47,382 మంది, 26న 1,25,486 మంది, 27న 1,24,987 మంది, 28న 1,28,515 మంది ఇం ద్రకీ లాద్రికి తరలివచ్చారు. 29వ తేదీ మూలానక్షత్రం రోజున 1,94,070 మంది, 30న 1,39,573 మంది, ఈనెల 1వ తేదీన 1,25,329 మంది అమ్మవారిని దర్శిం చుకున్నారు. చివరిరోజు గురువారం 1,85,230 మంది భక్తులు వచ్చారు. విజ యదశమి ముగిశాక కూడా భవానీల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రానికి భవానీ భక్తులు లక్ష దాటారు. మొత్తంగా 16 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. మొత్తం 20,512 మంది ప్రొటోకాల్ దర్శనాలు చేసుకున్నారు. 11,862 మంది రూ.300 టికెట్, 12,655 మంది రూ.100 టికెట్ దర్శనాలు చేసుకోగా, 14,58,458 మంది ఉచిత దర్శనం చేసుకున్నారు.

స్వచ్ఛంగా అవార్డులు

(5వ పేజీ తరువాయి)

స్వచ్ఛ ఇండస్ట్రీస్ పురస్కారం లభించింది. దీనిపై కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు స్పందిస్తూ ఆరుగాలం శ్రమించి పాల ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తున్న పాడిరైతుకే ఈ పురస్కారమన్నారు.

- మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్వచ్ఛ పాఠశాలగా, మోపిదే వికి చెందిన కర్లపూడి కోటేశ్వరరావు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా ఎంపిక య్యారు. అలాగే, నాగాయలంక గ్రామ పంచాయతీకి జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కింది. కూచిపూడి రైతుబజార్‌కు, గుడ్లవల్లేరు మండలం అంగలూరు బాలికోన్నత పాఠశాలకు, ఉత్తమ్మ స్వచ్ఛ మునిసి పాలిటీగా తాడిగడప, బందరు మండలం పోతేపల్లి గ్రామ పంచాయతీని బెస్ట్ స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించింది.

పాడి రైతుకు ప్రోత్సాహం భేష్

కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసానికి సీఎం చంద్రబాబు అభినందన



రైతులకు తామందిస్తున్న ప్రోత్సాహకాలు సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం

చిట్టినగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినం దించారు. గోకులాల ఏర్పాటు చర్యలను కొనియాడారు. పశువుల హాస్టల్స్ నిర్వహణకు ప్రభుత్వం తరపున సహ కారాలు అందిస్తామని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో అగ్రిక ల్చర్ పెవిలియన్‌ను చంద్రబాబు సందర్శించారు కృష్ణా మిల్క్ యూనియన్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. ముఖ్యమంత్రి సీఎం ఆలోచన మేరకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ము నగచర్లలో ఏర్పాటు చేసిన చంద్రన్న సామూహిక గోకులం నిర్వ హణ, అను బంధంగా సాగు చేస్తున్న పశుగ్రాస క్షేత్రాలు గురించి చైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా రూ.150 కి అందిస్తున్న సెక్స్ సార్టెడ్ సెమెన్ (లింగ నిర్ధారిత వీర్యం)ను కృష్ణా మిల్క్ యూనియన్ రూ.100 సబ్సిడీతో ఉమ్మడి కృష్ణాజిల్లా, ఉభయ గోదావరి జిల్లాలల పాడి రైతుల పాడి పశువులకు కేవలం రూ.50కి అందిస్తున్నా మని తెలిపారు. పశువుల హాస్టల్స్‌ను మరిన్ని ఏర్పాటు చేసి పాడి రైతుల నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గించి, పాడి రైతులు ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విజ యవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌ మ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తదిత రులు పాల్గొన్నారు.

రుణ అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి : సీఎం

ఇబ్రహీంపట్నం : పీఎం సూర్యఘర్, డ్రోన్లకు సంబంధించిన రుణ అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ చూ పాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు మరింత రుణ సదుపాయాలు కల్పించాలని కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడు సూచించారు. విజయవాడ ఎక్స్‌పోలో కేడీసీసీ బ్యాంక్ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను చంద్రబాబు గురువారం సందర్శించారు. స్టాల్ ఏర్పాటు చేసి రైతుల సంక్షేమానికి సేవలందించడం అభినందనీయమని ఆయన అన్నారు. కేడీసీసీబీ నుంచి రైతులకు అందిస్తున్న సేవలను రఘురాం సీఎంకు వివరించారు. ఎనిమిది వేల స్వయం సహాయంక సంఘాలకు రుణాలు మంజూరు చేశామని బ్యాంక్ సీఈవో శ్యామ్ మనోహర్ వివరిం చారు. సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్దేశించిన అభి వృద్ధి లక్ష్యాలకు మద్దతుగా నిలవడం దేశంలోనే మొ దటి రెండు మూడు స్థానాల్లో కేడీసీసీ బ్యాంక్ ఉండటం స్ఫూర్తిదాయకమని అన్నారు.

ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ఇంద్రకీలాద్రిపై అరుణమయమైంది. కన కదుర్గమ్మను దర్శించుకోవడానికి భవానీ భక్తులు భారీగా వస్తున్నారు. విజయదశ మికి మూడు రోజుల ముందు నుంచే ఈ రాక ఆరంభమైంది. అప్పటి నుంచి పెరుగు తూనే ఉంది. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి భవానీ భక్తులు ఎక్కువగా వస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిసా, తమిళనాడు రాష్ట్రా ల్లోని తెలుగువారు భవానీ మాలలు ధరిం చారు. మొత్తంగా 5-6 లక్షల మంది భవానీ మాలలు ధరించారు. వారంతా దీక్షల విర మణకు తండోపతండాలుగా తరలివస్తు న్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం వరకు 1.50 లక్షల భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకు న్నారు. విజయదశమి రోజున శ్రీరాజరాజేశ్వ రిదేవిగా కొలువుదీరిన అమ్మవారు అదే అలంకారంలో దర్శనమిస్తున్నారు. శనివారం నుంచి అమ్మవారు మామూలు అలంకారం లోనే దర్శనమిస్తారు. మరో మూడు రోజుల పాటు ఒడిసా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భవానీలు వస్తారని అధికారులు అంచనా వేశారు. ఈసారి భవా నీల తాకిడి ఐదారు రోజుల పాటు కొనసా గుతుందని భావిస్తున్నారు.

సాంకేతికతతో సాఫీగా..

(5వ పేజీ తరువాయి)

ఎక్కువ భారం పోలీసు శాఖపైనే ఉంటుంది. సమన్వయ కమిటీలో భాగంగా ఉన్న పోలీసు అధికారులు సాఫీగా భక్తులు దర్శనం చేసుకోవడానికి, తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా ఉండటానికి ప్రణాళికలు రూపొందించారు. ప్రతి ఏడాదికి భిన్నంగా ఈసారి మోడల్ గెస్ట్‌హౌస్‌లో మెరుగైన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 60కి పైగా డ్రోన్లను, 500 సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకునే అన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో డ్రోన్లను ఎగరేసి ఎప్పటికప్పుడు అంచనాలు రూపొందించుకున్నారు. వాస్తవానికి 19-20 లక్షల మంది ఈ ఉత్సవాలకు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. దసరా ఉత్సవాలు ముగిసి, భవానీల రాక ప్రారంభమయ్యే సరికి 15 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేకంగా డాష్‌బోర్డు

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా డాష్‌బోర్డును ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మూడు వీడియోవాల్స్‌ను ఏర్పాటుచేసి డ్రోన్లు, సీసీ కెమెరాలను వాటికి అనుసంధానం చేశారు. అమ్మవారి దర్శనం చేసుకున్న ప్రతి భక్తుడి లెక్కను ఏఐ కెమెరాలు వీడియో వాల్‌పై చూపించాయి. అన్నదానంలో భోజనం చేసిన ప్రతి చేయిని ఈ కెమెరాలు లెక్కించాయి. భక్తులు కొన్న లడ్డూలు, పార్కింగ్‌లో వాహనాలు, ఏయే పార్కింగ్ ప్రదేశంలో ఎన్నెన్ని వాహనాలు ఉన్నాయో టెక్నాలజీతో లెక్కించారు. అంతరాలయం వద్ద పరిస్థితిని నిరంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గమనించారు. ఇలా ప్రతి ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించి అక్కడున్న సిబ్బందికి వైర్‌లెస్ సెట్ల ద్వారా ఆదేశాలు జారీచేసి, పరిస్థితిని మార్చారు. ఇంద్రకీలాద్రిపైకి వాహనాల రద్దీని నియంత్రించడానికి మూడు రకాల పాస్‌లను జారీ చేశారు. ఇప్పటివరకు మొదటి రోజు పాస్ తీసుకున్న వాహనాలు ఉత్సవాలు ముగిసే వరకు కొండపైకి ఇష్టానుసారంగా తిరిగేవి. దానికి ఈ ఏడాది పోలీసులు బ్రేక్ వేశారు. ఈసారి ఓటీపీ (వన్ టైం పాస్) తీసుకొచ్చారు. ఒకరోజు, ఒకసారి మాత్రమే ఈ పాస్ చెల్లుబాటు అయ్యేలా చేశారు. ఇలా వెళ్లిన ప్రతి వాహనం ఫొటోలను తీయడానికి ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ కెమెరాలు తీసిన ఫొటోతో రెండోసారి కొండపైకి వెళ్లకుండా పాస్‌ను టోల్‌గేటు వద్ద చింపేసేవారు. మొత్తంగా చిన్నచిన్న ఆందోళనల మధ్య ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

రేషన్ మాఫియాకు అధికారుల అండ

(5వ పేజీ తరువాయి)

స్టేషన్‌కు కానీ, ఆర్డీవో కార్యాలయానికి కానీ తీసుకురా కుండా మునగచర్లలోని ఒక మిల్లుకు తరలించినట్లు తెలి సింది. పట్టుబడిన ఆటోపై ఇంతవరకు కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం. ఆటో పట్టిబడినట్లు ధ్రువీకరించే కనీస రికార్డు కూడా వారి వద్ద లేదు. ఈ పరిణామంపై ఫిర్యాదు చేసిన రాఘవాపురం ప్రజలు విస్మయం చెందుతున్నారు. అక్రమార్కులకు పీడీఎస్ అధికారుల అండ ఉందంటున్నారు. ఒక ఆటోను వారే వదిలేశారని ఆరోపిస్తున్నారు. రెండో ఆటో కూడా వదిలేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివారం కేసు నమోదు చేస్తాం..

ఈ అంశంపై పీడీఎస్ డీటీ రామ్మూర్తిరెడ్డిని వివరణ కోరగా, గురువారం తనకు రాఘవాపురం గ్రామస్తులు ఫోన్ చేశారని, తాను సంఘటనాస్థలికి వెళ్లేసరికి రెండు ఆటోలు కనిపించాయని, ఒక ఆటో ఆపకుండా వెళ్లిపోయి నట్లు చెప్పారు. పండుగ రోజు కావడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేరన్నారు. పట్టుబడిన ఆటోపై కేసు ఎందుకు నమోదు చేయలేదని అడిగిన ప్రశ్నకు ఆయన సరైన సమాధానం చెప్పలేదు. ఆదివారం కేసు నమోదు చేస్తానని తెలిపారు.

దుర్గగుడిలో కానుకల లెక్కింపు 6, 7, 8 తేదీల్లో

ఇంద్రకీలాద్రి : దసరా మహోత్సవాలను పురస్కరించు కుని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు హుండీలలో సమ ర్పించిన కానుకలను ఈనెల 6, 7, 8 తేదీలలో మహామం డపం ఆరో అంతస్థులో లెక్కించనున్నట్లు ఆలయ ఈవో వి.కె. శీనానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 7.30 గంటలకు కానుకల లెక్కింపు ప్రారం భమవుతుందని ఆయన పేర్కొన్నారు.

పాఠశాల హెచ్‌ఎం ఆత్మహత్య



కనుమూరు(గంపలగూడెం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. మండలంలోని కనుమూరు గ్రామానికి చెందిన రేగళ్ల రంగారెడ్డి(50) అనుముల్లంక ప్రభుత్వ పాథమిక పాఠ శాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీగా అప్పుల పాలైయ్యాడు. తీసుకున్న అప్పులు తీర్చే పరిస్థితి లేక పోవడంతో గురువారం పురుగుమందు తాగి కనుమూరులోని పేరంటాళ్లమ్మ ఆల యం వద్దకు మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు రేగళ్ల వివేకవర్ధన్‌రెడ్డి, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.



బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 127,136, 147
చికెన్ విత్ స్కిన్ 242
చికెన్ స్కిన్‌లెస్ 252
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

మహిళలకు చీరలు పంపిణీ



కృష్ణలంక, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సందర్భంగా కృష్ణలంక 20వ డివిజన్ టీడీపీ నాయకులు గురువారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు గల్లా శ్రీను అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొడాలి సాయిబాబు , ముళ్లపూడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. గురువారం పాతగవర్నమెంట్ ప్రెస్, ముత్యాలంపాడు స్వచ్ఛోత్సవ- స్వచ్ఛతా హి సేవలో ముగింపు కార్యక్రమం జరిగింది. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు ప్రతిరోజు స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. దానిలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ బ్యాన్, రెడ్యూస్ రీ యూస్, రీసైకిల్ అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మొక్కలను పెంచడం, వ్యర్థాల నుంచి వస్తువులు తయారీ, పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం దృశ్య సఫాయిమిత్ర సురక్షశివిర్, ఒక గంటపాటు అందరూ కలిసి శ్రమదానం చేయటం, తదితర విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు, భూగర్భ డ్రెయినేజీ కార్మికులకు పీపీఈ కిట్లు అందజేసి, అక్కడున్న గోడపై విద్యార్థినీ విద్యార్థులతో కలిసి పెయింట్ వేశారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబుశ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవంతంగా దసరా ఉత్సవాలు

●వీఎంసీ అధికారులు, సిబ్బందికి నగర కమిషనర్ ధ్యానచంద్ర అభినందనలు

కార్పొరేషన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయవంతంగా దసరా శరన్నవరాత్రులను పూర్తి చేసినందుకు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను, సిబ్బందిని అభినందించారు.

దసరా శరన్నవరాత్రులు చివరి రోజైన గురువారం విజయదశమి రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగరాదని, వినాయకుని గుడి, కెనాల్ రోడ్, మోడల్ గెస్టహౌస్, వాటర్ పాయింట్లు, టాయిలెట్ల పాయింట్లు, కేశఖండన శాల, హోల్డింగ్ ఏరియా, ప్రాంతాలని పరిశీలించారు. వాటర్ పాయింట్లలో తాగునీటి వాటర్ బాటిల్ స్టాక్‌లను పెట్టుకుంటూ ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. 19 ప్రదేశాలలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు శుభ్రపర్చడం జరిగిందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చెప్పుల స్టాండ్, సామాన్లు భద్రపరచు ప్రదేశాలు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. 350 మంది ఎస్టేట్ విభాగం అధికారులు. సిబ్బంది విధులు నిర్వహించారని తెలిపారు. 1490 పారిశుధ్య కార్మికులు మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించారని తెలిపారు. దాదాపు 650మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించారని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. మూలా నక్షత్రం రోజున అదనంగా 300 మంది సిబ్బందిని విధులకు కేటాయించామని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ లో24గంటలు మూడు షిప్ట్‌లలో పని చేస్తున్న సిబ్బందితో మాట్లాడి ఎక్కడ ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకున్నామన్నారు.

మహాత్ముడి బాటలో న్యాయవాదులు నడవాలి

బార్ అధ్యక్షుడు ఏకే బాషా

విజయవాడ లీగల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మనకు స్వాతంత్ర్యం సిద్ధించి పెట్టిన న్యాయవాది అయిన మహాత్ముడి బాటలో న్యాయవాదులు నడవాలని బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఉన్న గాంధీజీ విగ్రహానికి న్యాయవాదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాషా మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలైన అహింస, సత్యమేవ జయతే వంటి ధర్మాలను అందరూ పాటించాలన్నారు. అనంతరం బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్‌ను న్యాయమూర్తులు సాదుబాబు, దీనబాబు, రత్నకుమార్, న్యాయవాదులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సుంకర మాట్లాడుతూ గాంధీజయంతిని బెజవాడ బార్‌లో గాంధీ ఉత్సవ్ పేరుతో జరపడం, గాంధీజీ స్మృతులను గుర్తుచేసుకుంటూ, ఆయన జీవిత చరిత్రకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను బార్ ఆవరణలో ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. బార్ కార్యవర్గసభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఆంధ్రరత్న భవన్‌లో ..

జాతిపిత మహాత్మాగాంధీ, భారతరత్న లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ ఉపాధ్యక్షుడు వి.గురునాథం మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రోద్యమానికి మహాత్మాగాంధీ నాయకత్వం వహించారని, జై జవాన్ జై కిసాన్ నినాదంతో దేశ ప్రజలను శాస్త్రి చైతన్యపరి చారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మీసాల రాజేశ్వరరావు, షేక్‌అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో

భారతీనగర్: పటమట సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీజీ, పూర్వ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మహనీయుల చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు కొండపల్లి మాధవరావు, అసోసియేషన్ సభ్యులు కరణం సుబ్బారాయుడు, బొమ్మగాని నాగేశ్వరరావు, కొల్లిపర రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు సీనియర్ సిటిజన్స్

పారిశుధ్య కార్మికురాలికి సత్కారం

భారతీనగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా 4వ డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు దారావత్ తిరుపతమ్మని గురునానక్ కాలనీ పెద్దలు వేమూరి రాజేంద్రప్రసాద్ గురువారం శాలువాతో సత్కరించి, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తిరుపతమ్మ చాలా ఏళ్లుగా కాలనీ వీధులను నిత్యం శుభ్రం చేస్తూ, పరిశుభ్రంగా ఉంచేవారన్నారు. ఆమె సేవలను గుర్తించి ఉత్తమ సేవకురాలుగా సన్మానించినట్లు తెలిపారు. కాలనీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సేవ సంతృప్తినిచ్చింది

ఉత్సవ కమిటీ సభ్యుడు శాయన సత్యనారాయణ

భారతీనగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో జగన్మాత దుర్గమ్మకు 11రోజులు సేవ చేయడం తనకెంతో సంతృప్తినిచ్చిందని 12వ డివిజన్ అధ్యక్షుడు, ఉత్సవ కమిటీ సభ్యుడు శాయన సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యుడిగా తనకు అవకాశం కల్పించినందుకు 12వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, ఎమ్మెల్యే గద్దెకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోనగర్ ఆర్టీసీ డీఎంగా రాజేష్‌కుమార్

ఆటోనగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జి. రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన ఇప్పటి వరకు గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయనను ఆటోనగర్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేసిన కె. ప్రవీణ్‌కుమార్ పదవీ విరమణ చేయడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఈనెల 6న రాజేష్‌కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

రాజరాజేశ్వరీ దేవిగా కాళీమాత



రాజరాజేశ్వరీదేవిగా కాళీమాత, పోలీస్‌స్టేషన్‌లో, దర్శిపేటలోని రాజరాజేశ్వరి, మద్దిరావమ్మతల్లి

కృష్ణలంక, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రుల 11వ రోజైన గురువారం త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు భక్తులకు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. ● కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ విష్ణు కుటుంబసభ్యులు, ఎస్‌ఐలు భానుప్రసాద్, సతీష్, మహిళా ఏఎస్‌ఐ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● కృష్ణలంక పాత పోస్టాఫీసు రోడ్డులోని సిద్ధేశ్వరీ అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. **ఆటోనగర్:** ఆటోనగర్‌లో గురువారం విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. వివిధ దుకాణాలు, ఖార్ఖానాలుతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. **భారతీనగర్:** గుణదల పాత పంచాయతీ సమీపంలోని శ్రీ మద్దిరావమ్మ తల్లిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.● కరెన్సీనగర్ దాసాంజనేయ దేవాలయంలో శ్రీరామభక్త కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో జమ్మిచెట్టు పూజ నిర్వహించారు.శ్రీరాజరాజేశ్వరి లలితాపరమేశ్వరి అమ్మవార్ల దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం. ● పటమట దర్శిపేటలోని శ్రీరాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. 300మంది మహిళలచే కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ● శనివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం మేళతాళాలతో కాలనీ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు ఆవుల నాసరయ్య తెలిపారు.



అభయాంజనేయస్వామి ఆలయంలో



అమ్మవారి లడ్డూ ప్రసాదం వద్ద కమిటీ సభ్యులు , హంసవాహనంపై అమ్మవారి ఊరేగింపు

సిద్ధార్థలో ముగిసిన దసరా వేడుకలు

మొగల్రాజపురం: సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. గురువారం అమ్మవారిని శ్రీ విజయ రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. సంఘీ సిల్వర్ ఎంపోరియం వేదిక అలంకార దాతగా, జీఆర్టీ జ్యూయలరీస్ వారు స్వర్ణాభరణ అలంకరణ దాత ఉన్నారు. అమ్మవారికి పదకుండు రోజుల పాటు అలంకరించిన వస్త్రాలను , 30కిలోల నేతి లడ్డూను శుక్రవారం వేలం వేశారు. లడ్డూను వేలంలో రూ.1, 11, 116కు యోగా మాస్టర్ శ్రీధారణ దక్కించుకున్నారు. అనంతరం భక్తులు తమ కోరికలను రాసిన చీటీలను శమీవృక్షానికి సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని హంస వాహనంపై, ప్రభలతో ఉరేగించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రసన్న వైట్ల మాట్లాడుతూ వేడుకలకు సంబంధించి కోటి యాభై లక్షల ఖర్చును భక్తుల సమక్షంలో వెల్లడించామని చెప్పారు. 11 రోజులలో అమ్మవారిని రెండు లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని, 60 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని వినియోగించుకున్నారని తెలిపారు.

భవానీల వస్త్రాలు బయటకు తీస్తూ..
కృష్ణానదిలో మునిగిన యువకుడు మృతి

వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో భవానీల వస్త్రాలు బయటకు తీస్తూ వరద నీటి ఉధృతికి ప్రమాదవశాత్తు కృష్ణలంకకు చెందిన గజ ఈతగాడు మృతి చెందినట్లు శుక్రవారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం భవానీలు విడిచిన వస్త్రాలను కృష్ణానదిలో నుంచి తొలగించేందుకు కృష్ణలంక వల్లూరివారి వీధికి చెందిన ఒడుగు కృష్ణ (35) ఈనెల ఒకటో తేదీన శనైశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న పద్మావతి ఘాట్‌లో విధులకు వెళ్లాడు. ఆరోజు రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు అతను విధుల్లో ఉండగా నదిలో ఉన్న వస్త్రాలను బయటకు తీసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు వరద నీటి ఉధృతికి మునిగిపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న స్థానికులు, పోలీసులకు తెలియపరచగా పోలీసులు నదిలో గాలించినప్పటికీ కృష్ణ మృతదేహం లభించలేదు. శుక్రవారం కృష్ణ మృతదేహం అతను డ్యూటీ నిర్వహించిన ప్రదేశం సమీపంలో నీటిలో తేలియాడుతు కనిపించటంతో అతని సోదరుడు ప్రసాద్ పోలీసులకు సమాచారం తెలియపరిచారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని ఒడ్డుకు తరలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియపరిచారు. అనంతరం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ (2.0) సంస్కరణల ప్రయోజనాలను, తగ్గిన పన్ను రేట్ల వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సందేశం ప్రతి రైతుకి చేరేలా జిల్లా స్థాయి కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ ఆఫీసర్, సీపీవో, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, జిల్లా పశుసంవర్ధక , అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు. బుధ, శుక్రవారాలలో జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాలో రైతులకు విస్తృత అవగాహన కల్పించే నిమిత్తం ట్రాక్టర్ రాలీలు, వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శన నిర్వహించారు. జీఎస్టీ ప్రకారం ప్రత్యక్ష ధరల పోలికతో (ముందు/తర్వాత) సంబంధిత సమాచారం, పొందే లాభాలను వివరించే కరపత్రాలు విడుదల చేసి పంపిణీ చేశారు. జీఎస్టీ 2.0 ప్రయోజనాలను వివరిస్తూ ఉద్యానవన శాఖ ఉత్పత్తులు, సూక్ష్మ సేద్య పరికరాలు, మత్స్య సంబంధిత ఉత్పత్తులు, పశుసంవర్ధక శాఖ ఉత్పత్తులు ప్రదర్శించారు.



జీఎస్టీపై కలెక్టరేట్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

తాగునీటి కోసం విలవిల

రామలింగేశ్వరనగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మంచినీటి సరఫరా కోసం రిజర్వాయరు ఉన్నా తగినంతగా నీటి సరఫరా జరగడం లేదంటూ పటమట, లంబాడిపేట, అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగు నీటిలో పురుగులు వస్తున్నాయని చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. ట్యాంకును సరిగా శుభ్రపరచకపోవడం, పైపులైను కలుషితం వలన తరచూ మురికి నీరు వస్తుందని, ఈ నీరు తాగడం వలన డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదముందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

సంబంధిత శాఖ అధికారులు తక్షణమే శుభ్రమైన నీటిని సరఫరా చేయాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.



గాంధీ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, వేదికపై కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నారాయణరావు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, బుద్ధప్రసాద్ తదితరులు

గాంధీ హిల్ అభివృద్ధికి సహకరిస్తాం

మహాత్మునికి పలువురి ఘన నివాళి

వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా గాంధీ హిల్ నిరాదరణకు గురైందని, దాని పూర్వ వైభవానికి తమ వంతు కృషి చేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటాని పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ మహాత్ముడు అహింసావాదాన్ని నమ్మడం వల్లే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. విజయవాడకు ఘన చరిత్ర ఉందన్నారు. గాంధీ హిల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం డాక్టర్ శారద రచించిన తెలుగు నేలపై గాంధీజీ అడుగులు, పూర్ణచంద్రరావు రచించిన ఆంధ్ర గాంధీయం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాంధీ హిల్ పూర్వ అధ్యక్షుడు రాజు,మాజీ మేయర్ జంధ్యాల శంకర్, విశ్రాంత ఐఏఎస్ చక్రపాణి, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నారాయణరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్ కేపీసీ గాంధీ, కలెక్టర్ లక్ష్మీశ, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తదితరులు పాల్గొన్నారు

జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో...

విజయవాడలోని విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

శాంతియుత పోరాటానికి జాతిపిత మహాత్మాగాంధీ ఆద్యులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పాతబస్తీ గాంధీ పార్కులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కె.రామకృష్ణ మాట్లాడుతూ శాంతియుత పోరాటాల ద్వారా భారత స్వాతంత్ర ఉద్యమాన్ని ప్రపంచ వ్యాప్తంగా చర్చింప చేసిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. గాంధీ స్ఫూర్తిగా నేడు పోరాటాలు సాగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టిరాయప్ప, తాడి పైడియ్య, అప్పురబోతు రాము, సంగుల పేరయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు

జీవో 7పై రాష్ట్ర కాపు జేఏసీ ఆనందం

గాంధీనగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దొమ్మరులను గిరి బలిజ గా మార్పు చేసి ప్రభుత్వం ఇచ్చిన జీవో 5పై స్టేటస్‌కో ఇచ్చి జీవో 7ను ఇవ్వడాన్ని రాష్ట్ర కాపు జేఏసీ స్వాగతించింది. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌కు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ గిరి బలిజ పేరుతో బలిజ, కాపు వర్గాలను అవమానించారన్నారు. దశాబ్దాలుగా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జనాభా దమాషా ప్రకారం కాపులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, నామినేటెడ్ పదవులు కేటాయించాలన్నారు. కొక్కిరాల సంజీవ్ కుమార్, సమతం రాము, చందు భావనారాయణ, రాధా,రంగా మిత్రమండలి నేత ముళ్ళపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ్ సర్వేక్షణ తరహాలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు

ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి

కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల తరహాలో రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు 2025ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. సీఎం చంద్రబాబు 6న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదానం చేస్తారని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.అనిల్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు.



ఎంజీ రోడ్డులో అమ్మవారి రథం ఊరేగింపు



వీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పీవీ సింధు



కోయ నృత్యం

వావ్.. ఉత్సవ్

విజయవాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులో నిర్వహించిన మెగా కార్నివాల్ వావ్ అనిపించింది. విజయవాడ నగరం గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది. అత్యధిక డప్పు కళాకారులు పాల్గొన్నందుకు అవార్డు వరించింది. ఇటీవలే మట్టి గణపతి ప్రతిమల తయారీలో గిన్నిస్‌లోకి ఎక్కిన నగరం.. రెండు నెలల్లోనే విజయవాడ నగరం గిన్నిస్ రికార్డులో చోటు సంపాదించింది. అమ్మవారి రథం ఊరేగింపు, 250కు పైగా డప్పు వాయిద్యాల కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా, 42కు పైగా కళా ప్రదర్శనలతో రెండు కిలోమీటర్లు పొడవునా మూడు వేల మంది భారతీయ కళాకారుల ప్రదర్శన ఆహూతులను అలరించింది. సీఎం చంద్రబాబు, స్టార్ షట్లర్ పీవీ సింధు వీక్షించారు. కళా ప్రదర్శనలు ఇచ్చిన బృందాలను సీఎం ప్రత్యేకంగా అభివాదం చేశారు.

ఇంద్రకీలాద్రి అధికారులు ఏర్పాటు చేసిన దుర్గమ్మ వైభవ శకటం ముందుకు కదులుతుండగా అమ్మవారికి కళా నైవేద్యం సమర్పిస్తున్నట్లు వెనుకనే కళాకారులు కదిలారు. చెన్నుపాటి పెట్రోల్ బంక్ కూడలి నుంచి ఆర్టీఏ జంక్షన్ వరకు కళాకారులు ప్రదర్శనల ఇస్తూ బెంజిసర్కిల్ వరకు చేరుకున్నాయి. కొండ దొరలు, దసరా పగటి వేషగాళ్లు, శ్రీకాకుళంలో పుట్టిన తప్పెట గుళ్ల ప్రదర్శన విశేషంగా ఆకర్షించాయి. దుర్గాదేవి అలంకరణలను ఓ బృందం అద్భుతంగా ప్రదర్శించింది. మళయాల నృత్యం,

ఎన్టీఆర్ జిల్లాలలోని ఏ కొండూరు ప్రాంత గిరిజనులు బిందె మీద బిందె పెట్టి చేసే ప్రదర్శన ఆకట్టుకుంది. గిరిజన సాంప్రదాయ వస్త్రాలంకరణలో మహిళలు అలరించిగా, పసుపు చీరలతో మహిళలు దింశా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కాటికాపరుల కళా రూపాలు ఆకట్టుకున్నాయి. చక్క బజన ఆకట్టుకోగా, గరగరలు, వీరనాట్య పురాణ గాథ కళారూపం అద్భుతాన్ని ఆవిష్కరించాయి. తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలకు చెందిన కళానైపుణ్యాల ప్రదర్శన జరిగింది. ఎంజీ రోడ్డులోకి వాహనాలను అనుమతించలేదు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఏటా ఉత్సవ్‌ను నిర్వహిస్తాం : కేశినేని శివనాథ్

విజయవాడ ఉత్సవ్ భవిష్యత్తులో అమరావతికి మణిహారంగా ఉంటుంది. ప్రతి ఏడాది విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నాలుగు వేదికలపై కళాకారుల ప్రతిభను నగర వాసులు ఎంతగానో ఆదరించాన్నారు. మంత్రి నారా లోకేశ్‌తో ప్రారంభించిన ఉత్సవ్ విజయవంతంగా సాగింది. మైసూరు, కలకత్తా ఉత్సవాలను తలపించే విధంగా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించామన్నారు. 11 రోజుల పాటు 5 వేదికపైౖ 280 కార్యక్రమాలు జరిగాయన్నారు. అంతరించిపోతున్న జానపద కళారూపాలను ఉత్సవ్ ద్వారా ప్రజలకు చూపించామన్నారు.











భరతనాట్య ప్రదర్శన

సాంస్కృతికోత్సవం

విజయవాడ కల్చరల్ / ఇబ్రహీంపట్నం / గొల్లపూడి / విజయవాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఉత్సవ్‌లో సాంస్కృతికోత్సవం వెల్లివిరిసింది. ఉత్సవ్ ముగింపు రోజు (విజయదశమి) గురువారం ప్రధాన వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

కాకినాడ కరపకు చెందిన తోట దావీదు బృంద తోలుబొమ్మలాట ప్రదర్శించారు. విఘ్నేశ్వర కళాబృందం విన్యాసాలు కనువిందు చేశాయి. జ్యోతుల శ్రీరామచంద్రమూర్తి వారి భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పక్కి మంజూష శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన రంజింప చేశాయి. భక్త ప్రహ్లాద పౌరాణిక నాటక ప్రదర్శన రక్తి కట్టించింది.

ఘంటసాల సంగీత కళాశాలలో..

శ్రీరాజేశ్వరి నాట్యమండలి బృందం ప్రదర్శించిన బాల నాగమ్మ జానపద పౌరాణిక పద్య నాటకం ఆహూతులను కట్టిపడేసింది. పాత్రలు మాయల ఫకీర్ పాత్రకు జెట్టి సాంబశివరావు, కార్యవర్థి- ముత్యాల నాగేశ్వరరావు, బాలవర్ధి -పాపారావు, తలారి- ఈగ నాగేశ్వరావు, పులిరాజు- కంచర్ల చంటి, బాల నాగమ్మ - తిరుమలాభి, సంగు - అడపా ప్రభావతి అద్భుత నటనాభినయం చేశారు. కాకినాడకు చెందిన రాజేశ్వరి బుర్రకథ బృందం అల్లూరి సీతారామ రాజు కథను ప్రదర్శించారు. అనంత పురానికి చెందిన తరిమెల రాజు కళాబృందం జానపద పాటలు ప్రేక్షకులను అలరించాయి. సాయి భవ్య శ్రీకూచిపూడి నాట్య ప్రదర్శన అలరిం చింది. సప్పా శివ కుమార్ శిష్యురాలు వి.సాయి భవ్యశ్రీ కూచిపూడి నాట్యం అలరించింది.



పల్లవి

గొల్లపూడి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రముఖ కర్నాటక సంగీత గాయకులు సందీప్ నారా యణ్ లైవ్ మ్యూజిక్ సంగీత ప్రియులను విశేషంగా అలరించింది. ఏపీ చంద్రబాబ ముఖ్య అతిథిగి పాల్గొన్నారు. కలకత్తా అమ్మ వారి బెంగాలీ సాంగ్ హరిగిరి నందిని పాటకు చేసిన నృత్య రూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న ఏవీ..

సీఎం చంద్రబాబు పై ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రదర్శించిన ఏవీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, విజయవాడ నగర ప్రజలతో ఎగ్జిబిషన్ మైదానం కిక్కిరిపోయింది. ఫుడ్ కోర్టుతో పాటు పలు రకాల ఆట వస్తువుల వద్ద, స్టాల్స్ వద్ద సందడి నెలకొంది. పున్నమి ఘాట్‌లో గురువారం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి నాట్యాచారిణి అనన్యరెడ్డి నృత్య ప్రదర్శన, గౌరీనాథ్ భక్తి సంకీర్తనలు ఆలపించి ఆధ్యాత్మిక భావాన్ని ఉప్పొంగించారు. గరికపాటి బృందం డప్పు కళా ప్రదర్శన ఇచ్చారు. పలు విన్యాసాలతో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యానికి గురిచేశారు. గాయకులు చరణ్, పల్లవి గీతాలు ఆలపించారు. కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి.



భక్తప్రహ్లాద నాటకం

స్వచ్ఛదాన్ - మారథాన్

● 13 రాష్ట్రాల నుంచి రన్నర్స్ ● 22, 10, 5 కేలుగా పరుగు

కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అమరావతి రన్నర్స్ సహకారంతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛదాన్- మారథాన్'కు విశేష స్పందన లభించిందని స్వఛ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. గాంధీ జయంతి 'స్వచ్ఛ దివస్' 'స్వచ్ఛ తాహి సేవ'లో భాగంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మారథాన్‌కు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన ఇల్లు పరిశుభ్రంగా వుంచుకోవడంతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా వుంచుకోవాలనే ఉద్దేశ్యంతో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ అంధ్రా' ఉద్యమాన్ని సీఎం చంద్రబాబు ముందుండి నడిపిస్తున్నారన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రా డేగా ప్రకటించి ప్రజల్లో స్వచ్ఛత పెంపొందించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం మారథాన్ కార్యక్రమం జరుగుతుందని పట్టాభిరామ్ తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సొసైటీఫర్ వైబ్రెంట్ విజయవాడ అధ్వర్యంలో 11 రోజులుగా 5 వేదికలపై జరుగుతున్న కార్యక్రమాలు భక్తులతో పాటు నగరవాసులు ఆస్వాదించారని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలకి నెలవుగా విజయవాడ మారిందన్నారు. విజయవాడ ఉత్సవ్ లాంటి వేడుకలు ప్రతి ఏటీ జరుగుతాయని గద్దె స్పష్టం చేశారు. సినీ నటుడు శర్వానంద్ మాట్లాడుతూ విజయవాడతో తనకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. ఇక్కడే పుట్టానన్నారు. ఇప్పుడు 12 కిలోమీటర్లు మాత్రమే పరుగెడుతున్నానని, వచ్చే దసరాకి స్వచ్ఛ మారథాన్‌లో 21 కేలో పాల్గొంటానన్నారు.



మారథాన్ ప్రారంభ సందర్భంగా మాట్లాడుతున్న కొమ్మారెడ్డి పట్టాభి, వేదికపై ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సినీ నటుడు శర్వానంద్ తదితరులు



మారథాన్‌లో పాల్గొన్న పలు రాష్ట్రాల క్రీడాకారులు

విజేతలకు బహుమతుల ప్రదానం

ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే రామ్మోహన్, స్వచ్ఛ కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, సినీ నటుడు శర్వానంద్ మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. 21కే రన్ ఎలైట్‌మెన్ విభాగంలో గుజరాత్‌కు చెందిన 'ధర్మేంద్ర పుణ్య'కి పతకంతో పాటు రూ.లక్ష, రన్నర్‌గా పంజాబ్‌కి చెందిన 'లవ్ ప్రీత్ సింగ్'కు రూ.50వేలు, సెకండ్ రన్నరప్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన 'దినేష్'కు రూ.25 వేలు పట్టాభి, ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి అందజేశారు. 10కేలో విజేతలుగా నిలిచిన నవరతన్ చౌహాన్, పంకజ్‌కుమార్, అరవింద్ యాదవ్‌లకు నగదు బహుమతులు అందించారు.

మహిళా విభాగంలో 21కేలో వరుసగా హర్యానాకు చెందిన సోనికా, భారతిలకు, విజేతలుగా నిలిచిన వారికి కూడా పతకాలు వేసి సత్కరించారు. 10 కేలో వరుస మూడు స్థానాల్లో నిలిచిన సీతారాణి, ఆషికా పటేల్, డింపుల్‌సింగ్‌కు పతకాలతో పాటు నగదు బహుమతి అందించారు. ఉత్సవ కమిటీ సభ్యుడు అనిల్ సుంకర, కేశినేని వెంకట్, బొండా సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు..



మోపిదేవి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్వచ్ఛ పాఠశాలగా, మోపిదేవికి చెందిన కర్లపూడి కోటేశ్వరరావు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొద్ది సంవత్సరాలుగా ఆవరణను పరిశుభ్రంగా ఉంచటం, రసాయన రహిత పెరిటి తోటల పెంపకం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయంలో వినియోగిస్తుండటం విశేషం. అవార్డుకు పాఠశాలను ఎంపిక చేయటంపై హెచ్‌ఎం జయంతి సంతోషం వ్యక్తంచేశారు.

స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా కోటేశ్వరరావు..

మోపిదేవి పంచాయతీలో పనిచేస్తున్న కర్లపూడి కోటేశ్వరరావు జిల్లా స్థాయిలో స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. 8 సంవత్సరాలుగా మోపిదేవి గ్రామం, పురవీధులు శుభ్రంగా ఉండేలా విశేష కృషి చేస్తున్నారు.



చల్లపల్లి : ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో స్వచ్ఛ పంచాయతీగా చల్లపల్లి గ్రామం అవార్డును సాధించింది. రాష్ట్రస్థాయిలో ఆరు గ్రామాలను ఎంపికచేయగా, అందులో చల్లపల్లి ఒకటి. రాష్ట్ర స్థాయి అవార్డుతోపాటు జిల్లాస్థాయిలో మరో నాలుగు అవార్డులకు ఎంపికయ్యింది. 6వ తేదీన విజయవాడలో సీఎం చంద్రబాబు అవార్డులను ప్రదానం చేయనున్నారు.



హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఇండస్ట్రీస్‌గా పురస్కారం లభించింది. వీరవల్లి వద్ద నిర్మించిన ప్రాజెక్ట్ కామధేను(పాల ఫ్యాక్టరీ) అనతి కాలంలోనే రూ.1200కోట్ల టర్నోవర్‌తో పాటు పాడిరైతులకు బోనస్ చెల్లింపులు, సంక్షేమాభివృద్ధికి కృషితో పాటు పలు పథకాల ద్వారా పాడిపరిశ్రమ అభివృద్ధికి చేయూతనిస్తోంది. కృష్ణాజిల్లా పాలఉత్పత్తిదారుల సహకార సంఘం తయారు చేస్తున్న పాల ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుతోపాటు హైజెనిక్ సాంకేతికతతో వినియోగిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛతకు మారుపేరుగా కృష్ణాజిల్లా పాలఉత్పత్తిదారుల సహకార సంఘం(కృష్ణా డిస్ట్రిక్ట్ మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్) నిలుస్తుందన్నారు.

పాడిరైతులదే ఈ పురస్కారం : చలసాని ఆంజనేయులు, ఛైర్మన్

పాలఉత్పత్తిని పెంపునకు కృషి చేస్తున్న ప్రతి పాడిరైతుదే ఈ పురస్కారమని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనే యులు అన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం కష్టించే రైతులే తమ యజమానులు. వారి కృషి ఫలితమే రాష్ట్రస్థాయి పురస్కారమన్నారు. ఈ సందర్భంగా అందరికి కృతజతలు తెలిపారు.

స్వచ్ఛ మునిసిపాలిటీగా తాడిగడప

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ ఉత్తమ స్వచ్ఛ మునిసిపాలిటీ అవార్డు సొంతం చేసుకొంది. కమిషనర్ షేక్ నజీర్ ఆనందం వ్యక్తం చేశారు. పెనమలూరు ఎంపీడీవో కార్యాలయం అవార్డును సొంతం చేసుకోగా, ఉత్తమ స్వచ్ఛ ఆసుపత్రిగా యనమలకుదురు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటరు, ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా పెనమలూరు ఉన్నత పాఠశాల, స్వచ్ఛ వారియర్‌గా యనమలకుదురు నాల్గో సచివాలయంలో పని చేస్తున్న బత్తుల రమణ అవార్డు సాధించారు.

నాగాయలంక: నాగాయలంక గ్రామ పంచాయతీకి జిల్లాస్థాయి అవార్డు వచ్చిందని కార్యదర్శి పవన్ కుమార్ తెలిపారు. పాలకవర్గం ఆనందం వ్యక్తం చేసింది.

స్త్రీశక్తి రూ.360 కోట్లు తక్షణం చెల్లించాలి

రవాణా శాఖ మంత్రికి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ వినతి

బస్టేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు శుక్రవారం రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలిసి ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం కింద చెల్లించాల్సిన 360 రూ.కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ మేరకు పలు ప్రధాన సమస్యలపై ఆయ నకు వినతి పత్రం అందజేశారు. సీఎం చంద్ర బాబు హామీ మేరకు జీవో ఇంకా రాలేదని, వాటి కోసం 6వేల మంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. మరోవైపు 3 వేల కొత్త బస్సులు, సిబ్బంది నియా మకాలకు చర్యలు చేపట్టాలన్నారు. పదవీ విరమణ చేసిన వారికి ఆర్‌వీఎంఎస్ స్కీమ్ అమలు వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సానుకూ లంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య బృందం ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు గడువు పెంపు

అగ్రి డైరెక్టర్ ఢిల్లీరావు

అమరావతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు గడువును ఈ నెల 25 వరకు పెంచినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పుచేర్పులకు ఈ నెల30 వరకు అవకాశం ఉంటుందన్నారు. తుది జాబితాను ఈ నెల31న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈసారి ఈ-కేవైసీని నోటిఫైడ్ పంటలకు మాత్రమే పరిమితం చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, సామాజిక అడవులు, సాగు చేయని బీడు భూములను ఈ-పంటలో నమోదు చేయాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగులు బదిలీ కావడం, కొత్త ప్రాంతాల్లో సిబ్బంది భూ సర్వే నంబర్లు గుర్తించలేకపోవడం, గత రెండు నెలలు వర్షాలు, యూరియా సరఫరాపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం వంటి కారణాలతో ఈ-పంట డిజిటల్ సర్వేలో పురోగతి సాధించలేకపోయారు. దీంతో రాష్ట్రంలోని 290లక్షల ల్యాండ్ పార్శిల్స్‌లో ఇప్పటివరకు 36 శాతంతో 88లక్షల ల్యాండ్ పార్శిల్స్‌లోనే ఈ-పంట నమోదు జరిగింది. కృష్ణా, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 50 శాతం కన్నా ఎక్కువగా ఈ-పంట నమోదు కాగా, కడప, చిత్తూరు, అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల్లో 22శాతమే ఈ-పంట నమోదు జరిగిందని వ్యవసాయశాఖ డైరెక్టర్ తెలిపారు.

నవ్య

కుటుంబ కదంబం

శనివారం
4 అక్టోబరు 2025



ఏడాది పొడవునా లభించే ఆకుకూరల్లో తోటకూర ఒకటి. దీంతో పప్పు, పులుసు, వేపుడు చేసుకుంటూ ఉంటాం. అలాగే పకోడి, గారెలు, బోండాలు లాంటి చిరుతిండ్లు కూడా చేసుకుని ఇష్టంగా తింటూ ఉంటాం. ఇవే కాకుండా... తోటకూరతో తయారుచేసే విభిన్న రుచులు మీకోసం...



తోటకూరతో విభిన్నంగా..!

వంటిల్లు



తోటకూర బేసన్ రోల్స్

కావాల్సిన పదార్థాలు

- తోటకూర ఆకులు పెద్దవి- పది, శనగ పిండి- ఒక కప్పు, కారం- రెండు చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, ఉప్పు- తగినంత, అల్లం- వెల్లుల్లి పేస్టు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, వాము- అర చెంచా, నూనె- తగినంత

తయారీ విధానం

- వెడల్పాటి గిన్నెలో శనగ పిండి, ఉప్పు, కారం, ధనియాల పొడి, అల్లం - వెల్లుల్లి పేస్టు, జీలకర్ర, వాము వేసి బాగా కలపాలి. తరువాత ఆ పిండిలో నీళ్లు చిలకరిస్తూ పేస్టులా తయారుచేయాలి.
- తోటకూర ఆకులను నీళ్లలో ముంచి తీయాలి. ఒక్కో ఆకు మీద శనగపిండి మిశ్రమాన్ని చెంచా సహాయంతో పలుచగా రాసి, దాన్ని చాపలా చుట్టి పళ్లెంలో పెట్టాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. తరువాత అందులో తోటకూర రోల్స్ పరచాలి. ఒక్కో రోల్‌ను ఫోర్క్ సహాయంతో అన్ని వైపులకూ తిప్పుతూ దోరగా వేయించాలి. రోల్స్ ఎర్రగా వేగిన తరువాత పళ్లెంలోకి తీయాలి. ఈ తోటకూర - బేసన్ రోల్స్‌ను టమాటా సాస్‌తో సర్వ్ చేయవచ్చు.

తరచూ తోటకూర తినడం వల్ల శరీరానికి కావాల్సిన ఎ, బి, సి, డి, ఇ, కె విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఫలితంగా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తోటకూరలోని ఐరన్, సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, జింక్ లాంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. రక్తహీనత, రక్తపోటు లాంటి సమస్యలను నివారిస్తాయి.

తోటకూర లివర్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు

- లేత తోటకూర కట్టలు- నాలుగు, పుట్నాల పొడి- అర కప్పు, అల్లం ముక్కలు- చిన్నవి రెండు, వెల్లుల్లి రెబ్బలు- మూడు, పచ్చి మిర్చి- ఆరు, జీలకర్ర- ఒక చెంచా, కార్న్‌ఫ్లోర్- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నూనె- తగినంత, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- కొద్దిగా, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా,



కారం- ఒక చెంచా, గరం మసాల పొడి- ఒక చెంచా, పెరుగు- అర కప్పు, మిరియాల పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నిమ్మకాయ- ఒకటి

తయారీ విధానం

- తోటకూరలో లావుపాటి కాడలను తొలగించాలి. తరువాత నీళ్లు పోస్తూ రెండు లేదా మూడు సార్లు శుభ్రంగా కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి సగానికి పైగా నీళ్లు పోసి మరిగించాలి. అందులో తోటకూర వేసి రెండు నిమిషాలు ఉడికించి వెంటనే ఒక పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. మిక్సీలో అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, అర చెంచా జీలకర్ర, పచ్చి మిర్చి, పావు చెంచా ఉప్పు, ఉడికించిన తోటకూర వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. వెడల్పాటి గిన్నెలో కార్న్‌ఫ్లోర్, పుట్నాల పొడి, తోటకూర పేస్టు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలో సమంగా పరచాలి. స్టవ్ మీద ఇడ్లీ కుక్కర్ పెట్టి అందులో నీళ్లు పోసి మరిగించాలి. ఆపైన తోటకూర మిశ్రమం ఉన్న గిన్నెను ఉంచి పది నిమిషాలపాటు ఆవిరి మీద ఉడికించి దించాలి. ఈ మిశ్రమం పూర్తిగా చల్లారాక చిన్న ముక్కలుగా కోయాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికి పైగా నూనె పోసి వేడిచేయాలి. అందులో తోటకూర మిశ్రమంతో చేసిన ముక్కలు వేసి, దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఇవి అచ్చం లివర్ ముక్కల్లాగే ఉంటాయి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నాలుగు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఆపైన జీలకర్ర, కరివేపాకు, పసుపు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలపాలి. ఉల్లిపాయ ముక్కలు ఎర్రగా వేగిన తరువాత ధనియాల పొడి, కారం, కొద్దిగా ఉప్పు, గరం మసాల పొడి, పెరుగు వేసి కలపాలి. నూనె పైకి తేలేవరకూ కలుపుతూనే ఉండాలి. తరువాత వేయించిన ముక్కలు, కొత్తిమీర వేసి పైకి కిందికి టాస్ చేయాలి. మూత పెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరగా మిరియాల పొడి చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. తరువాత నిమ్మరసం చిలకరించి వేడివేడిగా సర్వ్ చేయాలి.

తోటకూర ఓట్స్ కట్‌లెట్

కావాల్సిన పదార్థాలు

- తోటకూర- రెండు కట్టలు, ఓట్స్- ఒక కప్పు, పచ్చి మిర్చి- మూడు, అల్లం ముక్కలు- నాలుగు, ఉప్పు- రెండు చెంచాలు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, గరం మసాల పొడి- ఒక చెంచా, బియ్యం పిండి- రెండు చెంచాలు, పెరుగు- పావు కప్పు, నూనె- తగినంత

తయారీ విధానం

- తోటకూరను శుభ్రంగా కడిగి, సన్నగా తరిగి పెట్టుకోవాలి. మిక్సీలో పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, ఒక చెంచా ఉప్పు వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి, ఓట్స్ వేసి, దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి.
- వెడల్పాటి గిన్నెలో వేయించిన ఓట్స్, ఉల్లిపాయ ముక్కలు, తోటకూర తరుగు, పచ్చిమిర్చి- అల్లం పేస్టు, ఒక చెంచా ఉప్పు, గరం మసాల పొడి, బియ్యం పిండి, పెరుగు వేసి బాగా కలపాలి. అవసరమైతే కొన్ని నీళ్ల చుక్కలు చిలకరించుకుంటూ మెత్తని ముద్దలా చేయాలి. అరచేతికి నూనె రాసుకొని ఆ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ చిన్న కట్‌లెట్‌ల మాదిరి చేయాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి అందులో నాలుగు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఆపైన కట్‌లెట్‌లు పరిచి, చిన్న మంట మీద రెండు వైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఈ తోటకూర కట్‌లెట్‌లను టమాటా కెచప్, గ్రీన్ చట్నీ లేదా రైతాతో తింటే రుచిగా ఉంటాయి.

తోటకూరలోని పీచు పదార్థాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. దీంతో మలబద్ధకం, ఇతర జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయి. మూత్రపిండాలు శుభ్రపడతాయి. శరీర బరువును నియంత్రించడంలో తోటకూర ప్రధాన పాత్ర పోషిస్తుంది.

భోజన కుతూహలం

మనోబలాన్నిచ్చే బూడిదగుమ్మడి!

బూడిద గుమ్మడి కాయకు సంస్కృతంలో కూష్మాండం అనే పేరు ఉంది. తీగలకు కాసే కాయల్లో ఇది చాలా గొప్పదని 'భోజనకుతూహలం' గ్రంథం పేర్కొంది. బూడిద గుమ్మడి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అవేమిటో చూద్దాం..

- మూత్రపిండంలో రాళ్లు, అతిసారం, అధిక దాహం వంటి వ్యాధులకు బూడిద గుమ్మడి రసం అద్భుతంగా పనిచేస్తుంది.
- వేసవికాలంలో బూడిద గుమ్మడి రసం దేహాన్ని చల్లబరచి



శక్తినిస్తుంది. నిస్సత్తువను పోగొడుతుంది.

- నిద్రలేమి, నిరాశ, దిగులు, విచారం లాంటి మానసిక సమస్యలకు బూడిద గుమ్మడి రసం మెరుగైన ఔషధం. అందుకే దీనిని మనోబలాన్ని పెంచే కూరగాయగా ఆయుర్వేద గ్రంథాలు పేర్కొన్నాయి.
- బూడిద గుమ్మడి రసాన్ని క్రమం తప్పకుండా తాగితే రక్తపోటు సమస్య తగ్గుతుంది.
- మధుమేహం వల్ల కొందరికి అరికాళ్లలో మంటలు ఏర్పడతాయి. అలాంటి వారికి ఇది ఒక ఉత్తమమైన ఔషధం.
- శరీరాన్ని క్షీణింపచేసే క్షయ, దీర్ఘ జ్వరాలు లాంటి సమస్యలకు బూడిద గుమ్మడి మంచి ఔషధం.
- సాధారణంగా లేత బూడిద గుమ్మడి కాయలను వంటకాలకు, ముదిరిన కాయలను ఔషధాలలో ఉపయోగించుకోవటానికి వాడతారు. ముదురు గుమ్మడికాయలను ఎక్కువగా తింటే శరీరంలో కఫం పెరుగుతుంది. లేత గుమ్మడి క్షార స్వభావం కలిగినది. అందువల్ల కడుపులోని ఆమ్లత్వం తగ్గుతుంది.

ఏ వంటకం దేని కోసం..

- బూడిద గుమ్మడి పప్పు- బలాన్ని పెంపొందిస్తుంది
- ఇగురు కూర- శరీరానికి చలవనిస్తుంది
- పెరుగుపచ్చడి- ప్రేగులను బలపరుస్తుంది. అమీబియాసిస్ లాంటి సమస్యలు తొలగిస్తుంది
- రోటిపచ్చడి- దీని వల్ల శరీరంలోని జీర్ణ శక్తి పెరుగుతుంది.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

పండగ రోజుల్లో వెలిగిపోయేలా

పండగ రోజుల్లో మేకప్ కూడా ప్రత్యేకంగా ఉండేలా చూసుకోవాలి. అందంగా, ఆకర్షణీయంగా అన్నిటికీ మించి సహజసిద్ధంగా కనిపించేలా చూసుకోవాలి. అందుకోసం ఎంచుకోవలసిన మేకప్ చిట్కాలు ఇవే!

చర్మాన్ని సిద్ధం చేసి: కాలుష్యం, దుమ్ము, ధూళి వల్ల చర్మం రంగు తగ్గి, పొడిబారుతుంది. కాబట్టి స్క్రబ్‌తో చర్మాన్ని శుభ్రం చేసుకుని, ఆవిరి పట్టి, స్కిన్ ప్యాక్ వేసుకోవాలి. ప్యాక్‌ను తొలగించుకున్న తర్వాత ముఖాన్ని తడి లేకుండా తుడిచి, వెంటనే మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

చల్లనీళ్లు: ముఖ చర్మం బిగుతును సంతరించుకోవడం కోసం ఒక గిన్నెలో నీళ్లు నింపి, దాన్లో నాలుగైదు మంచు ముక్కలు వేసి, ముఖాన్ని ఆ నీళ్లలో ముంచి తీయాలి. తర్వాత తడి లేకుండా తుడుచుకుని మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

తగిన ప్రైమర్: జిడ్డు చర్మమైతే మాటిఫైయింగ్ లేదా సిలికాన్ ఫ్రీ ప్రైమర్ ఎంచుకోవాలి. పొడి చర్మమైతే... హైడ్రేటింగ్, ల్యూమినస్ బ్రైటెనింగ్, గ్లోయింగ్ అనే లేబుల్ ఉన్న ప్రైమర్ ఎంచుకోవాలి. అలాగే దాన్లో విటమిన్-సి ఉండేలా చూసుకోవాలి.



ఫౌండేషన్: 12 నుంచి 16 గంటల పాటు చెక్కుచెదరకుండా ఉండే ఫౌండేషన్ వాడుకోవాలి. ఇందుకోసం లాంగ్ వేర్, ట్రాన్స్‌ఫర్, స్వెట్ రెసిస్టెంట్ ఫార్ములాతో కూడిన ఫౌండేషన్ కోసం వెతకాలి.

కలర్ కరెక్ట్: కళ్ల దిగువన ఉండే నల్లని వలయాలను కనిపించకుండా చేయడానికి... ఇటుక రంగు టోన్‌లో ఉండే ఆరెంజ్ కరెక్టర్ సూటవుతుంది. తెల్లని చర్మం కలిగినవాళ్లకు పీచ్ రంగులోని కలర్ కరెక్టర్ బాగుంటుంది. కరెక్షన్ కోసం మొదట అవసరమైన ప్రదేశంలో కలర్ కరెక్టర్ అప్లై చేసి, వేళ్లతో లేదా బ్రష్‌తో అద్దుకోవాలి.

కన్‌సీలర్: మొటిమలు, కళ్ల కింది వలయాలను దాచడం కోసం కన్‌సీలర్ ఉపయోగించాలి. అయితే దీన్ని అప్లై చేసే ముందు ఆ ప్రదేశాల్లో ట్రాన్స్‌ల్యుసెంట్ పౌడర్‌ను అప్లై చేయాలి. తర్వాత దాని మీద కన్‌సీలర్ అద్ది, అంచులు కలిసిపోయేలా బ్రష్‌తో అద్దుకోవాలి. కంటి దిగువన వీలైనంత తక్కువ కన్‌సీలర్ వాడుకోవాలి.

బ్లష్: మేకప్ ఫ్లాట్‌గా కనిపిస్తుందంటే కచ్చితంగా బ్లష్ అప్లై చేసుకోవాలి. చక్కని మెరుపు, వర్చస్సుతో కనిపించడానికి బ్లష్ తోడ్పడుతుంది.

పోకడ

తారల వ్యానిటీ వ్యాన్లు నేడు హోదాలకు చిహ్నాలుగా మారిపోయాయి. హంగులు, అలంకరణల్లో ఏమాత్రం రాజీ పడని తారలు, వ్యానిటీ వ్యాన్లు వైభోగాలకు ప్రతిరూపాల్లా ఉండాలని కోరుకుంటున్నారు. అలాంటి కొందరు బాలీవుడ్ తారల వ్యానిటీ వ్యాన్ల గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.





విలాసాల వ్యాన్స్

రణ్‌వీర్ సింగ్ షూటింగ్‌కు వెళ్లాలంటే అతని వెంట ఏకంగా మూడు వ్యానిటీ వ్యాన్లు ఉండాల్సిందే! వాటిలో ఒకటి వ్యక్తిగత అవసరాల కోసమైతే, రెండోది వ్యాయామం కోసం, మూడోది వ్యక్తిగత వంటవాడి కోసం. ఇక షారూఖ్ ఖాన్ వ్యానిటీ వ్యాన్ ఎంతో పెద్దగా ఉంటుంది. ఈ వ్యాన్‌ను షారూఖ్.. దుబాయి నుంచి దిగుమతి చేసుకుని, తనకు తగ్గట్టు మెరుగులు దిద్దించుకున్నాడు. కారు అంతర్గత అలంకరణ బాధ్యతను సుప్రసిద్ధ కార్ల డిజైనర్, దిలీప్ ఛాబ్రియా తీసుకున్నాడు. షారూఖ్, ఈ కారు నిర్మాణానికి 4 నుంచి 5 కోట్ల రూపాయలను వెచ్చించాడు. ఆ విలాసవంతమైన వ్యాన్ మారుమూల ప్రాంతాల్లో, గ్రామాల్లోని ఇరుకైన వీధుల్లో తిరగలేదు. కాబట్టి అలాంటి ప్రదేశాల్లో షూటింగ్‌ల కోసం వ్యానిటీ వ్యాన్ వెండర్ కేతన్ వ్యానును అరువు తీసుకుంటూ ఉంటాడు. ఇక సల్మాన్ ఖాన్ వ్యానిటీ వ్యాన్‌లో అతని నిలువెత్తు ఫొటో ఉంటుంది. దీన్లో అవసరమైన విలాసాలన్నీ ఉంటాయి. అనూష్క శర్మ వ్యానిటీ వ్యాను స్కాండినేవియన్ శైలిని ప్రతిబింబిస్తూ ఉంటుంది. వరుణ్ ధావన్ వ్యానిటీ వ్యానులో గేమింగ్ కన్సోల్స్, అతి పెద్ద బెడ్ ఉంటాయి. కొందరు తారలు తమదైన ప్రత్యేకమైన శైలిని వ్యాన్ ఇంటీరియర్‌లో కనబరచాలనుకుంటారు. అలాంటి వాళ్లలో జాన్ అబ్రహామ్ ఒకడు. నలుపు రంగును అమితంగా ఇష్టపడే జాన్ తన వ్యాన్‌లో టాయ్‌లెట్‌ను కూడా నలుపు రంగులోనే డిజైన్ చేయించుకున్నాడు. అలాగే బయటి వెలుగు వ్యాన్‌లోకి ప్రసరించడం కోసం, బయటి ప్రపంచాన్ని చూడడం కోసం ఫ్లోరింగ్ నుంచి సీలింగ్ వరకూ అద్దాలను ఏర్పాటు చేయించుకున్నాడు. ఇక నటి కంగనా రనౌత్ తన వ్యానిటీ వ్యాన్‌ను అత్యంత ఖరీదైన షీషమ్ కలపతో తయారుచేయించుకుంది.

> "కొందరు తారలు తమదైన ప్రత్యేకమైన శైలిని వ్యాన్ ఇంటీరియర్‌లో కనబరచాలనుకుంటారు. అలాంటి వాళ్లలో జాన్ అబ్రహామ్ ఒకడు. నలుపు రంగును అమితంగా ఇష్టపడే జాన్ తన వ్యాన్‌లో టాయ్‌లెట్‌ను కూడా నలుపు రంగులోనే డిజైన్ చేయించుకున్నాడు."

ఆకాశాన్నంటే ధరలతో...

ఒక వ్యాన్ తయారీకి అయ్యే ఖర్చు సగటున పది నుంచి 15 లక్షల వరకూ ఉంటుంది. బహుళ గదులు, లివింగ్ స్పేస్‌ను విస్తరించుకునే వీలున్న సూపర్ వ్యాన్ ఖరీదు రెండు నుంచి మూడు కోట్ల రూపాయలు. ఇటాలియన్ మార్బుల్, విలాసవంతమైన రిక్లైనర్లు, జిమ్ సౌకర్యాలు కలిగి ఉండే వ్యాన్ 75 లక్షల నుంచి కోటి రూపాయలు. సాధారణ సోఫాలు, ఒక చిన్న ప్యాంట్రీ, చిన్నపాటి స్నానాల గది, టీవీ కలిగి ఉండే మధ్యస్థ వ్యాను 30 నుంచి 50 లక్షల రూపాయలు. డ్రెస్సింగ్ ఏరియా, ఏసి మాత్రమే కలిగి ఉండే సాధారణ వ్యాను 15 నుంచి 20 లక్షల రూపాయలు. వ్యానిటీ వ్యాన్లను తారలకు నచ్చినట్టు రూపొందించే వెండర్ కేతన్ రావల్ వ్యానిటీ వ్యాన్ల కొత్త పోకడల గురించి మాట్లాడుతూ... 'మొదట్లో అవసరాల ఆధారంగా వ్యాన్లు తయారయ్యేవి. మారుమూల ప్రాంతాల్లో షూటింగ్ జరిగేటప్పుడు అక్కడ దుస్తులు మార్చుకునే వెసులుబాట్లు, సేద తీరే సౌలభ్యాలు లేకపోవడంతో తారల సినీ జీవితాల్లోకి వ్యానిటీ వ్యాన్లు ప్రవేశించాయి. కాలక్రమేణా అవి వారి హోదాలకు చిహ్నాలుగా మారిపోయాయి. జాన్ అబ్రహామ్ నలుపు రంగును ఇష్టపడతాడు. కాబట్టి వ్యాన్‌లో ఫ్లోరింగ్ నుంచి సింక్, టాయ్‌లెట్ వరకూ అన్నీ నలుపు రంగులోనే రూపొందించాలని నన్ను అడిగాడు" అంటూ వివరించాడు. వ్యానిటీ వ్యాన్లు నిర్మించే మరొక వ్యక్తి ప్రతీక్ మలేవార్, కంగనా రనౌత్ వ్యానిటీ వ్యానును షీషమ్ కలపతో డిజైన్ చేశాడు.



షారూఖ్ బస్సులో...

వాల్వో బిఆర్9 బస్సు ఫ్లోర్ మొత్తం నలుపు రంగు గాజుతో తయారైంది. పైకప్పు మొత్తం ఉడెన్ ప్యానల్స్ పరిచి ఉంటాయి. దీన్లో ప్యాంట్రీ సెక్షన్, వార్డ్‌రోబ్ సెక్షన్, ప్రత్యేకమైన మేకప్ కుర్చీ, ప్రత్యేకమైన టాయ్‌లెట్‌లు ఉంటాయి. దీన్లో ఇన్‌బిల్ట్ షవర్ ఉంది. ఒక బెడ్‌రూమ్ ఫ్లాట్ పరిమాణంలో ఉంటుంది. ఈ బస్సులో అమర్చి ఉండే ఎలక్ట్రిక్ ఛైర్ ఒక మీట నొక్కితే బస్సులో ఈ మూల నుంచి ఆ మూలకు తీసుకువెళ్తుంది. పార్కు చేసి ఉన్నప్పుడు ఈ బస్సులో ఒక వైపు భాగాన్ని విస్తరించుకునే వీలుంటుంది.

వర్షాకాలంలో జుట్టు రాలకుండా...

చాలామందికి వర్షాకాలంలో ఎక్కువగా జుట్టు రాలుతూ ఉంటుంది. చుండ్రు, దురద, కురుపులు వేధిస్తుంటాయి. జుట్టు రాలకుండా బలంగా ఉండాలంటే తేలికగా జీర్ణమయ్యే సమతుల ఆహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో శిరోజాల సమస్యల నుంచి బయటపడేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం...

- పప్పుధాన్యాలు, కూరగాయలతో తయారుచేసిన సూప్‌లు తాగడం శ్రేయస్కరం. నూనె పదార్థాలు, వేపుళ్లు తినకూడదు. ఆహారంలో ఉసిరి, కరివేపాకు, మెంతులను చేర్చుకోవడం వల్ల వర్షాకాలంలో వచ్చే శిరోజాల సమస్యలనుంచి బయటపడవచ్చు.
- ప్రొటీన్లు అధికంగా ఉండే కోడిగుడ్లు, లీన్ మీట్, చేపలు, పప్పుధాన్యాలు, బీన్స్ తినడం వల్ల శిరోజాలు ఆరోగ్యంగా పెరుగుతాయి.



- సాల్మన్ చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మాడుమీద చుండ్రు, కురుపులు రాకుండా కాపాడతాయి. శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరిగేలా చేస్తాయి.
- పాలకూర, రెడ్ మీట్, పప్పు దినుసుల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. వీటిని తరచూ తినడం వల్ల చక్కగా రక్తప్రసరణ జరిగి జుట్టు కుదుళ్లు బలోపేతమవుతాయి. ఫలితంగా శిరోజాలు రాలడం ఆగిపోతుంది.
- విటమిన్-ఎ అధికంగా ఉండే క్యారెట్, బొప్పాయి తినడం వల్ల మాడు పొడిబారకుండా తేమతో నిండి ఉంటుంది. విటమిన్-సి ఎక్కువగా ఉండే సిట్రస్ జాతి పండ్లు, బెర్రీలు తినడం వల్ల మాడు మీద కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది.

నిద్ర పట్టట్లేదా..?

శారీరక, మానసిక ఆరోగ్యానికి నిద్ర అత్యవసరం. పని ఒత్తిడి, ఆందోళన, ఆరోగ్య సమస్యలు, పోషకాహార లోపం లాంటి పలు కారణాల వల్ల సరిగా నిద్ర పట్టక ఇబ్బంది కలుగుతుంటుంది. అలాంటప్పుడు హాయిగా నిద్ర పట్టాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...

- రాత్రిపూట పడుకునేముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు జాజికాయ పొడి లేదా అశ్వగంధ చూర్ణాన్ని కలుపుకొని తాగితే నాడీ వ్యవస్థ నెమ్మదించి వెంటనే నిద్ర వచ్చేస్తుంది.
- చామంతి, తులసి లాంటి హెర్బల్స్‌తో తయారు చేసే టీ తాగినా గాఢంగా నిద్ర పడుతుంది.
- తరచూ కివి, టార్ట్ చెర్రీ, గ్రీన్ టీ తీసుకోవడం వల్ల నిద్ర సమస్యలు తగ్గుతాయి.
- రోజూ ధ్యానం, ప్రాణాయామం చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి హాయిగా నిద్ర పడుతుంది
- రాత్రి భోజనంలో నూనె పదార్థాలు, మసాలాలు చేర్చిన ఆహారం తీసుకోకూడదు. తేలికగా జీర్ణమయ్యే వాటిని మాత్రమే తినాలి.



హైదరాబాద్‌కు తొలి టెస్లా కారు!

» ముంబైలో కొని హైదరాబాద్‌కు లాంగ్ డ్రైవ్



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తొలి టెస్లా కారు అడుగుపెట్టింది. కొంపల్లికి చెందిన డాక్టర్ ప్రవీణ్ కోడూరు దీన్ని ముంబైలోని టెస్లా షోరూమ్‌లో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. మన దేశంలో రోడ్డెక్కిన 6వ టెస్లా కారు ఇదే. గతనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు ముంబైలో కారు డెలివరీ తీసుకున్నానని, అక్కడి నుంచి ఆ కారు నడుపుకొంటూ పుణెలో ఒకసారి, షోలాపూర్‌లో మరోమారు ఆగి చార్జింగ్ చేసుకున్నామని.. 770 కి.మీ. ప్రయాణించి హైదరాబాద్ వచ్చామని వివరించారు.

6న స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులను సీఎం చంద్రబాబు విజేతలకు అందజేస్తారని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ బి.అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 'అనంతపురం జిల్లా స్వచ్ఛ జిల్లాగా ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో 69మంది, జిల్లా స్థాయిలో 1,257 మంది... మొత్తంగా 1,326 మంది విజేతలకు బహుమతులు అందజేస్తాం. 3 లక్షల లోపు జనాభా ఉన్న పట్టణాల విభాగంలో గుంటూరు జిల్లాలోని మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తాడిపత్రి, బొబ్బిలి మున్సిపాలిటీలు అగ్రస్థానాల్లో నిలిచాయి. ఈ నెల 6న విజయవాడలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తాం' అని అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఈ-పంట నమోదు గడువు పెంపు: అగ్రి డైరెక్టర్

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు గడువును 25వరకు పెంచినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పుచేర్పులకు ఈ నెల30 వరకు అవకాశం ఉంటుందన్నారు.

పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు పునర్వ్యవస్థీకరణ

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీస్ అధికారుల బదిలీలు, నియామకాలను నిర్ణయించే బోర్డును ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా పంపించిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

» గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని రత్నాకర్ స్పష్టం చేశారు.

వణికిన ఉత్తరాంధ్ర

పెనుగాలుల బీభత్సానికి విరిగిన చెట్లు, స్తంభాలు.. విశాఖ, సిక్కోలు జిల్లాలు అతలాకుతలం



విశాఖ ద్వారకా నగర్‌లో పెనుగాలులకు కూలిన విద్యుత్ స్తంభం, చెట్టు

- నలుగురి మృతి.. మృతుల్లో వృద్ధ దంపతులు
- కుండపోత వానలతో జనజీవనం అస్తవ్యస్తం
- ఉగ్రరూపం దాల్చిన వంశధార, నాగావళి నదులు
- 'హుద్‌హుద్' గుర్తొచ్చి హడలెత్తిన విశాఖ వాసులు
- కొద్ది క్షణాలపాటు గంటకు 66 కి.మీ. వేగం
- నీట మునిగిన పంటలు.. పలు కాలనీలు

విశాఖపట్నం, శ్రీకాకుళం, అనంతగిరి, పార్వతీపురం, విజయనగరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో కుండపోత వానలు, ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. వాయుగుండం కారణంగా విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో గురువారం ఎడతెరిపిలేని వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఈదురుగాలులకు విద్యుత్ తీగపడి విశాఖలో ఒకరు, గోడలు కూలి సిక్కోలు జిల్లాలో ఇద్దరు, మన్యం జిల్లాలో ఒకరు.. మొత్తం నలుగురు మృతి చెందారు. సిక్కోలు జిల్లాకు సంబంధించి.. ఎగువన ఒడిశాలోనూ భారీవర్షాలు కురవడంతో ఆ వరద కూడా జిల్లాను ముంచెత్తింది. వంశధార, నాగావళి నదులు ఉగ్రరూపం దాల్చాయి. నదీ పరీవాహక ప్రాంతాలను దాటి ఇళ్లల్లోకి నీరు చేరడంతో జనం అతలాకుతలమయ్యారు. ముఖ్యంగా పాతపట్నం, పలాస, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. 17 మండలాల్లో 8,690 ఎకరాల వరి పంట పూర్తిగా ముంపునకు గురైంది. పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. జిల్లా అంతటా సుమారు 20 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం రాత్రి నుంచి వంశధార నదిలో వరద అధికమైంది. శుక్రవారం నుంచి నాగావళి నది ఉధృతమైంది. పంట పొలాలు, ఇళ్లు జలమయమయ్యాయి. మందస మండలం హంసరాలి పంచాయతీ సవర టుబ్బారులో గోడ కూలి సవర బుద్ధయ్య (64), రూపమ్మ(60)అనే వృద్ధ దంపతులు మృతి చెందారు. పలుచోట్ల మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. మన్యం జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కురుపాం మండలం ఉదయంపురం కాలనీకి చెందిన కె.అరవింద్ గోడకూలి మృతి చెందాడు. ఇక, విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలో అరటి, చెరకు, మొక్కజొన్న పంటలు ధ్వంసమయ్యాయి. గజపతినగరం మండలంలోని చిట్టయ్యవలసలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి ఐదు గేదెలు శుక్రవారం మృతిచెందాయి. చంపావతి, నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు పొంగాయి.

అప్రమత్తమైన మంత్రులు, అధికార యంత్రాంగం

కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఎప్పటికప్పుడు శ్రీకాకుళం జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు వాటిల్లకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి.. అధికారుల బృందం.. ఎమ్మెల్యేలతో కలసి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. విశాఖలో గురువారం ఉదయం 11 గంటల సమయాన కొద్ది క్షణాలు 66 కి.మీ. వేగంతో వీచిన గాలులు 11 ఏళ్లనాటి (2014 అక్టోబరు 12) హుద్‌హుద్‌ను తలపించాయి. అనేక చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. కంచరపాలెంలో టీ స్టాల్ నడుపుతున్న బత్తిన ఈశ్వరరావు (52) విద్యుత్ వైరు తెగి పడడంతో మృతిచెందారు. దుకాణం వద్ద టీ తాగుతున్న గవర కంచరపాలేనికి చెందిన మరో వ్యక్తి కూడా ఈ ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



శ్రీకాకుళం జిల్లా హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద వంశధార ఉధృతి

విద్యుత్ శాఖకు 1.78 కోట్ల నష్టం

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాలు, వీచిన పెనుగాలులకు విద్యుత్ శాఖకు రూ.1.78 కోట్ల నష్టం వాటిల్లిందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ శుక్రవారం తెలిపారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండల పరిధిలో గల చిమిడిపల్లి-శైడ స్టేషన్ల మధ్య గురువారం మధ్యాహ్నం కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్‌లో ఓహెచ్‌సీ (ఓవర్‌హెడ్ కేటనరీ) విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడడంతో సాయంత్రం వరకూ రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వంశధార, నాగావళి, గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం!

అమరావతి, పోలవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గోదావరి, వంశధార, నాగావళి నదుల వరద ఉధృతి క్రమంగా తగ్గుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 36.90 అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టు నుంచి 8,57,707 క్యూసెక్కుల జలాలను జలవనరులశాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 13.60 అడుగుల నీటిమట్టం నమోదైంది.

2,905 హెక్టార్ల పంట మునక

ఉత్తరాంధ్రతో పాటు బాపట్ల జిల్లాలో వర్షాలకు 2,905 హెక్టార్లలో పంట నీట మునిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. నాలుగు జిల్లాల్లోని 14 మండలాల్లో 107గ్రామాలకు చెందిన 2,828మంది రైతులకు చెందిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలు ముంపునకు గురైనట్లు గుర్తించింది.

తీరం దాటిన వాయుగుండం

నేడూ ఉత్తరాంధ్రలో భారీవర్షాలు.. పలు జిల్లాల్లో వానలు

అరేబియా సముద్రంలో 'శక్తి' తుఫాన్

10న బంగాళాఖాతంలో అల్పపీడనం

ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశాను అనుకుని రెండు రోజులపాటు పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగిన తీవ్ర వాయుగుండం గురువారం సాయంత్రం గోపాల్‌పూర్‌కు సమీపంలో తీరం దాటింది. ఆ తరువాత పశ్చిమ వాయువ్యంగా పయనించే క్రమంలో శుక్రవారం ఉదయం వాయుగుండంగా బలహీనపడి ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లపై కొనసాగుతోంది. కాగా, శనివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, అరేబియా సముద్రంలోని వాయుగుండం గురువారం సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా, శుక్రవారం నాటికి తుఫాన్‌గా బలపడింది. దీనికి 'శక్తి' అని పేరుపెట్టారు. శుక్రవారం రాత్రికి తీవ్ర తుఫాన్‌గా బలపడి పశ్చిమ మధ్య అరేబియా సముద్రం వైపు పయనించనుంది. మరోవైపు ఈ నెల 10న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశా వైపు రానుందని వాతావరణ నిపుణులు చెప్పారు.

మృతుల కుటుంబాలకు 4లక్షల పరిహారం

ఉత్తరాంధ్రలో వర్షాలు, వరదలపై కలెక్టర్లతో సీఎం సమీక్ష

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారికి సంబంధించి, ఆయా కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున పరిహారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర జిల్లాల కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వరద కారణంగా నీట మునిగిన పంటను లెక్కించి, నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయశాఖను ఆదేశించారు. కాగా, భారీ వర్షాలు, వరదల వల్ల ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత అధికారులను ఆదేశించారు.

ఉపశమన చర్యలు చేపట్టండి: పవన్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే ఉపశమన చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రక్షిత తాగునీటి సరఫరాశాఖ అధికారులను ఆయన అప్రమత్తం చేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అలరించే తొలి గీతం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇక తాజాగా చిత్రబృందం తొలి గీతాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దసరా సందర్భంగా 'మీసాల పిల్లా' అంటూ కథానాయికను ఆటపట్టిస్తూ సాగే ఈ గీతం ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. చాలా రోజుల తర్వాత మళ్లీ చిరంజీవికి బాలీవుడ్ గాయకుడు ఉదిత్ నారాయణ్ తన గళాన్ని అందించగా, ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో స్వరాలందించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

డిసెంబర్‌లో అఖండ తాండవం



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అఖండ 2: తాండవం'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. డిసెంబర్ 5న 'అఖండ 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో బాలకృష్ణ శక్తిమంతమైన లుక్‌లో కనిపించారు. సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, ఆది పినిశెట్టి ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుదిదశలో ఉన్నాయి. సంగీతం: థమన్ ఎస్, సినిమాటోగ్రఫీ: సీ రాంప్రసాద్, సంతోశ్ డి.

దసరా సినీ సందడి

చాలా రోజుల తర్వాత మళ్లీ దసరా పండుగ తెలుగు చిత్ర పరిశ్రమలో జోష్ నింపింది. పలు చిత్రాల ప్రారంభోత్సవాలతో ఇండస్ట్రీ కళకళలాడింది. వర్ధమాన కథానాయకుల నుంచి స్టార్ హీరోల వరకు నటిస్తోన్న చిత్రాల తాజా అప్డేట్స్‌తో నిర్మాణ సంస్థలు సినీ ప్రేమికులకు ఆనందాన్ని కలిగించాయి.

విభిన్న కథాంశంతో..



బ్లాక్ బస్టర్ హిట్ 'సామజవరగమన' తర్వాత కథానాయకుడు శ్రీవిష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు కాంబినేషన్ మరోసారి విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించనున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో సాయి దుర్గాతేజ్ క్లాప్ కొట్టారు. కథానాయకుడు నారా రోహిత్‌తో కలసి స్క్రిప్ట్‌ని నిర్మాతలకు అందజేశారు. సీనియర్ నటుడు వీకే నరేశ్, వెన్నెల కిశోర్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

రాగ్ మయూర్ 'అనుమాన పక్షి'



రాగ్ మయూర్ కథానాయకుడిగా విమల్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి 'అనుమాన పక్షి' అని మేకర్స్ టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని చిలక ప్రొడక్షన్స్ బేనర్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. సినిమా త్వరలోనే థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'అనుమాన పక్షి' అనే పేరు రాగ్‌మయూర్ పాత్ర విచిత్ర స్వభావాన్ని సూచిస్తోంది.

ఈతరానికి నచ్చే కథ



అభిరామ్ కథానాయకుడిగా కొత్త చిత్రం ప్రారంభమైంది. అభిరామ్ రెడ్డి దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అనూరాధ దేవి సమర్పిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు సీనియర్ జర్నలిస్ట్ భగీరథ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో అభిరామ్ క్లాప్ కొట్టారు. 'సినిమా రెగ్యులర్ షూటింగ్ దీపావళి తర్వాత ప్రారంభమవుతుందని, ఈ తరానికి నచ్చే కథతో నిర్మిస్తున్నామని, త్వరలోనే నటీ నటులను ఎంపిక చేస్తామని' నిర్మాత అభిరామ్ రెడ్డి దాసరి చెప్పారు.

సరికొత్త ప్రేమ కథ



చైతన్య రావు మదాడి హీరోగా క్రాంతి మాధవ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సరికొత్త ప్రేమ కథా చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. కథానాయికగా ఐరా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రాన్ని పూర్ణ నాయుడు, శ్రీకాంత్ వి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దేవ కట్టా క్లాప్ కొట్టగా, కె.ఎల్.దామోదర ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి వర ముళ్లపూడి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు క్రాంతి మాధవ్ మాట్లాడుతూ 'న్యూ ఏజ్ లవ్ స్టోరీగా ఈ చిత్రం రాబోతోంది. అందమైన లొకేషన్లలో చిత్రీకరిస్తున్నాం' అని చెప్పారు. హీరో చైతన్య రావు మాట్లాడుతూ 'మయసభ', 'ఘాటీ' తర్వాత ఇంత మంచి సినిమా చేస్తుండటం నా అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు.

విభిన్న మనస్తత్వాల 'ఉత్తర'



నటుడు శివాజీ ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తోన్న చిత్రంలో నటి లయ ముఖ్య పాత్ర పోషిస్తోన్న విషయం తెలిసిందే. శివాజీ ప్రొడక్షన్స్ బేనర్‌పై రానున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈటీవీ విన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఇంకా పేరు పెట్టలేదు. తాజాగా లయ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. లయ 'ఉత్తర' అనే గృహిణి పాత్రను పోషిస్తున్నారు. బయటికి సాధారణ మహిళగా కనిపిస్తూనే, లోపల నేర ప్రవృత్తిని దాచిపెట్టుకుంటూ, రెండు రకాల మనస్తత్వాలతో సాగే పాత్రలో లయ తన నట విశ్వరూపాన్ని చూపించబోతున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది.

కామ్రేడ్ కల్యాణ్



శ్రీవిష్ణు టైటిల్ రోల్ పోషిస్తోన్న కొత్త చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. మహిమా నంబియార్ కథానాయిక. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ చిత్ర టైటిల్‌తో పాటు టీజర్ విడుదల చేశారు. 1992లో ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని విశాఖ జిల్లా మాడుగుల గ్రామ నేపథ్యంలో సాగే కథ ఇది. నక్సలైట్ ముప్పు పెరుగుతోందని రేడియోలో అనౌన్స్ చేసే సన్నివేశంతో మొదలైన టీజర్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో శ్రీవిష్ణు డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారు. రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కొత్త అధ్యాయానికి నాంది



'మిరాయ్' భారీ విజయం తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 'రాజు గారి గది 4: శ్రీచక్రం' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రాజు గారి గది సిరీస్‌లో నాలుగో భాగంగా రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి ఓంకార్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ఎర్రటి చీరలో ఒక మహిళ ఉగ్రరూపంలో, కాళిమాతని గుర్తుచేసే దేవతా విగ్రహం ముందు ఎగురుతోంది. 'ఏ డివైన్ హారర్ బిగిన్స్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో 'శ్రీచక్రం' ఓ కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని మేకర్స్ ప్రకటించారు.

'మావా' ఆరంభం



ప్రేమ్, వాసంతిక జంటగా నూతన దర్శకుడు ఏ.ఆర్.ప్రభావ్ తెరకెక్కించనున్న 'మావా' చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. దీన్ని వెంకటేశ్ బాలసాని నిర్మిస్తున్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా వెంకటేశ్ బాలసాని క్లాప్ కొట్టగా, ఆయన సతీమణి పద్మ కెమెరా స్విచ్చాన్ చేశారు. "మావా' స్నేహం మీద సాగే ఒక భావోద్వేగ ప్రయాణమని, దర్శకుడు ప్రభావ్ ఓ సరికొత్త పాయింట్‌తో తెరకెక్కించబోతున్నారని చిత్ర బృందం పేర్కొంది.

వెంకీ క్లాప్‌తో నాని సినిమా ప్రారంభం



విభిన్న కథాంశాలను ఎన్నుకొని చిత్రాలు చేస్తూ వరుస విజయాలు సాధిస్తున్న హీరో నాని కొత్త చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. 'ఓజీ' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్న దర్శకుడు సుజీత్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. హీరో నానితో కలసి వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నాని తండ్రి రాంబాబు ఘంటా కెమెరా స్విచ్ ఆన్ చేయగా, హీరో వెంకటేశ్ ఈ వేడుకకు హాజరై తొలి క్లాప్ ఇచ్చారు. దర్శకులు రాహుల్ సంకృత్యాన్, శ్రీకాంత్ ఓదెల, శౌర్యన్ కలసి ముహూర్తపు షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. హీరో నాని కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని దర్శకనిర్మాతలు చెప్పారు. యాక్షన్, ఎమోషన్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో అందరికీ నచ్చే విధంగా చిత్రం ఉంటుందని దర్శకుడు సుజీత్ చెప్పారు.

మంచి సందేశాన్నిచ్చే 'అరి'



వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్ ప్రధాన పాత్రధారులుగా జయశంకర్ తెరకెక్కించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది దీని ఉపశీర్షిక. ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి.శేషురెడ్డి మారంరెడ్డి, నాయుడు నిర్మించారు. సినిమాను ఏషియన్ సురేశ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈనెల 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

నవలారచయిత లల్లాదేవి అస్తమయం



కలం పేరునే తన పేరుగా మార్చుకుని పలు బాషా చిత్రాలకు కథలను అందించిన ప్రముఖ నవలా రచయిత లల్లాదేవి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెం గ్రామానికి చెందిన ఆయన అసలు పేరు పరుచూరి నారాయణాచార్యులు (85). లల్లాదేవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం అర్ధరాత్రి కన్నుమూశారు. శుక్రవారం స్వగ్రామమైన నిమ్మగడ్డవారిపాలెంలో ఆయనకు గ్రామస్థులు, పలువురు ప్రముఖులు కన్నీటి వీడ్కోలు పలికారు.

పురాతన చరిత్రకు అక్షర రూపాన్నిచ్చి నవలల రూపంలో అందించారు లల్లాదేవి. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ పురాణ పండిట్‌గా పనిచేస్తూనే ఆయన రచించిన లల్లరామాయణం ఎంతో ప్రజాదరణ పొందింది. 1250 శ్లోకాలతో వాత్సాయన కామసూత్రాలు రాశారు. అంతేకాకుండా ఆయన రచించిన మహామంత్రి తిమ్మరుసు నాటకం 2003 వరకు సీనియర్ ఇంటర్మీడియట్‌కు ఉపవాచకంగా ఉంది. ఆయన రాసిన 'శ్వేతనాగు' నవల అదే పేరుతో సౌందర్య కథానాయికగా సినిమాగా వచ్చింది. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన 'కరుణించిన కనకదుర్గ', కన్నడలో అంబరిష్‌తో, అరణ్యలల్లా, అభిమన్యు సినిమాలు ఈయన రాసిన నవలల ఆధారంగా రూపుదిద్దుకున్నాయి.

-ప్రత్తిపాడు, ఆంధ్రజ్యోతి

మంగళగిరి సమీపంలో 112 కోట్లతో ఆర్ఓబీ


» ఎన్ 16తో అమరాతి అనుసంధానానికి మార్గం సుగమం

» పూర్తి స్థాయిలో నిధులు సమకూర్చనున్నరైల్వే

హైదరాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మంగళగిరి - కృష్ణా కెనాల్ స్టేషన్ల మధ్య ఈ-13 ఎక్స్‌టెన్షన్ రోడ్డు వద్ద రూ.112 కోట్ల అంచనా వ్యయంతో ఆరు లైన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణ ప్రతిపాదనలకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం పలికింది. ఏపీలోని జాతీయ రహదారి 16తో రాజధాని అమరావతిని అనుసంధానించే రహదారిపై ప్రతిపాదించిన ఆర్ఓబీ నిర్మాణం కోసం రైల్వే పూర్తి స్థాయిలో నిధులు సమకూరుస్తుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్‌హెచ్ 16ను రాజధాని అమరావతితో కలిపే రహదారి ఈ-13. ఈ రహదారి మధ్యలో చెన్నై- హౌరా రైల్వే ట్రాక్ ఉంది. విజయవాడ జంక్షన్ మీదుగా వెళ్లే ఈ ప్రధానమైన రైల్వే లైన్ నిత్యం రద్దీగా ఉంటుంది. మొదట్లో దీనిపై నాలుగు లైన్ల ఆర్ఓబీని ప్రతిపాదించారు. అయితే, సమీప భవిష్యతులో పెరుగనున్న ట్రాఫిక్ రద్దీని పరిగణ నలోకి తీసుకుని ఆరు లైనుల రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని రాష్ట్ర ప్ర భుత్వం ప్రతిపాదించింది. దానికి రైల్వే శాఖ అంగీకారం తెలిపింది. త్వరలో డిజైన్ల ఆమోదం, డ్రాయింగ్‌లు వంటి ప్రాథమిక పనులు పూర్తి చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

అమరావతి కోసం ఎస్పీవీ

పనుల వేగవంతానికి క్యాబినెట్ నిర్ణయం



» రాజధానిలో భూసేకరణ నోటిఫికేషన్ నుంచి 343.36 ఎకరాల భూమి మినహాయింపు

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పనుల వేగవంతంకోసం, ప్రత్యేక ప్రాజెక్టుల అమలుకోసం స్పెషల్ పర్పస్ వెహికల్‌ను (ఎస్పీవీ) ఏర్పాటుచేస్తూ రాష్ట్ర మంత్రిమండలి కీలక నిర్ణయం తీసుకుంది. కంపెనీ చట్టం కింద దీనిని ఏర్పాటుచేస్తారు. అలాగే, గతంలో భూసేకరణ నోటిఫికేషన్ నుంచి 343.36ఎకరాల భూమిని ఉపసంహరించుకునేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు క్యాబినెట్ అనుమతిని ఇచ్చింది. నీటి సంఘాల సభ్యుల ఎంపికకు, అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు సంబంధించి ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించింది. దీనికోసం రూపొందించిన ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. ఇద్దరుకన్నా ఎక్కువమంది పిల్లలున్నా, ఈ పదవుల్లో కొనసాగటానికి ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఇలాంటి కీలక నిర్ణయాలెన్నింటినో తీసుకున్నారు. ఆ వివరాలను సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. మంత్రిమండలిలో వ్యక్తిగత ఎజెండాలేవీ లేవని, ప్రజా సమస్యలపైనా చర్చించామని పార్థసారథి తెలిపారు. "రాజధాని ప్రాంతంలో రెండో దశ భూసేకరణ అంశంపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదు. స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, పెన్షన్ల పెంపు, దీపం-2 పథకం లబ్ధితోపాటు రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్దేశించారు. అర్హులైన ప్రతి పేదకూ ఇల్లు, ఇంటి స్థలం ఇస్తాం" అని మంత్రి తెలిపారు.

ప్రధాన నిర్ణయాలు..

- ఏపీటూరిజం పాలసీలో కారవాన్ టూరిజాన్ని చేర్చడానికి మంత్రివర్గం ఆమోదం. అలాగే, హోమ్ స్టే/ బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానాన్ని ప్రోత్సహించడానికి ఫ్రేమ్ వర్క్‌ను ఈ పాలసీలో భాగం చేసేందుకు సమ్మతి.
- ఏపీ అసైన్డ్ ల్యాండ్స్(బదిలీల నిషేధం) బిల్లు 2025ను సవరిస్తూ ముసాయిదా బిల్లుకు ఆమోదం.
- ప్రకాశం బ్యారేజ్, దివిసీమ భద్రత, నిర్మాణ పటిష్టతకు రూ.4.49 కోట్లతో వరద మరమ్మతు పనులకు ఆమోదం.
- హంద్రి-నీవా సుజలస్రవంతి ప్రాజెక్టు రెండోదశ కింద రాకెట్ల గ్రామం వద్ద అమిద్యాల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడానికీ, ప్యాకేజీ 52ఏ కింద మిగతా పనులను రూ.72.30కోట్లతో చేపట్టడానికీ అంగీకారం.
- కడప జిల్లాలో మైలవరం ఆనకట్టకు రూ.3,19 కోట్లతో ప్లేట్లు, ఇతర అమరిక పనులు చేపట్టాలని నిర్ణయం.
- తిరుపతి, తిరుమల తాగునీరు అవసరాల కోసం రూ.126.06 కోట్ల వ్యయానికి ఆమోదం.
- అనంతపురం జిల్లా ఉరవకొండ, వజ్రకరూర్, విడపనకల్ మండలాలకు తాగునీరు, 10,500ఎకరాలకు సాగునీరు అందించే కొట్టాలపల్లి ఎత్తిపోతల ద్వారా హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి 100క్యూసెక్కుల నీరు ఎత్తి పోయడానికి రూ.55.60కోట్లతో పనులకు ఆమోదం.
- అనంతపురం జిల్లా మిడ్ పెన్నార్ ప్రాజెక్టుకు రూ.5.20 కోట్లతో రబ్బర్ సీల్స్ మార్పిడి పనులకు ఆమోదం.
- రాష్ట్ర జల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అమృత్ 2.0 అమలుకు రూ.10,319కోట్లమేర పాలనా అనుమతి.
- తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 16.19ఎకరాలు, గుంటూరు జిల్లా వెటర్నరీ ఆఫీసర్స్ హౌసింగ్ సొసైటీకి 10ఎకరాలు కేటాయింపు.
- ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రూ.వెయ్యికోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణంపొంది, దానిని పౌర సరఫరాల సంస్థకు ఇంటర్ కార్పొరేట్ రుణంగా బదిలీ చేసి.. ధాన్య కొనుగోలు బకాయిలను చెల్లించాలని నిర్ణయం.
- నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురంలో ప్రభుత్వ భూమి 174.10ఎకరాలను గ్రీన్కో లిమిటెడ్‌కు రూ.6.25 లక్షలకు ఇవ్వాలన్న ప్రతిపాదనకు ఆమోదం.
- నిరంతరం పని చేసే రిఫరెన్స్ స్టేషన్(సీవోఆర్ఎస్) నెట్‌వర్క్‌ను నేషనల్ ప్లాట్‌ఫాంతో అనుసంధానించేందుకుగాను కుదిరిన అవగాహన ఒప్పందానికి ఆమోదం.
- హిందూమత సంస్థలు, దేవదాయ చట్టం 1987(నంబరు30) సెక్షన్ 19(1-బీ)లోని 'కుష్టు వ్యాధితో బాధపడుతున్నారు' అనే పదం తొలగింపు..

కాళంగి నది 'వరద' పనులు రద్దు

చిత్తూరు-నెల్లూరు జిల్లాల పరిధిలో కాళంగి నది వరద నివారణ కోసం 2009లో నిర్మించతలపెట్టిన ఫ్లడ్ బ్యాంక్ పనులను మంత్రిమండలి రద్దుచేసింది. కాళంగి నది నుంచి తనయాలి ఆనకట్ట వరకు దాదాపు 27.50 కిలోమీటర్ల మేర ఫ్లడ్‌బ్యాంకును నిర్మించాలని భావించారు. దీనికోసం రూ.30.24 కోట్లతో పనులు చేసేందుకు చెన్నైకు చెందిన మెసర్స్ జీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు సంస్థకు పనులు అప్పగించారు. ఈ సంస్థ రూ. 19.05 కోట్లు ఖర్చుచేసి దాదాపు 62 శాతం మేర పనులు చేసింది. మరో రూ.11.29 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉంచింది. భూసేకరణ అంశంలో కోర్టు కేసులు, అటవీ పర్యావరణ అనుమతులు రావడంలోని ఆటంకాల కారణంగా ఫ్లడ్‌బ్యాంక్ పనులు పూర్తికావడం లేదు. కాగా, శ్రీశైలం జలాశయం నుంచి 120 వరద రోజుల్లో రాయలసీమకు తాగునీటిని అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

అమరావతిలో 4 స్టార్ హోటల్

» శంకుస్థాపన చేసిన మంజీరా సంస్థ

తుళ్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని రాయపూడి రెవెన్యూ పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాలతో 4స్టార్ హోటల్ రానుంది. అంతర్జాతీయ ప్రసిద్ధి గాంచిన మంజీరా గ్రూప్ సంస్థ.. రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.275 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఈ ఫోర్ స్టార్ హోటల్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థ అధినేత యోగానంద మాట్లాడుతూ.. 250 గదులు, అందులోనే బార్ ఉండేలా ఈ హోటల్ నిర్మాణం చేస్తున్నట్టు చెప్పారు. సీఎం చంద్రబాబుపై ఉన్న నమ్మకంతోనే రాజధాని అమరావతిలో హోటల్ నిర్మాణం చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. హైదరాబాద్, అహ్మదాబాద్, రాజమండ్రిలో కూడా తమ హోటళ్లు ఉన్నాయని చెప్పారు. అమరావతిలో వనరులకు కొదవ లేదని యోగానంద తెలిపారు.

అమరావతిలో పెట్టుబడులకు సిద్ధం

» ముందుకొచ్చిన మలేషియా పారిశ్రామికవేత్తలు



అమరావతిలో నిర్మించిన ఉద్యోగుల ఇళ్ల టవర్ల వద్ద మలేషియా బృందంతో మంత్రి నారాయణ

అమరావతి/ తుళ్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రాబోయే ఐదేళ్లలో రూ.6వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీలు ముందుకొచ్చాయి. ఆ దేశ మంత్రి, ఎంపీతో కలిసి పారిశ్రామికవేత్తల బృందం ఈ నెల 1 నుంచి అమరావతిలో పర్యటిస్తోంది. దీనిలో భాగం గా ఉద్యోగులు, మంత్రులు, జడ్జీల భవనాలు, ఐఏఎస్, ఐపీఎస్‌ల ఇళ్ల టవర్లను మంత్రి నారాయణతో కలసి బృందం పరిశీలించింది. అనంతరం వెలగపూడి సచివాలయంలో మలేషియా సెలాంగార్ స్టేట్ ఎక్స్‌కో మంత్రి పప్పారాయుడు, క్లాంగ్ ఎంపీ గనబతిరావ్, మాలేసియా-ఆంధ్రా బిజినెస్ చాంబర్ ప్రతినిధులు, పలు ప్రైవేట్ సంస్థల ప్రతినిధులతో నారాయణ భేటీ అయ్యారు. అమరావతి అభివృద్ధికి భారత్‌తో కలిసి పనిచేస్తామని మంత్రి పప్పారాయుడు తెలిపారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

» జపాన్ పారిశ్రామికవేత్తలకు మంత్రి టీజీ భరత్ పిలుపు

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ జపాన్‌లోని పారిశ్రామికవేత్తలను కోరారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న ఆయన ఆ దేశ పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ పెద్దలతో వరుస భేటీలు నిర్వహిస్తూ ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను వారికి వివరిస్తున్నారు. శుక్రవారం కుమామోటో సిటీ గవర్నర్‌ను కలిసి.. నవంబరు 14, 15వ తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న సీఐఐ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానం అందించారు. కాగా, విశాఖలో సీఐఐ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సుకు రావాలని ఫ్రాన్స్ దేశ పారిశ్రామికవేత్తలను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆహ్వానించారు. ఫ్రాన్స్‌లో ప్రముఖ పునరుత్పాదక విద్యుత్తు సంస్థ అయిన ఈడీఎఫ్ ప్రతినిధులతోనూ మంత్రి భేటీ అయ్యారు.

ఈఈఎస్ఎల్ జాతీయ సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డి

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) జాతీయ సలహాదారుగా ఎ. చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఈఈఎస్ఎల్‌కు సీనియర్ సలహాదారుగా వ్యవహరించిన ఆయన... ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్‌కి సుమారు దశాబ్ద కాలంపాటు సేవోగా పనిచేశారు.

నేడు 'ఆటో డ్రైవర్ల సేవలో'..!



డ్రైవర్ల సంక్షేమం కోసం కొత్త పథకానికి నేడు శ్రీకారం

» హామీ ఇవ్వకున్నా పథకం అమలుకు నిర్ణయం

» క్యాబినెట్‌లో భేటీలో ఏకగ్రీవ ఆమోదం

» ఆటో, క్యాబ్, ట్యాక్సీ వాహనదారులు 2.90 లక్షల మందికి రూ.436 కోట్ల లబ్ధి

» ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున జమ

» ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో డ్రైవర్ల ఆర్థిక సమస్యలు తగ్గించడమే లక్ష్యం

అర్హులైన డ్రైవర్లు వీరే..
ఆటో వాలాలు: 2,25,621
త్రీ వీలర్ ప్యాసింజర్: 38,576
మోటార్ క్యాబ్: 20,072
ట్యాక్సీ క్యాబ్: 6,400

నాడు-నేడు.. బోత్ ఆర్ నాట్ సేమ్!

జగన్ ఇచ్చింది: 10 వేలు
బాబు ఇస్తోంది: 15 వేలు(అదనం: 5 వేలు(50%))

మహా లబ్ధి!!

జగన్ హయాంలో: 2,61,516
ప్రస్తుత ప్రభుత్వంలో: 2,90,669(అదనం: 29,153)

నాడు ఖేదం.. నేడు మోదం!

జగన్ ఇచ్చిన సొమ్ము: రూ.261,51,60,000
బాబు ఇస్తున్న సొమ్ము: రూ.436,00,35,000(అదనం: రూ.174,48,75,000)

అత్యధికం: విశాఖపట్నం-22,955 మంది డ్రైవర్లకు రూ.34.43 కోట్ల లబ్ధి
అత్యల్పం: అల్లూరి జిల్లా-4,217 మంది డ్రైవర్లకు రూ.6.32 కోట్ల లబ్ధి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం శనివారం విజయవాడ వేదికగా మరో సంక్షేమ పథకానికి శ్రీకారం చుడుతోంది. ఆటో, క్యాబ్, ట్యాక్సీలను సొంతంగా కలిగి ఉండి.. వాటిని నడుపుకొంటూ కుటుంబాలను పోషించుకునే డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. 'స్త్రీ శక్తి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించటంతో ఆటో, క్యాబ్, ట్యాక్సీలకు గిరాకీ తగ్గింది. దీంతో వారంతా ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో వారి ఆవేదనను అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు.. "మీరు ఆందోళన చెందవద్దు. మీకూ సంక్షేమ పథకం ప్రవేశపెడతా." అని అనంతపురం జిల్లాలో నిర్వహించిన 'సూపర్ సిక్స్-సూపర్‌హిట్' సభలో ప్రకటించారు. అంతేకాదు, ఈ పథకాన్ని దసరా నుంచే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం విజయవాడ వేదికగా ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రారంభించనున్నారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' పేరుతో అమలు చేయనున్న ఈ పథకానికి శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో శనివారం ఉదయం 11 గంటలకు విజయవాడ, అజిత్‌సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరు కానున్నారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున రూ.436 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

అత్యధికం విశాఖకే!

ఈ పథకంలో విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 22,955 మంది డ్రైవర్లకు రూ.34.43 కోట్ల లబ్ధి కలగనుంది. నెల్లూరులో 17,405 మందికి రూ.26.10 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాలో 16,405 మందికి రూ.24.60 కోట్లు, విజయనగరంలో 15,479 మందికి రూ.23.21 కోట్లు, శ్రీకాకుళంలో 13,887 మందికి రూ.20.83 కోట్లు, అనకాపల్లిలో 13,753 మందికి రూ.20.62 కోట్లు, కర్నూలులో 13,495 మందికి రూ.20.24 కోట్లు, గుంటూరులో 13,204 మందికి 19.80 కోట్లు, తిరుపతి జిల్లాలో 13,125 మందికి రూ.19.68 కోట్లు, కాకినాడలో 12,966 మందికి రూ.19.44 కోట్లు, తూర్పుగోదావరిలో 11,915 మందికి రూ.17.87 కోట్లు, కడపలో 11,456 మందికి రూ.17.18 కోట్లు, ప్రకాశంలో 11,356 మందికి రూ.17.03 కోట్లు, కృష్ణాలో 11,316 మందికి రూ. 16.97 కోట్లు, ఏలూరులో 10,655 మందికి రూ.15.98 కోట్లు, నంద్యాలలో 9,569 మందికి రూ.14.35 కోట్లు, అనంతపురంలో 9,275 మందికి రూ.13.91 కోట్లు, పల్నాడులో 8,884 మందికి రూ.13.32 కోట్లు, పశ్చిమ గోదావరిలో 8,489 మందికి రూ.12.73 కోట్లు, కోనసీమలో 7,709 మందికి రూ.11.56 కోట్లు, బాపట్లలో 6,859 మందికి రూ.10.28 కోట్లు, చిత్తూరులో 6,777 మందికి రూ.10.16 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 4,963 మందికి రూ.7.44 కోట్లు, అల్లూరి జిల్లాలో 4,217 మందికి రూ.6.32 కోట్ల మేర నిధులు జమ చేయనున్నారు.

చెప్పకున్నా చేస్తూ..

ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం ఇచ్చే అంశాన్ని ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పలేదు. అయితే, 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న వాహన డ్రైవర్లకు సాయం అందించాలని సీఎం చంద్రబాబు అప్పటికప్పుడు నిర్ణయించారు. అర్హులైన వారు ఎవ రూ నష్టపోకూడదని కూడా ఆదేశించారు. దీంతో అర్హులై ఉండి కూడా ఈ పథ కం అందకపోతే ఫిర్యాదుల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు.

జగన్ ఇచ్చిన దానికంటే 5 వేలు అదనం..

జగన్ హయాంలో 'వాహన మిత్ర' పేరుతో ఆటో డ్రైవర్లకు ఏడాదికి కేవలం రూ.10 వేలు మాత్రమే ఇచ్చారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.15 వేలు చొప్పున ఇవ్వనుంది. అంతేకాదు.. వైసీపీ ప్రభుత్వం కేవలం 2,61,516 మంది లబ్ధిదారులను మాత్రమే అర్హులుగా గుర్తించి, రూ.261.51 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. జగన్ ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రస్తుత ప్రభుత్వంలో సుమారు 30 వేల మంది లబ్ధిదారులు పెరిగారు. వైసీపీ ప్రభుత్వం కంటే అదనంగా రూ.5 వేలు ఇస్తుండడంతో డ్రైవర్లకు రూ.175 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతోంది.

కంట్రోల్‌లో పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశపూర్వకంగానో, మరే కారణంతోనో పార్టీ నిర్దేశించిన గీత దాటారని, ఇది మున్ముందు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఇన్‌చార్జి మంత్రులను కోరారు. అసెంబ్లీ జరిగే సమయంలో ఎమ్మెల్యేలకు ఏం మాట్లాడాలో.. ఏం మాట్లాడకూడదో చెప్పాలని సీఎం సూచించారు. ఇన్‌చార్జి మంత్రులు తమ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలతో తరచూ మాట్లాడుతూ, రాజకీయంగా సమన్వయం చేసుకుంటూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. శాఖాపరంగా ఎలాంటి విమర్శలకూ అవకాశం ఇవ్వకుండా మంత్రులు పనిచేయాలని, ఒకవేళ ఏదైనా విమర్శ వచ్చినా వెంటనే స్పందించాలని కోరారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వం చూపినా అందరం నష్టపోతామని చంద్రబాబు అన్నారు.

నీటిపారుదల శాఖ పనితీరు భేష్

చరిత్రలో తొలిసారి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రిజర్వాయర్లలో వాటి సామర్థ్యంలో 93 శాతం మేర నీటిని నింపగలిగామని సీఎం మంత్రులతో అన్నారు. విజన్ 2047లో భాగంగా పెట్టుకున్న 10 ప్రధాన సూత్రాల్లో నీటిభద్రత ఒకటని, ఆ దిశగా అడుగులు వేయడంలో ఇది కీలక పరిణామమన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులకు ఈ సందర్భంగా సీఎం అభినందనలు తెలిపారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (సీహెచ్ఏఎం) బాగుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆ శాఖ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనులన్నింటినీ ఇదే విధానంలో చేస్తున్నారని, ఫలితంగా శాఖపై ఆర్థికభారం తగ్గిందని తెలిపారు. అదే సమయంలో కేంద్రం నుంచి, ఇతర ఏజెన్సీల నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈ విధానాన్ని తమ తమ శాఖల్లోని అభివృద్ధి పనులకు అమలు చేసే విషయాన్ని పరిశీలించాలని సీఎం కోరారు. దేశంలోని తూర్పు ప్రాంత రాష్ట్రాల్లో కనెక్టివిటీ, పారిశ్రామిక ఉత్పత్తి, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన పూర్వోదయ పథకంలో ఏపీని కూడా చేర్చారని, ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారులు, రైల్వేలు, జలమార్గాలు, విద్యుత్తు ఉత్పత్తి పెంపునకు పూర్వోదయ పథకం దోహదపడుతుందని, హార్టీకల్చర్, ఆక్వాకల్చర్ వంటి రంగాలకు ఊపు తెస్తుందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రానికి రానున్న రెండుమూడేళ్లలో సుమారు రూ.65 వేల కోట్లు వచ్చే అవకాశం ఉందని సీఎం మంత్రులకు వివరించారు. గోకులాల ఏర్పాటును వేగవంతం చేయాలని, మంత్రులందరూ ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీలైనన్ని ఎక్కువ గోకులాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. వీటి ద్వారా స్థానికులకు ఆదాయం సమకూరేలా చూడాలని కోరారు. కడపలో జిందాల్ ఉక్కు కర్మాగారాన్ని 2028 కల్లా పూర్తి చేస్తామని మంత్రులకు సీఎం తెలిపారు.

విజయవాడ ఉత్సవ్..భేష్

ప్రధాన నగరాల్లోనూ నిర్వహించండి : సీఎం

విజయవాడ ఉత్సవ్‌పై సీఎం ప్రశంసలు కురిపించారు. ఇలాంటి స్థానిక ఉత్సవాలు రాష్ట్రమంతా నిర్వహించడం వల్ల అన్నివర్గాలకూ ప్రయోజనం కలుగుతుందని, ఇలాంటి ఉత్సవాల నిర్వహణపై మంత్రులు దృష్టి సారించాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లో నెలకో ఉత్సవాన్ని నిర్వహించే విషయాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు.



గురువారం విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛతా మారథాన్‌లో పాల్గొన్న జనం



కృష్ణా జలాల్లో హంస వాహనంపై దుర్గమ్మవారు, అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



దసరా సందర్భంగా విజయవాడ బందరు రోడ్డులో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు, క్రీడాకారులు, జనం

దుర్గమ్మ @ 15 లక్షల మంది

- ఇంద్రకీలాద్రికి రికార్డు స్థాయిలో భక్తుల రాక
- గతేడాది కంటే 15 శాతం పెరిగిన భక్తులు

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు ఈ ఏడాది భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల ప్రారంభం రోజు నుంచి విజయదశమి వరకు రికార్డు స్థాయిలో భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. గత ఏడాది కంటే ఈసారి 15 శాతం ఎక్కువగా భక్తులు వచ్చారు. ఇంద్రకీలాద్రిపై సెప్టెంబరు 22 నుంచి ఈ నెల 2 వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. గతేడాది దాదాపు 13 లక్షల మంది భక్తులు రాగా.. ఈ ఏడాది శుక్రవారం సాయంత్రం వరకు 15,03,487 మంది అమ్మవారిని దర్శించున్నారు. ఇంకా ఏపీ, తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో భవానీ మాల ధరించిన భక్తులు ఇంద్రకీలాద్రికి భారీగా చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం భక్తుల రాక సంఖ్య అధికారులు వేసుకున్న అంచనాలకు తగ్గట్టుగానే 20 లక్షలకు చేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి. విజయదశమి రోజున అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా.. శుక్రవారం ఈ అలంకారంలోనే ఉన్నారు.


ఖాదీ సంత గ్లోబల్‌గా ఎదగాలి: సీఎం చంద్రబాబు

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తుల కొనుగోళ్ల లక్ష్యంతో మొదలైన ఖాదీ సంత రాబోయే రోజుల్లో గ్లోబల్ సంతగా ఎదగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. విజయవాడలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఖాదీ సంత కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. ఖాదీ సంత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. రాట్నంపై నూలు వడికారు. అనంతరం మాట్లాడుతూ.. స్వదేశీ ఉత్పత్తుల పేరిట ఏర్పాటు చేసిన ఈ ఖాదీ సంత విజయం సాధిస్తుందని చెప్పారు. ఖాదీ సంత.. భారతీయ ఉత్పత్తులకు గ్లోబల్ సంతగా మారుతుందన్నారు. ఆర్థికంగా అగ్రస్థానానికి చేరటమే దేశం ముందు లక్ష్యమన్నారు. రాష్ట్ర ఉత్పత్తులకు బ్రాండింగ్ వచ్చేలా చేయాలని కోరారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కొబ్బరి ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు ఇలా వేర్వేరు నాణ్యమైన ఉత్పత్తులు తయారు అవుతున్నాయని, వాటికి మనమే ప్రచారం చేసుకోవాలని సూచించారు. కళల్ని, చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా.. చేనేత కళాకారులు నేసిన అగ్గిపెట్టిలో పట్టే చీరను బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు చంద్రబాబు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆనందాంధ్రను సాకారం చేస్తాం

నా జీవితాశయం ఒక్కటే. నాపై నమ్మకం ఉంచి గెలిపించినందుకు ప్రతి ఒక్కరినీ ఆనందంగా ఉంచేందుకు, ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు బాధ్యత తీసుకొని ఏం చేయాలో అది చేస్తా. అందరూ ఆశీర్వదించి సహకరిస్తే ఆనందంగా ఉండే సమాజాన్ని నిర్మిస్తా.

ఏడాదిన్నర క్రితం వరకూ రాష్ట్ర ప్రజల ముఖాల్లో ఆనందం కనిపించలేదు. ఆ సమయంలో భయంభయంగా గడిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజలకు స్వేచ్ఛ లభించింది.



- నన్ను నమ్మి ఎంతో గొప్పగా ఆదరించారు
- మిమ్మల్ని ఆనందంగా ఉంచుతా.. నాది హామీ
- 'విజయవాడ ఉత్సవ్' ముగింపు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

విజయవాడ(ఇబ్రహీంపట్నం)/విజయవాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి, సాంకేతికతతో పాటు రాష్ట్రప్రజల ఆనందం కోసం విజయవాడ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలతో 'ఆనందాంధ్ర ప్రదేశ్‌'ను సాకారం చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. 'విజయవాడ ఉత్సవ్' ముగింపు వేడుకల సందర్భంగా గురువారం గొల్లపూడిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దసరా పండుగ గొప్పతనాన్ని చాటిచెప్పేలా విజయవాడ ఉత్సవ్ విజయవంతమైందని తెలిపారు. ఒకప్పుడు దసరా ఉత్సవాలంటే మైసూరు, కోల్‌కతా గుర్తొచ్చేవని, ఇప్పుడు విజయవాడ కూడా వాటి సరసన చేరిందని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్‌ను నగరంలో ఆరు ప్రాంతాల్లో నిర్వహిస్తే 2.5 లక్షల మంది వచ్చారని, దాదాపు 280 కార్యక్రమాలతో అద్భుతంగా చేశారని కొనియాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

"గత ప్రభుత్వంలో అంతా విధ్వంసమే, దాడులు, కేసులు తప్ప ఏమీ లేదు. మా మిత్రులు పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి మీ దగ్గరకు వచ్చి అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ఇస్తామని చెప్పాం. మమ్మల్ని నమ్మి 57శాతం ఓట్లు, 94 శాతం అభ్యర్థుల గెలుపుతో చరిత్ర సృష్టించేలా గెలిపించారు. మీ అందరినీ సంతోషంగా ఉంచాలన్న ఆలోచనలు చేస్తున్నాం. మరోపక్క అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం.'

అమరావతిని ట్రాక్‌లో పెట్టాం

'భవిష్యత్తులో కృష్ణా జిల్లాకు నీటి కొరత ఉండదు, ఉండబోదు. ఒకపక్క దుర్గమ్మ తల్లి ఆశీస్సులు, మరో పక్క కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న దృశ్యాలను చూస్తుంటే కనుల పండువగా ఉంది. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే 2020 నాటికి పోలవరం కూడా పూర్తిచేసి జాతికి అంకితం చేసేవాళ్లం. కేంద్రం ఇచ్చిన రూ.15వేల కోట్లతో అమరావతిని తిరిగి ట్రాక్‌లో పెట్టాం. రూ. 50లక్షల కోట్ల పైబడి అమరావతి రాజధాని నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాం.'



విజయవాడ దసరా ఉత్సవాల కార్నివాల్‌కు గిన్నిస్ రికార్డు అందుకుంటున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఎంపీ శివనాథ్, పీవీ సింధు, పట్టాభి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు గద్దే రామ్మోహన్, బొండా ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు

అధికార యంత్రాంగానికి సీఎం ప్రశంసలు

ఇంద్రకీలాదిపై నిర్వహించిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు విజయవంతం కావడంపై సీఎం అధికార యంత్రాంగాన్ని అభినందించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన 13 లక్షల మంది భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిందని ప్రశంసించారు. అమ్మలగన్న అమ్మ దయతో ప్రజలకు, రాష్ట్రానికి మంచి జరగాలని వేడుకుంటున్నానంటూ ట్వీట్ చేశారు.

సీఎంను ఆకట్టుకున్న రోబో చెఫ్

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలోని ఎగ్జిబిషన్‌ను చంద్రబాబు సందర్శించారు. ఫుడ్ పెవిలియన్‌లోని రోబోటిక్ చెఫ్‌ను ఆయన ఆసక్తిగా గమనించారు. అది ఏఐ విధానంలో పనిచేస్తుందని పారిశ్రామికవేత్త అనిల్ సుంకర వివరించారు. చంద్రబాబు ఒక ఐటమ్‌ను ఆర్డర్ చేయగానే.. రోబో చెఫ్ స్టౌ వెలిగించి, గిన్నె పెట్టి నూనె పోసి కావాల్సినవన్నీ వేసి గరిటెతో తిప్పుతూ రుచికరమైన వంటకాన్ని వండి డెలివరీ చేసింది. ఆ వంట రుచి ఎలా ఉందో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)తో కలిసి సీఎం రుచి చూశారు.

మెగా కార్నివాల్‌కు గిన్నిస్ రికార్డు

విజయవాడ ఉత్సవ్ ముగింపు సందర్భంగా బందరు రోడ్డులో 3 వేల మంది కళాకారులతో నిర్వహించిన మెగా కార్నివాల్ అరుదైన ఘనత సాధించింది. 2 కిలోమీటర్ల పొడవున సాగిన ఈ ప్రదర్శనలో అత్యధిక మంది డప్పు కళాకారులు పాల్గొన్నందుకు గిన్నిస్ రికార్డు లభించింది. ఈ ప్రదర్శనను సీఎం చంద్రబాబు, స్టార్ షట్లర్ పీవీ సింధు ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శన పూర్తయిన తర్వాత గిన్నిస్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను సీఎంకు ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఏపీతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన 40కి పైగా డప్పు కళా రూపాలు ఈ ప్రదర్శనలో ఆవిష్కృతమయ్యాయి. ఇంద్రకీలాద్రి దేవస్థానం అధికారులు సిద్ధం చేసిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల శకటం ఆకట్టుకుంది.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు

- చిత్తూరు జిల్లాలో రాజకీయ దుమారం



పాక్షికంగా కాలిన అంబేడ్కర్ విగ్రహం

అమరావతి, వెదురుకుప్పం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం దేవళంపేటలో గురువారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన జరిగింది. సమాచారం తెలుసుకున్న సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రులు వంగలపూడి అనిత, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి సూచించారు. ఈ ఘటన టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య రాజకీయ రగడకు ఆజ్యం పోసింది. వివిధ పార్టీల శ్రేణులు, దళిత సంఘాల ప్రతినిధులు దేవళంపేట చేరుకొని దోషులను కఠినంగా శిక్షించాలని నిరసనలకు దిగారు. ఈ ఘటన వెనుక వున్న బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తదితరులపై కేసు నమోదు చేయాలని టీడీపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. బొమ్మయ్యపల్లె గ్రామ కార్యదర్శి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పాక్షికంగా కాలిపోయిన విగ్రహం స్థానంలో కొత్తగా అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. శుక్రవారం రాత్రి 8గంటలకు కొత్త విగ్రహానికి పాలాభిషేకం చేయడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది. కాగా, అంబేడ్కర్‌కు అవమానం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి డోలా హెచ్చరించారు.

ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు ఉత్తర్వులు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలు చేపడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దంపతులు, పరస్పర అవగాహన విభాగాల్లో బదిలీలు చేపడుతూ జీవో 291 విడుదల చేసింది. దంపతుల విభాగం కింద 134మంది, పరస్పర అవగాహన కింద 248 మందిని బదిలీ చేస్తూ జిల్లాల వారీగా జాబితాను విడుదల చేసింది. బదిలీ పొందిన వారు తక్షణమే జిల్లా విద్యాశాఖాధికారి, రీజనల్ విద్యాశాఖాధికారి వద్ద హాజరు కావాల్సి ఉంటుందని తెలిపింది.

గ్రేడ్-2 భాషా పండితులకు పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేడ్-2 భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో 1,200మంది భాషా పండితులు, 300 మంది పీఈటీల పదోన్నతులకు అవకాశం ఏర్పడింది. గ్రేడ్-2 భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని చాలాకాలం నుంచి టీచర్లు, సంఘాలు ఆందోళన చేస్తూ వచ్చారు. ఇటీవల హైకోర్టులో వారికి అనుకూలంగా తీర్పులొచ్చిన నేపథ్యంలో వారికి పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

పోలవరం పనులు చకచకా!

- వైబ్రో కంపాక్షన్ పనులు 74% డయాఫ్రమ్ వాల్ 56% పూర్తి
- 41.15 మీటర్ల కాంటూరులో భూసేకరణకు 1,107 కోట్లు అవసరం
- ఎల్లుండి కేంద్ర జలశక్తి మంత్రితో మంత్రి రామానాయుడు సమావేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నా.. పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ పనులు జోరుగా సాగుతున్నాయి. 2027, డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్న నేపథ్యంలో ప్రధాన డ్యామ్ పనులు వేగవంతంగా చేపడుతున్నారు. రుతుపవనాలకు ముందుగానే, ఎగువనుంచి వరద రాకమునుపే సమాంతర డయాఫ్రమ్‌వాల్‌లో క్లిష్టంగా, లోతుగా ఉండే చోట పనులు ప్రారంభించారు. దీంతో 63,656 క్యూబిక్ మీటర్లకు గాను, 37,302(56%) క్యూబిక్ మీటర్ల పనులు పూర్తిచేశారు. మిగిలిన 44శాతం పనులు ఈ డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని జల వనరుల శాఖ తెలిపింది. హెడ్‌వర్క్స్‌లో అత్యంత కీలకమైన బట్రెస్‌ను పూర్తి చేశారు. క్లేరీచ్ (బంకమన్ను ప్రాంతం)లో వైబ్రో కంపాంక్షన్‌ను 16.19క్యూబిక్ మీటర్లకుగాను 11.93(74%) క్యూబిక్ మీటర్లమేర పూర్తి చేశారు. ఈ పనులను కూడా డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే, ఈ నెల 6న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు భేటీ కానున్నారు. ఈ సమావేశంలో పోలవరం పురోగతిని వివరించనున్నారు.

వచ్చే నెల నుంచే ఈసీఆర్ఎఫ్ పనులు

డయాఫ్రమ్‌వాల్ నిర్మాణాన్ని ఈ డిసెంబరు 31నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్న జల వనరుల శాఖ.. భవిష్యత్తు కార్యాచరణపైనా ప్రణాళికలు సిద్ధం చేసింది. డయాఫ్రమ్‌వాల్ పనులు పూర్తయ్యాక దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తే, పూర్తి చేసేందుకు 2 నీటి సంత్సరాలు పడుతుంది. అంటే.. 2026, 2027 సంవత్సరాలలో ఈసీఆర్ఎఫ్ పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో డిసెంబరు 31నాటికి డయాఫ్రమ్‌వాల్ పనులు పూర్తయ్యేలోగా వచ్చేనెల నుంచే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ప్రారంభించాలని జలవనరుల శాఖ ఆలోచిస్తోంది. 2027, జూలై నాటికి ఈసీఆర్ఎఫ్ పనులు పూర్తవుతాయని, దీనివల్ల నిర్దేశిత లక్ష్యం 2027, జూలై నాటికి పూర్తి చేయవచ్చని భావిస్తోంది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ డిజైన్లు అంతర్జాతీయ నిపుణుల కమిటీ, కేంద్ర జల సంఘం వద్ద పెడింగ్‌లో ఉన్నాయని, అవన్నీ డిసెంబరు నాటికి ఆమోదం పొందుతాయని ఆశిస్తోంది. పోలవరం నిర్వాసితులకు సహాయ, పునరావాసానికి నిధులివ్వడమే ప్రధాన సమస్యగా మారింది. 2024-25లో రూ.5,052.71 కోట్లను కేంద్రం విడుదల చేసింది. వీటిలో రూ.1,830 కోట్లను ఏకీకృత ఖాతాకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయాలి. కేంద్రం నుంచి నిధులు వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంది. కానీ, జలశక్తిశాఖ ఆదేశించిన మేరకు పోలవరం కోసం ప్రత్యేక ఖాతాను ప్రారంభించినా ఇంకా రాష్ట్రప్రభుత్వం నుంచి దానిలోకి పూర్తిగా నిధులు మళ్లింపు జరగలేదు. దీనిపై కేంద్రం ఇటీవల అసహనం వ్యక్తం చేసింది. మరో రూ.1830 కోట్లను పోలవరం ప్రత్యేక ఖాతాలోకి మళ్లిస్తే సహాయ, పునరావాస కార్యక్రమాలను చేపట్టేందుకు వీలుంటుందని జల వనరుల శాఖ చెబుతోంది. మరోవైపు, 41.15 మీటర్ల కాంటూరులో భూసేకరణ, పునరావాసం కోసం.. రూ.1,107 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు.

పుష్కరాల నాటికి పోలవరం పూర్తి!

- జలవనరుల సమీక్షలో సీఎం చంద్రబాబు

వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని జల వనరుల శాఖకు సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని నిర్దేశించారు. వచ్చే ఏడాది జనవరి నాటికి ఎడమ ప్రధాన కాలువను ప్రారంభించేలా పనులు పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల నుంచి పోలవరం ప్రధాన డ్యామ్ ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్(ఈసీఆర్ఎఫ్) పనులు ప్రారంభించాలన్నారు. అమరావతి సచివాలయంలో శుక్రవారం ఆయన పోలవరం ప్రాజెక్టు ప్రగతిపై సమీక్షించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎంవో కార్యదర్శి రాజమౌళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు.. పర్యాటకులను ఆకర్షించేలా రూపొందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రాజెక్టు నుంచి భద్రాచలం, పాపికొండలు, దిగువన ధవళేశ్వరం వరకు వివిధ ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. ప్రాజెక్టుకు కనెక్టయ్యే రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా డిజైన్లు చేయాలని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు

- అదే నెల 1 నుంచి ప్రాక్టికల్ ఎగ్జామ్స్
- షెడ్యూల్ విడుదల చేసిన ఇంటర్ బోర్డు

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను ఫిబ్రవరి 23 నుంచి నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు సెక్రటరీ నారాయణ్ భరత్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ పరీక్షలు మార్చి 24న ముగియనున్నాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరగనున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 1న ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో పాటు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జనవరి 21న, పర్యావరణ పరీక్ష జనవరి 23ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు నిర్వహిస్తామన్నారు.

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి/మార్చి -2026

తేదీ	మొదటి సంవత్సరం	తేదీ	రెండో సంవత్సరం
23-02-2026 సోమవారం	తెలుగు/సంస్కృతం/ఉర్దూ/హిందీ/తమిళ్/ఒడియా/కన్నడ/అరబిక్/ఫ్రెంచ్/పర్షియన్ పేపర్-1	24-02-2026 మంగళవారం	పార్ట్-2 సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2
25-02-2026 బుధవారం	ఆంగ్లం పేపర్-1	26-02-2026 గురువారం	పార్ట్-1 ఆంగ్లం పేపర్-2
27-02-2026 శుక్రవారం	హిస్టరీ పేపర్-1	28-02-2026 శనివారం	బోటనీ పేపర్-2 హిస్టరీ పేపర్-2
02-03-2026 సోమవారం	గణితం పేపర్-1	03-03-2026 మంగళవారం	గణితం పేపర్-2ఏ సివిక్స్ పేపర్-2
05-03-2026 గురువారం	బయాలజీ పేపర్-1	06-03-2026 శుక్రవారం	జువాలజీ పేపర్-2 ఎకనమిక్స్ పేపర్-2
07-03-2026 శనివారం	ఎకనమిక్స్ పేపర్-1	09-03-2026 సోమవారం	గణితం పేపర్-2బీ
10-03-2026 మంగళవారం	ఫిజిక్స్ పేపర్-1	11-03-2026 బుధవారం	కామర్స్ పేపర్-2 సోషియాలజీ పేపర్-2 ఫైన్‌ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2
12-03-2026 గురువారం	కామర్స్ పేపర్-1	13-03-2026 శుక్రవారం	ఫిజిక్స్ పేపర్-2
14-03-2026 శనివారం	సివిక్స్ పేపర్-1	16-03-2026 సోమవారం	మోడరన్ ల్యాంగ్వేజ్ పేపర్-2 జియోగ్రఫీ-2 బ్రిడ్జికోర్సు గణితం-2(బైపీసీ విద్యార్థులకు)
17-03-2026 మంగళవారం	కెమిస్ట్రీ పేపర్-1		
20-03-2026 శుక్రవారం	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1 లాజిక్ పేపర్-1	18-03-2026 బుధవారం	కెమిస్ట్రీ పేపర్-2
24-03-2026 మంగళవారం	మోడరన్ లాంగ్వేజ్ పేపర్-1 జాగ్రఫీ పేపర్-1	23-03-2026 సోమవారం	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2 లాజిక్ పేపర్-2

నెత్తురోడిన దేవరగట్టు

- కర్రల సమరంలో ఒకరు మృతి.. గుండెపోటుతో మరొకరు

కర్నూలు/ ఆలూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా హొళగుంద మండలంలోని దేవరగట్టు క్షేత్రం.. మరోసారి నెత్తురోడింది. ఇక్కడ దసరా పర్వదినాన బన్ని జైత్రయాత్ర ఉత్సవాలు ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులు మాళ మల్లేశ్వరస్వాముల పల్లకిని వశం చేసుకోవడం కోసం సాగే బన్ని ఉత్సవం కర్రల సమరాన్ని తలపిస్తుంది. నెరణికి, నెరణికితండ, కొత్తపేట గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు కాగడాలు, కర్రలు చేతపట్టుకొని దైవకార్యం విజయవంతంగా నిర్వహించాలని దొళ్లబండ వద్దకు చేరుకున్నారు. దేవరగట్టు కొండపైన మాళ మల్లేశ్వరుల కల్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తుల పల్లకితో బసవన్నగుడి సమీపానికి చేరుకోబోతుండగా అప్పటికే అక్కడున్న అరికెర గ్రామస్థులు కర్రలతో నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల భక్తులను అడ్డుకున్నారు. పరిస్థితిని పసిగట్టిన ఆ మూడు గ్రామాల భక్తులు పల్లకి చుట్టూ రక్షణగా చేరారు. అరికెర గ్రామస్థులతో పాటు వారికి మద్దతుగా వచ్చిన ఎల్లార్తి, అరికెరతండా, సులవాయి, ఆలూరు భక్తులపై మూకుమ్మడిగా తిరగబడ్డారు. క్షణాల్లో రాళ్ల వర్షం కురిసింది. వేలాది కర్రలు తలలపై నాట్యమాడాయి. మూడు గ్రామాల భక్తులు కర్రలతో తిరగబడటంతో అరికెర గ్రామస్థులు తలో దిక్కుకు పరుగులు తీశారు. ఈ ఘర్షణలో అరికెర గ్రామానికి చెందిన కోసిగి తిమ్మప్ప(50) తలకు తీవ్ర గాయాలుకావడంతో ఆలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మరో 94మంది తలలు పగిలి రక్తగాయాలయ్యాయి. కాగా, ఆదోని పట్టణం అరుణజ్యోతి నగర్‌కు చెందిన ఆంజనేయులు(47) గుండెపోటుకు గురై మృతిచెందారు.



ఉత్సవానికి కర్రలు పట్టుకుని పరుగులు తీస్తున్న అరికెర, అరికెరతండా ప్రజలు



అగ్ని కాగడాలను విసురుకుంటూ కర్రలతో కొట్టుకుంటున్న ప్రజలు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.